శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

‘పిఎం-కిసాన్’ మరో ఐదేళ్లు పొడిగింపు

రూ. 3.15 లక్షల కోట్లు కేటాయింపు

‘ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన’కు రూ.5,070 కోట్లు

07

రూ.84,084 కోట్ల విలువైన ‘సముద్ర మంథన్’ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

సంపుటి 09, సంచిక: 242 | శనివారం | 01-08-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఆగస్టులోనూ లోటు

● మలిదశ వర్షాకాలంలో సాధారణంకన్నా తక్కువ వర్షపాతం ● ఆగస్టు-సెప్టెంబరులో దేశవ్యాప్త సగటు వర్షపాతం 94 శాతం లోపు ● జూన్, జులై నెలల మధ్య కాలానికి సంబంధించి 13 శాతం లోటు వర్షపాతం : ఐఎండి అంచన

**న్యూఢిల్లీ :** ఆగస్టు, సెప్టెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ శుక్రవారం తన నెల వారీ అంచనాలు వెల్లడించింది. వర్షాకాల మలి దశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆగస్టు, సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్‌పిఎ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు–సెప్టెంబర్ కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్‌పిఎ) 422.8 మి.మీ.గా ఉంది. వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, ‘ఆగస్టు–సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య భారతదేశం, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది’ అని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆగస్టు నెలలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని ఐఎండి అంచనా వేసింది. 1971–2020 గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో దేశంలో వర్షపాతం ఎల్‌పిఎ 254.9 మి.మీ.గా ఉంది. ప్రస్తుతం, జూన్, జులై నెలల మధ్య కాలానికి సంబంధించి 13 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెలాఖరు నాటికి ఈ లోటు తరువాయి 8లో

# టామ్‌కామ్‌దే బాధ్యత

● ఉద్యోగాలకు శిక్షణ, మేళాలు, పాస్‌పోర్ట్, ఉద్యోగ అవకాశాలు కల్పించేవరకు దగ్గరుండి చూసుకోవాలి ● ‘శక్తి’ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ● కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్లు, వారు పంపించే కార్మికుల వివరాలు నమోదు ● టామ్‌కామ్‌కు సిఇఒగా మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి నియామకం ● డిమాండ్‌కు తగినట్లు నర్సింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతో పాటు ఉద్యోగార్థులకు అవసరమైన పాస్‌పోర్ట్, వివిధ దేశాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను తెలంగాణా ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ‘శక్తి శాఖ’పై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బందిపడుతున్నారని సిఎం తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి పాస్‌పోర్ట్‌లు ఇప్పించడంతో పాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలను టామ్‌కామ్ చేసుకోవాలని సిఎం సూచించారు. విదేశీ కంపెనీలతో టామ్‌కామ్ ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి వారు పంపించే ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాలని సిఎం సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్‌కామ్‌కు మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారిని సిఈఓగా నియమిస్తామని సిఎం ప్రకటించారు. ఉద్యోగార్థులకు లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇప్పించాలని ఆయన సూచించారు.

**స్కిల్ యూనివర్సిటీల్లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో తరువాయి 8లో



## రాష్ట్రంలో మరోసారి ‘సర్’ పొడిగింపు

10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం


ఇప్పటికే 77 శాతం ప్రక్రియ పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పెంచుతూ శుక్రవారం నిర్ణయం వెలువడింది. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24 వరకు గడువు నిర్ణయించగా, అనంతరం దానిని ఆగస్టు 3 వరకు పొడిగించారు. తాజాగా మరోసారి గడువు పెంచడంతో ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనతో పాటు ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు అవకాశం లభించింది.

**77 శాతం పూర్తయిన సర్వే**

రాష్ట్రవ్యాప్తంగా తరువాయి 12లో



## సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు

ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నరేంద్ర కుమార్, డిఎంఇగా వాణి నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సనత్‌నగర్‌కు (టిమ్స్) మాజీ ముఖ్యమంత్రి ‘డాక్టర్ మర్రి చెన్నారెడ్డి’గా పేరును రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. టిమ్స్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా ప్రస్తుత మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డీఎంఈగా డాక్టర్ వాణిని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టియాన జెడ్ చొంగ్తు మూడు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం డిఎంఇగా ఉన్న డాక్టర్ ఎ. నరేంద్ర కుమార్ శుక్రవారంతో పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో, ఆయన సుదీర్ఘ పరిపాలనా అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయనను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ తరువాయి 12లో



## 19 ఏళ్ల తర్వాత కోల్‌కతాకు తస్లీమా నస్రీన్

‘నా సొంతదేశానికి తిరిగి వచ్చినట్లుంది’అని వ్యాఖ్య

**కోల్‌కతా :** ప్రవాసంలో ఉన్న బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ దాదాపు 19 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత శుక్రవారం కోల్‌కతాకు తిరిగి వచ్చారు. తాను ఇప్పటికీ తన సొంత నగరంగా భావించే కోల్‌కతా నగరానికి రావడం ‘ఒక భావోద్వేగ భరితమైన అనుభూతి’ అని తస్లీమా అభివర్ణించారు. పశ్చిమ బెంగాల్‌లోని నూతన బిజెపి ప్రభుత్వం హయాంలో రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్న శనివారంనాటి ఒక సాహిత్య కార్యక్రమానికి ముందురోజైన శుక్రవారం రచయిత్రి తస్లీమా నస్రీన్ ఇక్కడికి చేరుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెకు స్వాగతం పలకడానికి విచ్చేసిన వారికి తస్లీమా చేతులు జోడించి వినమ్రంగా నమస్కరించారు. ‘నేను ఇక్కడకు తిరిగి రావడం నాకు చాలా సంతోషంగా ఉంది’అని తస్లీమా వారిని ఉద్దేశించి అన్నారు. ఆమె తరువాయి 12లో

## జూడోలో భారత్‌కు రెండు స్వర్ణాలు





**గ్లాస్గో:** కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. తాజాగా మరో 2 స్వర్ణాలు భారత్ ఖాతాలో వచ్చి చేరాయి. జూడో 48 కిలోల మహిళల విభాగంలో అస్మిత దే పసిడి కొల్లగొట్టి చరిత్ర సృష్టించింది. జూడో క్రీడలో బంగారు పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. ఫైనల్‌లో కెనడాకు చెందిన హీడి క్యాచ్‌ను 21 తేడాతో ఓడించి ఆమె ఈ ఘనత సాధించింది. మరోవైపు జూడో 60 కిలోల పురుషుల విభాగంలో హర్ష్ సింగ్ కూడా స్వర్ణం సాధించాడు. ఫైనల్ పోరులో ఆస్ట్రేలియాకు చెందిన జాషువా కట్జ్‌పై విజయ బావుటా ఎగరేశాడు.

## హైడ్రా కమిషనర్ బదిలీపై సిఎస్‌కు ఆదేశం

56 పేజీల తీర్పు విడుదల చేసిన హైకోర్టు







ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యక్తుల ఆధిపత్యం కంటే చట్టబద్ధ పాలనకే ప్రజాస్వామ్యంలో ప్రాధాన్యం ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం న్యాయవ్యవస్థ అధికారాన్నే సవాలు చేసినట్లేనని పేర్కొంది. హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్‌పై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులో జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ఇచ్చిన 56 పేజీల తీర్పు ప్రతి శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. న్యాయపాలనపై తరువాయి 8లో

# పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిష్టంభన

**హోంమంత్రి సభకు రావాలని విపక్ష సభ్యుల పట్టు**

● విద్యార్థులు, యువతపై అమానుష దాడికి సంబంధించి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ ● ముందస్తు ప్రణాళికతోనే ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టిస్తున్నాయని స్పీకర్, చైర్మన్ అసహనం ● ప్రతిపక్ష నినాదాల మధ్య జనన మరణ ధృవీకరణ బిల్లు ఆమోదం

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్‌పై ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన ‘పార్లమెంట్ మార్చ్’ సందర్భంగా వారిపై పోలీసుల అమానుష దాడికి వ్యతిరేకంగా పార్లమెంట్ ఉభయల్లో విపక్ష ఎంపిలు తమ పట్టుబిగించాయి. కేంద్ర హోంమంత్రి సభకు రావాలని, విద్యార్థులు, యువతపై ప్రాణాంతక ఆయుధాలతో దాడికి ఎవరు అనుమతించారో సమాధానం చెప్పాలని శుక్రవారం కూడా డిమాండ్ చేశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉభయసభలను విపక్ష ఎంపిలు హోరెత్తించారు. సభా కార్యక్రమాలను ముందుకు సాగనివ్వలేదు. ఇతర అంశాలపై కూడా సభలను స్తంభింపజేశారు. దీంతో ఉభయసభలు పలు మార్లు వాయిదా పడుతూ వస్తూ చివరకు సోమవారానికి స్పీకర్, చైర్మన్ వాయిదా వేశారు. అయితే ప్రతిపక్ష ఎంపిల నిరసనలు, ఆందోళనల మధ్యే శుక్రవారం జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026ను ఆమోదించారు. కాగా ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే నీట్ పేపర్ లీక్, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో లోక్‌సభ కార్యకలాపాలను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష సభ్యులు ముందస్తు ప్రణాళికతోనే సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ప్రశ్న అడగడానికి నిలబడుతున్నారు, కానీ ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగనివ్వడం లేదు అని అన్నారు. రాజ్యసభలోనూ విపక్ష ఎంపిలు నినాదాలు కొనసాగించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశమైన కొద్దిసేపటికే సభ ఆగస్టు 3వ తేదీకి వాయిదా పడింది. సభ కార్యకలాపాలు ప్రారంభమై, పత్రాలను తరువాయి 8లో





## అయోధ్య విరాళాల చోరీపై పార్లమెంట్ వద్ద స్కిట్

అతిథి పాత్రలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

‘చందా చోర్’పై ఎంపిల విన్నూత ప్రదర్శన

అయోధ్యలో రామాలయంలో విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ ఆవరణలో వరుసగా రెండవ రోజు కూడా నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాషాయ వస్త్రాలు ధరించిన స్వతంత్ర ఎంపి పప్పు యాదవ్, ఇతర ప్రతిపక్ష ఎంపిలతో కలిసి శుక్రవారం రామ మందిరంలో విరాళాల దొంగతనంపై ఆందోళన చేశారు. విరాళాల దొంగతనం, అలాగే జూలై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి ఆందోళనకారులపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, సభా కార్యకలాపాలకు ఆయన గైర్హాజరును ఇండియా కూటమి ఎంపిలు ప్రశ్నించారు. పార్లమెంట్ మకర ద్వారం ముందు నిరసన తెలుపుతూ, చట్టసభ సభ్యులు ‘అమిత్ షా ఇస్తిఫా దో’, ‘అమిత్ షా సదన్ మే ఆవో’, ‘చందా చోర్, గద్దీ ఛోడ్’ వంటి నినాదాలు చేశారు. అయితే పార్లమెంట్ విరాళాల చోరీపై ఒక వినూత్న స్కిట్‌ను ప్రదర్శించారు. కాషాయ వస్త్రాలు ధరించి, ఓ సన్యాసి వేషంలో వచ్చిన పప్పు యాదవ్ పార్లమెంట్ పరిసరాల్లో కూర్చొని విరాళాలు తరువాయి 8లో

## రేపు మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల రాష్ట్ర 3వ మహాసభలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర 3వ మహాసభలు రేపు(ఆగస్టు 2)న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలను జాతీయ మధ్యాహ్న భోజన పథకం అధ్యక్షురాలు డాక్టర్ బి.వి. విజయలక్ష్మి ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ పాల్గొని ప్రసంగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, సంఘం బలోపేతం, కార్మికుల హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై మహాసభలో చర్చించి కీలక తీర్మానాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాల నుంచి యూనియన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

# ఉగ్ర గోదావరి

● భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక జారీ ● 49 అడుగులకు చేరిన వరదనీరు ● అర్ధరాత్రికి 52 అడుగులకు చేరుకునే అవకాశం ● ఇసుక ర్యాంపులో చిక్కుకున్న కూలీలు, లారీ డ్రైవర్లను రక్షించిన అధికారులు ● ర్యాంపులోనే 40 లారీలు

ప్రజాపక్షం/భద్రాచలం

భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. కడపటి వార్తలు అందే సమయానికి గోదావరి నీటి మట్టం 47 అడుగులకు చేరుకుంది. 11,44,645 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. దీంతో అధికారులు రెండో ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. ఈ వరద ప్రవాహం మరింత పెరిగిన అర్ధరాత్రికి 52 అడుగల వరకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర జలవనరుల సంఘం అధి కారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటె త్తింది. ఛత్తీస్‌గఢ్ కురుస్తున్న వర్షాలకు తెలంగాణలోని చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులోకి భారీ వర్షపు నీరు వచ్చి చేరడంతో అధికారులు తాలిపేరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. గడిచిన రెండు రోజులుగా తాలిపేరు నుండి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో కలిసింది. ఎగువన వరద ప్రవాహం ఉండటంతో మరింతగా వరద పెరిగే అవకాశం ఉన్నట్లు తరువాయి 8లో





## వారం పాటు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్‌లో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి శనివారం వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం నుంచి తరువాయి 8లో

## నిరాయుధీకరణకు హమాస్ ఓకె

గాజా యుద్ధానికి ముగింపు దిశగా అడుగు?





**కైరో:** గాజా యుద్ధానికి ముగింపు పలికే ప్రయత్నాల్లో కీలక పరిణామంగా, హమాస్ తన ఆయుధాలను వదులుకునే ప్రక్రియకు అంగీకరించినట్టు ప్రకటించింది. ఇది సానుకూల పరిణామమే అయినప్పటికీ, వెంటనే అమలయ్యే ఒప్పందం కాదని, అనేక రాజకీయ, భద్రతా పరమైన సవాళ్లు ఎదురవుతాయని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ ప్రణాళికలో భాగంగా హమాస్ నిరాయుధీకరణ, ఇజ్రాయెల్ సైనిక ఉపసంహరణ, గాజాలో కొత్త పాలస్తీనియన్ పరిపాలన ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి. హమాస్ ఒక దశల వారీ ప్రణాళికకు అంగీకరించిందని ఆ సంస్థకు చెందిన అధికారి తెలిపారు. అయితే ఇజ్రాయెల్ కూడా యుద్ధాన్ని నిలిపివేయడం, గాజా నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని హమాస్ షరతు పెట్టింది. కాగా, హమాస్‌కు ఆయుధాలను వదులుకోవడం ఒక చారిత్రక మార్పుగా తరువాయి 12లో

# ప్రైవేటు విద్యతో ప్రభుత్వ విద్య పోటీపడాలంటే...

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీనుంచి సామాన్య ప్రజలను కాపాడటం ఎలా? ప్రభుత్వ విద్యను మౌలికవసతులు, బోధన, ఫలితాల విషయంలో ప్రైవేటు విద్యకు దీటుగా నిలపటం ఎలా? ప్రభుత్వం విద్యపై భారీగా వెచ్చిస్తున్నా, అర్హత గల అధ్యాపకులు ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లోనే ఉన్నా ప్రభుత్వ విద్య – ప్రాథమిక స్థాయినుంచి కాలేజి స్థాయివరకు ఎందుకు కునారిల్లుతున్నది. దీన్ని ఉద్ధరించటం ఎలా? అన్న సమస్య కొంతకాలంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను వేధిస్తున్నది. కొన్ని ఆరంభ చర్యలు తీసుకున్నా, ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య లభిస్తుందనీ, తమ పిల్లల భవిష్యత్‌కు భరోసా ఏర్పడుతుందనే విశ్వాసం తల్లిదండ్రుల్లో కలిగించటంలో వైఫల్యం కొనసాగుతున్నది. తెలంగాణలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (విద్యాశాఖ ఆయనే నిర్వహిస్తున్నారు), ఆంధ్రప్రదేశ్‌లో విద్యామంత్రి నారా లోకేశ్ నిజంగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరంభ ఫలితాలు సాధించారు కూడా. అయితే ప్రభుత్వ విద్య దుస్థితికి కారణాలను లోతుగా అధ్యయనం చేసి, చిత్తశుద్ధితో దిద్దుబాటు చర్యలు తీసుకోనిదే పరిస్థితిని తిరోముఖం పట్టించి ప్రభుత్వ విద్యపట్ల విశ్వాస పునరుద్ధరణ సాధ్యంకాదు. ప్రభుత్వం నియమించిన ఆకునూరి మురళి కమిషన్ సిఫారసులు ఈ సందర్భంగా ప్రయోజనకరంగా ఉంటాయి.

దేశంలోకి 1990వ దశకం ఆరంభంలో ఆర్థిక సంస్కరణలతోపాటే విద్యారంగం సరళీకరణ, ప్రైవేటీకరణ ప్రభుత్వ విధానంగా అమలులోకి వచ్చింది. అప్పటివరకు నిరుద్యోగ విద్యావంతులు జీవనోపాధిగా ట్యుటోరియల్స్ పద్ధతిలో చెదురుమదురుగా విద్యాసంస్థలు నడుపుతుండేవారు. ఎప్పుడైతే ప్రభుత్వం ఒక విధానంగా ప్రైవేటు విద్యకు ద్వారాలు బార్లా తెరిచిందో, ఇంగ్లీషు మీడియం ఆకర్షణగా ప్రైవేటు విద్యాసంస్థలు ముందు పట్టణ ప్రాంతాల్లో మొదలై క్రమంగా మండలస్థాయి వరకు వ్యాపించాయి. యూనిఫారాలు, టై, బూట్లు, రవాణాకు బస్సులతో అదొక ఆకర్షణగా తయారైంది. ఆర్థిక స్థోమత కలిగిన స్కూళ్ల యజమానులు 10 వ తరగతిలో మంచి ఫలితాలు సాధించివ్యాపారాన్ని పెంచుకునేందుకై అధిక మొత్తాల చెల్లింపుతో రిటైర్డ్, వర్కింగ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలు సంపాదించుకోవటం మొదలైంది. ముమ్మరంగా రుబ్బుడు విద్యతో, వారంవారం పరీక్షలతో మార్కుల ఆర్జనకు పదును పెట్టారు. ఇది ఆర్థికంగా తమకు భారమైనప్పటికీ సామాన్యులు సైతం కడుపుగట్టుకుని తమ పిల్లల్ని కాన్వెంట్ బడులకు పంపటం మొదలుపెట్టారు. ప్రభుత్వ స్కూళ్లు ఎస్‌సి, ఎస్‌టి, కొద్దిమంది బిసిలకే పరిమితమై ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య వ్రేళ్లపై లెక్కించదగిన స్థాయికి పడిపోయింది. రెండోవైపున, ప్రపంచీకరణ మోజులో మార్కెట్‌కు అవసరమైన ఇంజనీర్ల తయారీకి ఇంటర్ విద్యనుంచి ఇంజనీరింగ్ విద్యవరకు ప్రభుత్వాలు ప్రైవేటు కాలేజీలను ప్రోత్సహించాయి. ప్రభుత్వ విద్యను ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేశాయి. దీనితో ఇంటర్ విద్య పూర్తిగా కార్పొరేటీకరణ పొందగా, ప్రధానంగా రాజకీయ నాయకులే వృత్తి విద్య కళాశాలలు నెలకొల్పారు. అవి బతికిబట్టకట్టేందుకు ప్రభుత్వ నాయకత్వం అవసరార్థులకే కాకుండా అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టింది. అది ఏటా పెరుగుతూ తడిసిమోపెడై ప్రభుత్వాలకు మోయలేని భారమైంది. రెండోవైపున, వృత్తివిద్యలో నాణ్యత తగ్గింది. పరిశ్రమలతో అనుసంధానం లేనందున మార్కెట్ అవసరాలకు తగిన నైపుణ్యాలు కరవైనాయి.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ విద్య మెరుగుదలకు, ఆకర్షణీయమైన ఫలితాలతో తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు తెచ్చి, పిల్లలను ప్రభుత్వ స్కూళ్లవైపు మళ్లించేందుకు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మాణం ఒక పద్ధతి ప్రకారం చేబట్టారు. ఈ సంవత్సరం అటువంటి కొన్ని స్కూళ్లలో 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టటం ప్రభుత్వ కృషికి కితాబు. విద్య మెరుగుదల చర్యల్లో మొదటి పార్శ్వం ప్రభుత్వ స్కూలు విద్యను తీర్చిదిద్దటం. నామమాత్రపు విద్యార్థుల సంఖ్యతో స్కూళ్లు నడపటంకన్నా ఒక్కో నియోజకవర్గంలో ఆధునిక వసతులతో స్కూళ్లు ఏర్పాటు చేసి గ్రామీణ విద్యార్థులకు మంచి చదువు అందించటం. దీనిపై కొన్ని విమర్శలున్నా తల్లిదండ్రులను, టీచర్లను మోటివేట్ చేస్తే ఈ ప్రయోగం హర్షించదగిందే. పాఠశాలనుంచి ఇంటర్ కాలేజీలవరకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం అందించటం మంచి ప్రోత్సాహమే గాని, నాణ్యమైన బోధన, క్రమశిక్షణ అంతకన్నా ముఖ్యం. ఇందుకుగాను ముఖ్యమంత్రి చేస్తున్న మరో ప్రయోగం ఆహ్వానించదగింది. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎంపిక చేసి విదేశాలకు విద్యాయాత్రకు పంపుతున్నారు. ప్రపంచ విద్యారంగంలో వస్తున్న మార్పులను స్వయంగా తిలకించటం వారిని మోటివేట్ చేస్తుందని, దానివల్ల విద్యావ్యవస్థ మెరుగవుతుందని ఆయన విశ్వాసం. అలా యాత్రకు వెళ్లి వచ్చిన టీచర్లతో ముఖ్యమంత్రి గురువారం నిర్వహించిన సమావేశంలో నిర్మొహమాటంగా మాట్లాడారు.

ఉపాధ్యాయులు ఎప్పుడూ తమ కోర్కెలపై ప్రభుత్వంతో కొట్లాడటమేకాదు, విద్యను మెరుగుపరచాల్సిన బాధ్యతను ముఖ్యమంత్రి వారిపై పెట్టారు. ప్రతి మండలంలో టీచర్లు సమావేశాలు జరిపి పాఠశాలల్లో వసతుల మెరుగుదలతో పాటు విద్యార్థులను ప్రభుత్వ స్కూలుకు ఆకర్షించేందుకు తీసుకోవలసిన చర్యలు, హేతుబద్ధీకరణ వంటి అంశాలపై డిసెంబర్‌లోగా నివేదికలివ్వాలని కోరారు. వాటిని క్రోడీకరించి వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేసేందుకు తనకు మూడు–నాలుగు మాసాలు సమయం లభిస్తుందన్నారు. ఈ ప్రయత్నం గ్రామీణ విద్యలో ఒక మలుపు కావాలని ఆశించుదాం.



## పౌరులపట్ల పాక్ సైన్యం నిరంకుశత్వం

**పిఒకె స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జులై 27 నుంచి జరుగుతున్న సైన్యం దాడుల్లో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సామాన్య పౌరుల పట్ల పాక్ సైన్యం నిరంకుశంగా ప్రవర్తిస్తోంది. పిఒకెలోని ప్రజలను పాక్ రక్షణశాఖ మంత్రి శత్రువులుగా అభివర్ణించారు. ఆ తర్వాతే వారిపై సైన్యం దాడుల్ని తీవ్రం చేసింది. మరోవైపు భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చింది. వారే ఇప్పుడు తమ తుపాకులను సొంత దేశంపై గురిపెట్టారు.**

–భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

## ఆరోగ్యవంతమైన భారత్‌కు ఆధునిక ప్రజారోగ్యచట్టం అత్యవసరం

ప్రజారోగ్యం అనేది కేవలం వ్యాధులకు చికిత్స అందించే వ్యవస్థ కాదు. సమాజం సమిష్టి కృషి ద్వారా వ్యాధులను నివారించడం, ఆయుష్షును పెంచడం, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అనే శాస్త్రం, కళ. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రజారోగ్య చట్టం రాష్ట్రం, స్థానిక సంస్థలు, సమాజం కలిసి పనిచేసే విధానాన్ని, అధికారాలను, బాధ్యతలను నిర్దేశిస్తుంది. అదే సమయంలో వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత, ఆస్తి హక్కులు వంటి మౌలిక హక్కులను రక్షిస్తూ ప్రభుత్వ అధికారాలకు తగిన పరిమితులను కూడా విధిస్తుంది.

**ఆరోగ్య వ్యవస్థకు కనిపించని వెన్నెముక**

అమెరికన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, పాన్ అమెరికన్ హెల్త్ ఆర్గనైజేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి సంస్థలు ప్రజారోగ్యానికి అవసరమైన మౌలిక సేవలను నిర్వచించాయి. వ్యాధుల పర్యవేక్షణ, పారిశుద్ధ్యం, ఆహార భద్రత, సురక్షిత తాగునీరు, ఆరోగ్య అవగాహన, వ్యాధి నివారణ వంటి సేవలు సమాజ ఆరోగ్యానికి పునాదిగా నిలుస్తాయి. ఇవి ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించకపోయినా ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముక వంటివి. ఈ వ్యవస్థలు బలహీనపడితే నివారించగలిగే వ్యాధులు, మరణాలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రజారోగ్య ఫలితాలు వైద్యరంగంపైనే ఆధారపడవు. పరిశుభ్రత, తాగునీరు, పర్యావరణం, విద్య, పోషకాహారం, పట్టణ ప్రణాళిక వంటి అనేక రంగాల సమన్వయం అవసరం. అందుకే సమర్థవంతమైన ప్రజారోగ్య పరిపాలనకు చట్టపరమైన బలం అత్యంత కీలకం. ప్రజారోగ్య చట్టాలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. మౌలిక సదుపాయాల చట్టాలు ప్రజారోగ్య సంస్థల ఏర్పాటు, డేటా సేకరణ, తనిఖీలు, లైసెన్సులు, నియంత్రణ చర్యలకు అధికారాన్ని కల్పిస్తాయి. జోక్య చట్టాలు మైనర్లకు పొగాకు విక్రయాల నిషేధం, ఆహార భద్రత ప్రమాణాలు, అంటువ్యాధుల సమయంలో క్వారంటైన్ వంటి ప్రత్యేక చర్యలకు చట్టబద్ధత కల్పిస్తాయి. భారతదేశంలో ప్రజారోగ్య అత్యవసర పరిస్థితుల నిర్వహణ ఇప్పటికీ పాత చట్టాలు, శిక్షణ పొందిన ప్రజారోగ్య సిబ్బంది కొరత, అమలు లోపాల కారణంగా ఆశించిన స్థాయిలో లేదు.

**రాజ్యాంగం కల్పించిన పునాదులు**

భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం ప్రజారోగ్యానికి సంబంధించిన చట్ట నిర్మాణ అధికారాలు కేంద్రం, రాష్ట్రాల మధ్య విభజించబడ్డాయి. ఆసుపత్రులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి అంశాలు ప్రధానంగా రాష్ట్రాల పరిధిలో ఉండగా, జనాభా నియంత్రణ, మానసిక ఆరోగ్యం, ఆహార భద్రత, సంక్రమణ వ్యాధుల నియంత్రణ, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై కేంద్రం, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయగలవు. రెండు చట్టాల మధ్య విభేదం ఏర్పడితే కేంద్ర చట్టానికే ప్రాధాన్యం ఉంటుంది.

స్వాతంత్ర్యం తర్వాత ప్రజారోగ్య చట్టాల రూపకల్పన ప్రధానంగా రాష్ట్రాల బాధ్యతగా కొనసాగింది. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ప్రత్యేక ప్రజారోగ్య చట్టాలు అమల్లో ఉన్నాయి. వాటిలో చాలా దశాబ్దాల క్రితం రూపొందించబడినవే. దేశవ్యాప్తంగా ఏకరీతి కోసం కేంద్ర ప్రభుత్వం 1987 మోడల్ పబ్లిక్ హెల్త్ బిల్, 2002 నేషనల్ పబ్లిక్ హెల్త్ బిల్, 2009 నేషనల్ హెల్త్ బిల్ వంటి నమూనా చట్టాలను ప్రతిపాదించింది. ఈ చట్టాలు పారిశుద్ధ్యం, నీటి సరఫరా, మార్కెట్లు, ఆహార భద్రత, సంక్రమణ వ్యాధుల నియంత్రణ వంటి అంశాలను ప్రస్తావించినప్పటికీ, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్, కొత్త అంటువ్యాధులు, వాతావరణ మార్పుల ప్రభావం, పర్యావరణ కాలుష్యం, వేగవంతమైన పట్టణీకరణ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేంత సమగ్రత వాటిలో లేదు.

**సమగ్ర ప్రజారోగ్య చట్టమే కాలానుగుణ పరిష్కారం**

భారతదేశం ప్రస్తుతం జనాభా మార్పులు, పట్టణీకరణ, పర్యావరణ సంక్షోభం, కొత్త వ్యాధుల ముప్పు వంటి సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోంది. సమాజ సంక్షేమం, వ్యక్తిగత స్వేచ్ఛల మధ్య సమతుల్యతను కాపాడటం సవాలే అయినప్పటికీ, శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ విలువలు, మానవ హక్కులను సమన్వయం చేసే సమగ్ర ప్రజారోగ్య చట్టం మాత్రమే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, స్థిరమైన భారత నిర్మాణానికి బలమైన పునాది వేయగలదు.



**డా ఎం. అఖిల మిత్ర,**
ప్రకృతి వైద్యులు, ప్రజారోగ్య సలహాదారులు.

# నవతరం జంతర్‌మంతర్ నిరసనలు ఏమి బోధిస్తున్నాయి?



ఇందిరా జైసింగ్



ప్రతీక్ పట్నాయక్

సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్స్

వారు ఒక పుస్తకం చేత్తో పైకెత్తారు – ఆకాశంలో రంధ్రం పెట్టారు.

ముంబయిలో రోడ్డుకు అడ్డంగా నిలబడి రెండు చేతులతో పోలీసు వ్యాన్‌ను నిలుపు చేసిన యువతి గుర్తుందా? జంతర్‌మంతర్‌లో ఒక యువ మహిళ–అనేక రోజులుగా ఆహారం తినకుండా బక్కచిక్కిన మహిళ– భారత రాజ్యాంగాన్ని తన తలపై పెట్టుకోవడం గుర్తుందా? ఆమె ఆగ్రహంతో కాకుండా ప్రమిదను పైకెత్తిన రీతిలో ఆ పనిచేశారు.

ఆ పుస్తకాన్ని దించండి, మడతపెట్టండి, ఇంటికి వెళ్లండి, ఎన్నడూ రాని రుతువుకోసం వేచి చూడండి, చట్టం తన పని తాను చేసేవరకు ఎదురుచూడండి అని వారికి వారాలపాటు చెప్పారు. అప్పుడు ఒక సాధారణ మధ్యాహ్న సమయంలో మంత్రి రాజీనామా చేశారు. ఆ పుస్తకం కిందకు రాలేదు. మరింత ఎత్తుకు లేచింది. ఆ పుస్తకం (రాజ్యాంగం) పట్ల మా యువ తరం అభిమానం పెంచుకున్నారని మనం జంకులేకుండా ప్రపంచానికి చెప్పవచ్చు. ఇది విజయం. రాజీ కాదు. ఎవరో వెనుక ఉండి నడిపిన వెనుకంజ కాదు. పరువు కాపాడుకునే పని అంతకన్నా కాదు. ఒక తప్పును ఎత్తి చూపారు. జవాబు చెప్పటానికి తిరస్కరించిన అధికారం జవాబు చెప్పింది. యువత ఒట్టి చేతులతో దాన్ని సాధించారు.

జన్–జీ(1997–2012 మధ్య జన్మించిన వ్యక్తులు –15–26 సంవత్సరాల వయో బృందంకన్నా పై వయస్సు వారు దీన్ని సగం ఉడికించిన విప్లవం అన్నారు. మేము అంటాం : మీరు, నేను చేసిందేమీ లేదు. మన పూర్వీకులు సాధించారు. వారి వారసత్వం ఫలాలను మన వ్రేళ్ల సందుల గుండా జారవిడుచుకున్నాం. ఈ యువకులవైపు చూసి, వారు ఇంకా ముందుకు వెళ్ళలేదని గొణిగేవారికి మా సమాధానం "మనం వెళ్లామా?". నేడు–రేపు మధ్య దూరం గడియారం లో కొలవబడదు. తాడు సహాయం లేకుండా విశ్వాసం వేసిన గెంతులతో, భయం ఆవహించకమునుపే దానిలోపల వ్యవహరించగలిగిన ధైర్యంతో కొలవబడుతుంది. చరిత్ర కేవలం అభిప్రాయాలతో కాదు, మనుషుల శరీరాలతో నిర్మించబడుతుంది.పరుగుతీయకుండా, తుపాకుల ముందు ధైర్యంగా నిలబడిన దేహాలు దాన్ని నిర్మిస్తాయి. చలి, వర్షాలు లెక్కచేయకుండా వీధుల్లో నిలబడిన దేహాలు చరిత్ర నిర్మిస్తాయి. దేశం సిగ్గుపడే విధంగా చేస్తూ ఆహారం ముట్టని వారు దాన్ని నిర్మిస్తారు.

దొంగలించబడింది కేవలం ఒక పథకం కాదు – అది మన హుందాతనం, ఆత్మగౌరవం; మెరిట్ వాస్తవం, కృషి గౌరవం పొందుతుందనేది యువత విశ్వాసం. మన నష్టాలు యథార్థం. అనేకమంది పౌరసత్వం సందేహంలో పెట్టబడింది. జీవనోపాధులు హరించారు. యువత ఆ నష్టాలనుంచి లేచి వాటిని మేళ్లుగా మార్చుకున్నారు. అవమానాన్ని తమ సొంత గొంతుకలతో శక్తిగా మార్చుకున్నారు. ఇది ఎవరి విజయం అనే విషయంలో ఎవరూ తప్పు చేయకూడదు. ఇది విద్యార్థులది తప్ప మనది కాదు. అయితే వారిక్కడికి ఒంటరిగా రాలేదు. మనం మహానుభావుల భుజాలపై నిలబడి ఉన్నాం. వారి పేర్లు చెబుదాం. పిడికెడు ఉప్పు కోసం పాదయాత్రగా సముద్రానికి వెళ్లిన బక్కపలచని మనిషిని గుర్తుచేసుకుందాం. ఉదయాన యావత్ శాసన గ్రంథాన్ని చేబూని ఉన్న సామ్రాజ్యాన్ని రాత్రికి దాని చట్టబద్ధతను కోల్పోయేలా చేశారు.

1970వ దశకంలో, తమది శాశ్వతం అనుకున్న ప్రభుత్వాన్ని కుదిపివేస్తూ తరగతులు బహిష్కరించిన విద్యార్థులను స్ఫురణకు తెచ్చుకుందాం. 2012లో ఒక డిసెంబర్ రాత్రి, తామెన్నడూ కలుసుకోని ఒక మహిళ కోసం కొవ్వొత్తులు చేతబట్టి ఇండియా గేట్‌ను ముంచెత్తిన యువతను, చట్టాన్ని తిరగరాసేవరకు ఇంటికి తిరిగి వెళ్లని ఆ యువతను యాది చేసుకుందాం. ప్రతి దశాబ్దంలో, ప్రతి కూడలి ప్రదేశంలో, యువతకు చెప్పింది ఒక్కటే, 'ఆ గంట (సమయం) తప్పు, పద్ధతి తప్పు, ఇంటికి వెళ్లండి, వేచి చూడండి.' వారి పోరా టం మన పోరాటం, వారి పరిపూర్తికాని భవిష్యత్ ఇప్పుడు మనది. మనల్ని కలిసికట్టు చేస్తున్న బంధనం అదే. అది తప్ప మరేదీ మనకు పట్టదు.

వారు దేన్నీ పట్టించుకోరు అని దేశం కొట్టిపారేసిన తరం అంతా వింటున్నది. వినిపించుకోనిది మనమే.

డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ వాషింగ్టన్‌లో ఒక సభలో తాను రాసుకున్న ప్రసంగం చదువుతున్నారు. చప్పగా ఉంది. అంతలో ఆయన వెనుకనుంచి మహాలియా జాక్సన్ –"మీ స్వప్నం గూర్చి వారికి చెప్పు మార్టిన్" అని కోరారు. ఆయన చేతిలోని కాగితం పేజీలు పక్కన పెట్టాడు. ఈ క్షణాలు జాగ్రత్తగా ఉండటానికి తిరస్కరించే గొంతుల నుంచి తప్ప జాగ్రత్త వహించే వారి నుంచి ఎన్నడూ రావు. ద్రోహానికి గురైతే, ఈతరం తుపాకీ వద్దకు చేరుతుంది. రాజ్యాంగం ద్వారా చేసిన బోధన కారణంగా వారు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయటానికి తుపాకీ



ఉద్యమ సహచరులను తరలిస్తున్న పోలీసు వ్యాన్‌ను ఒంటిచేత్తో ఆపుతున్న యువతి

మీట చేతికి తీసుకోకుండా కొవ్వొత్తులు చేబూనారు. ఈ కారణంగా దుష్యంత్ కుమార్ గేయపాదం ఒకటి అనేక రోజుల పాటు మా బుర్రలు తొలుస్తూనే ఉంది : ఆకాశానికి రంధ్రం చేయలేమని ఎవరంటారు – మిత్రులారా, నిండుమనస్సుతో ఒక రాయి విసరండి! అంటారాయన .

విజయం ఆచరణ నుండి భిన్నమైంది కాదు, అది ఉచితం కూడా కాదు. ఒక తల్లి మొదటి రోజున స్టీలు టిఫెన్‌తో వచ్చారు, తిరిగి వెళ్లలేదు. పిల్లలను తన సొంత పిల్లలుగా భావించి భోజనం పెట్టారు. మరికొందరు ఒక ఫొటోగ్రాఫ్ చేతబట్టి, ఏ రాజీనామా తొలగించలేని దుఃఖ భారంతో వచ్చారు. అపరిచితులు నిరసనకారులకు ఆహారం ఇచ్చారు. విద్యార్థులు బల్ల పరుపు రాళ్లపై పడుకున్నారు. రాజ్యాంగాన్ని గంటల పాటు ఒక చేతినుంచి మరొకరి చేతికి మార్చుకుంటూ దాని జీవశక్తిని చాటారు.

ఆ తర్వాత, జులై 20న, రాజ్యాంగం చేతబట్టి, అది ఎక్కడైతే స్థిరంగా ఉండాలో ఆ పార్లమెంట్‌కు ప్రదర్శనగా బయలుదేరినపుడు రాజ్యం (ప్రభుత్వం ) తన సమాధానమేమిటో చెప్పింది. వారు గుమికూడకుండా మెట్రోస్టేషన్లు మూసివేసింది. మన ప్రజాస్వామ్య కేంద్రం చుట్టూ ఇంటర్నెట్ నిలుపుచేసింది. నిరాయుధులైన యువకుల నెత్తిన లాఠీలతో మోదింది, వారి దేహాల మీదకు బాష్పవాయువు గోళాలు విసిరింది. తమ ఛాతీపై తామెవరో తెలిపే పేర్లులేకుండా సాధారణ దుస్తుల్లో సాయుధులను గుంపుల్లోకి పంపింది. నిరాహారదీక్ష చేస్తున్న వారిని లాగి బస్సుల్లో పడేసింది. దీన్నంతా దేశం తిలకించింది.

ఇప్పుడు కఠిన వాస్తవం చూద్దాం. ఈ విజయాన్ని వేడుక చేసుకోవటం అంటే సంతృప్తి చెందటాన్ని నిజాయితీతో తిరస్కరించటమే. చరిత్ర విద్యార్థుల పార్లమెంట్ యాత్రను గుర్తుంచుకోదు. ఈ యాత్ర చేసిన చట్టాన్ని గుర్తుంచుకుంటుంది. 1963 నాటి వాషింగ్టన్ మార్టిన్ లూథర్ కింగ్ స్వప్నం వల్లనే గుర్తింపు పొందలేదు. ఆ స్వప్నం పౌరహక్కుల చట్టంగా వ్యక్తీకరణ పొందినందున గుర్తుచేసుకోబడుతుంది. మన దేశంలో మనకూ ఒక రుజువు ఉంది. 2012 డిసెంబర్ నాటి విచారం, ఆగ్రహం ఆ తర్వాత క్రిమినల్ చట్టంలో ప్రతిబింబించింది. ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సరం పాటు రైతుల ఆందోళన వారు వ్యతిరేకించిన చట్టాల రద్దుకు దారి తీసింది. మనదేశం ఇప్పటికీ తన సొంత పౌర హక్కుల చట్టంకోసం– సమానత్వం కలుగజేసే, వివక్ష వ్యతిరేక చట్టం కోసం, రాజ్యాంగం ఇప్పటికే ఇచ్చిన హామీకి జవసత్వాలు చేకూర్చే చట్టం కోసం వేచి చేస్తున్నది.

మూడు రుణాలతో కూడిన అసంపూర్ణ కృషి ఏమిటో మేము స్పష్టం చేయదలిచాము.

ఒకటి, పరీక్ష. ఆస్థాయిలో ప్రశ్నాపత్రం లీకేజీ దురదృష్టం కాదు, అది వ్యవస్థ వైఫల్యం. దానిని నిర్వహిస్తున్న ఏజన్సీ లక్షలాదిమంది భవిష్యత్‌ను క్లరికల్ విషయంగా పరిగణించటాన్ని అనుమతించరాదు. పరీక్ష నిజాయితీని చట్టం ద్వారా అమలు జరపాలి. దానిపై పునఃపరిశీలన ఉండాలి.

రెండు, పోలీస్. జులై 20న జరిగింది ఆర్డర్‌ను(శాంతి–భద్రతను) కాపాడటం కాదు, తద్విరుద్ధం. లాఠీతో ఒక విద్యార్థి తల పగలగొట్టటం నియంత్రణ చర్యకాదు. జనంపైకి బాష్పవాయువు గోళాలు ప్రయోగించటం జనాలను అదుపుచేయటం కాదు. సాధారణ దుస్తుల్లోని వ్యక్తి చట్టాన్ని అమలు చేసే అధికారి కాదు, నకిలీ. కోర్టులు 2018 నుంచీ పదే పదే అడుగుతున్న ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ప్రభుత్వం ఇంతవరకు సమర్పించలేదు. ఆరోజున చేయి పైకెత్తిన ప్రతీ ఆఫీసర్‌పై కేసుపెట్టాలి.

మూడో రుణం, మనం సన్నిహితమైంది, కఠినమైంది, ఎందుకంటే అది మనం– నలుపు, తెలుపు దుస్తులు ధరించే మనం నెరవేర్చాల్సింది. కోర్టుల్లో అధికారులమైన మనం ఇప్పు డు అభిశంసించాలి. మనం మౌనంగా ఉంటూ ఒక మంత్రి జవాబుదారీ తన్నాన్ని డిమాండ్ చేయటం మంచిగా ఉండదు. విచారణ మొదలు కాకముందే నిరసన ముగిసిపోయేంతగా హక్కు వినియోగం వేచి ఉండాల్సివస్తే న్యాయం చేసినట్లు కాదు. జడ్జీలు, న్యాయసేవకులు తప్ప యజమానులు కాదు. తీర్పు చెప్పండి లేదా తప్పుకోండి. విస్మరణ ఖరీదును మనం చూశాం. సంవత్సరాలు గడిచినప్పటికీ జామియా విద్యార్థుల దృశ్యాలు కళ్లముందు కదలాడుతున్నాయి. పోలీస్ లు వారి లైబ్రరీలోకి చొరబడి, టేబుల్స్ కింద దూరినవారిని సైతం బాదారు. చట్టం క్రమం ఇంకా కొనసాగుతోంది. ఒక్క అధికారినీ జవాబుదారీ చేయలేదు. ఆ కేసు ఈరోజుకీ కోర్టులో మూలుగుతోంది.

ఒక సంస్థను కాపాడుకోవటమంటే విమర్శనుంచి దాన్ని రక్షించుకోవటం కాదు. దాని ప్రామాణికతను కాపాడాలి. కోర్టును ప్రశ్నించని లాయరు, ప్రభుత్వాన్ని ప్రశ్నించని పౌరుడు , ఓర్మి వహించాలని బోధ చేసే పెద్దలు మన సంస్థల సంరక్షకులు కారు. సంస్థలను పట్టించుకోకుండా యువత వీధుల్లోకి రావటానికి అవే కారణాలు. సంరక్షణ బాధ్యత నిఘా కలిగి ఉండటం తప్ప విధేయత ప్రదర్శించటం కాదు.

ఇప్పుడు ఆకాశంలో రంధ్రం పడింది. దాని గుండా కాంతి ప్రసరిస్తున్నది. అయితే ఆకాశంలోని రంధ్రం దానికదిగా తెరుచుకుని ఉండదు. ఎవరూ దానిపై దృష్టి పెట్టకపోతే అది నెమ్మదిగా మూసుకుంటుంది. రాజీనామాను నిలువెత్తు విగ్రహంగా మార్చటం ద్వారా, ప్రజలు అడిగినప్పుడు అధికారం జవాబు చెప్పేటట్లుగా మీ ధైర్యం శాశ్వత ఆశాభావంగా ఉండేటట్లు మీరు ఆ రంధ్రాన్ని తెరిచి ఉంచండి.

# జానపద కళలకు జీవం పోద్దాం... తెలంగాణ వారసత్వాన్ని పరిరక్షిద్దాం



**నాగులపల్లి వెంకటేశ్వరరావు**
సెక్రటరీ, మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ

కళాకారుడు బతికితేనే కళ బతుకుతుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవనవిధానం, చరిత్రను భావితరాలకు అందించిన గొప్పవారసత్వ సంపద జానపదకళలు. ఇవి కేవలం వినోద సాధనాలు మాత్రమే కాదు. ప్రజల్లో చైతన్యాన్ని రగిలించే శక్తివంతమైన సమాచార మాధ్యమాలు. ఒకప్పుడు గ్రామీణ సమాజ జీవనంలో విడదీయరాని భాగం గా ఉన్న ఈ కళారూపాలు నేడు ఆధునిక జీవనశైలి ప్రభావంతో కనుమరుగయ్యే ప్రమాదంలోఉన్నాయి.

తెలంగాణ అనగానే ఒగ్గుకథ, బుర్రకథ, హరికథ, పల్లెసుద్దులు, వీధినాటకం, చిందు యక్షగానం, గుస్సాడినృత్యం, పేరిణి శివ తాండవం, డప్పు, కోలాటం, గంగిరెద్దుల ఆట, లంబాడీ నృత్యం, బతుకమ్మ జానపద గీతాలు వంటి అనేక కళారూపాలు గుర్తుకువస్తాయి. ఇవి తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక సంపద. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జానపద కళారూపాల పాత్ర అపూర్వమైనది. తొలి దశ నుంచి మలిదశ ఉద్యమం వరకు ఒగ్గుకథ, బుర్రకథ, పల్లెసుద్దులు, వీధినాటకాలు, జానపద గీతాలు ఉద్యమానికి ఊపిరిగా నిలిచాయి. గ్రామగ్రామాన తిరుగుతూ కళాకారులు తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో నింపారు. సభలకు ముందు నిర్వహించిన జానపద ప్రదర్శనలు ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేశాయి. తెలంగాణ రాష్ట్ర సాధనలో జానపద కళాకారుల సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మన జానపద కళలను దేశం కూడా గుర్తించింది. కిన్నెర కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య, యక్షగానం కళాకారుడు పద్మశ్రీ గడ్డంసమ్మయ్య, జానపద సంగీత విద్వాంసుడు పద్మశ్రీ దాసరికొండప్ప, సంప్రదాయ కళాకారిణి పద్మశ్రీ దళిపర్తి ఉమామహేశ్వరి వంటి ప్రముఖులకు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేసింది. ఇది తెలంగాణ జానపద కళల గొప్పతనానికినిదర్శనం. అయితే, ఒగ్గు కథలో మహోన్నత స్థానం సంపాదించిన మిద్దె రాములు గారిని కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఆయనకు ప్రతిభాపురస్కారం, రాజీవ్ పురస్కారం, హంస అవార్డు వంటి అనేక గౌరవాలు లభించాయి. వాస్తవానికి ఒగ్గు కథకు విశిష్ట సేవలందించిన మరో మహానుభావుడు చుక్క సత్తయ్య 2004లో భారత రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం చేతుల మీదుగా సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఈ ఇద్దరు మహానుభావుల సేవలు తెలంగాణ జానపద కళలకు దేశవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చాయి.





హైదరాబాద్‌లోని శిల్పారామంలో పేరిణి వంటి కొన్ని కళారూపాలకు సందర్భానుసారంగా ప్రదర్శనల అవకాశాలు కల్పించడం అభినందనీయం. అయితే, ఇది ఒక్క శిల్పారామానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జానపద కళారూపాలకు నిరంతర అవకాశాలు కల్పించే విధానాన్ని ప్రభుత్వం రూపొందించాలి.

నేను 2010 నుండి 2013 వరకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో ఉపసంచాలకుడు (ఐఇసి)గా పనిచేసిన సమయంలో ప్రతి సంవత్సరం సుమారు రూ.1 కోటిబడ్జెట్‌ను పల్లెసుద్దులు, హరికథ, వీధి నాట కం వంటి జానపద కళారూపాల ద్వారానే హెచ్‌ఐవీ/ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాల కు వినియోగించాం. గ్రామాల్లో ప్రజలు వ్యవసాయపనులు ముగించుకుని విశ్రాంతిగా ఉన్న సమయంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేవాళ్లం. ఆ అవగాహన కార్యక్రమాల కారణం గా రెండు సంవత్సరాలలో హెచ్.ఐ. వి. వ్యాప్తి తగ్గింది. స్థానిక భాషలో, స్థానిక కళారూపాల ద్వారా అందించిన సందేశాన్ని ప్రజలు సులభంగా అర్థం చేసుకొని ఆచరణలో పెట్టారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంతో పాటు కళాకారులకు ఉపాధి కూడా లభించింది. ఒకే కార్యక్రమంతో ప్రజా చైతన్యం, ప్రభుత్వ ప్రచారం, కళాకారులకు జీవనాధారం, కళల పరిరక్షణ అనే నాలుగు లక్ష్యాలు సాధ్యమయ్యాయి. అంతకు ముందు సమాచార ప్రజా సంబంధాల శాఖ కూడా జిల్లా ప్రజా సంబంధాల అధికారుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారానికి జానపద కళారూపాలను విస్తృతంగా వినియోగించేది. దీంతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరడంతో పాటు కళాకారులకు నిరంతర ఉపాధి లభించేది. ఆ విధానం కారణంగా అనేక జానపద కళారూపాలు సజీవంగా నిలిచాయి. నేడు కూడా అదే విధానాన్ని పునరుద్ధరించి, ప్రతి ప్రభుత్వ శాఖ తమ అవగాహన కార్యక్రమాల్లో జానపద కళారూపాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పట్టణీకరణ, ఉపాధి కోసం వలసలు, యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర డిజిటల్ మాధ్యమాల ప్రభావంతో జానపదకళలకు ఆదరణ తగ్గుతోంది. అనేకమంది కళాకారులు వాచ్‌మెన్‌లు, కూలీలు, డ్రైవర్లు, ఇతర చిన్న ఉద్యోగాల్లో చేరుతున్నారు. వారి పిల్లలు కూడా ఈ కళలను నేర్చుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మన అమూల్యమైన జానపద వారసత్వం భావితరాలకు అందకుండా పోయే ప్రమాదం ఉంది.

కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం జానపద కళలను తెలంగాణ సాంస్కృతిక వారసత్వంగా గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. రాష్ట్ర సాంస్కృతిక సారథి, భాషా సాంస్కృతిక శాఖ, సమాచార ప్రజాసంబంధాల శాఖ, పర్యాటక శాఖ, ఆరోగ్యశాఖలు సంయుక్తంగా ప్రతి జిల్లాలో జానపద కళాకారుల నమోదుతో వార్షిక ప్రదర్శనల క్యాలెండర్ రూపొందించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, పాఠశాలలు, కళాశాలలు, పర్యాటక కేంద్రాలు, శిల్పారామం, రాష్ట్ర ఉత్సవాలు, జిల్లా ఉత్సవాల్లో క్రమం తప్పకుండా జానపద కళా ప్రదర్శనలు నిర్వహించాలి. జానపద కళలకు జీవనాధారం కల్పించడం అంటే కేవలం కళాకారులను ఆదుకోవడం మాత్రమే కాదు; తెలంగాణ సంస్కృతిని, చరిత్రను, భాషను, ఆత్మను భావితరాలకు సజీవంగా అందించడం. కళాకారుడు బతికితేనే కళ బతుకుతుంది. కళ బతికితేనే సంస్కృతి బతుకుతుంది. సంస్కృతి బతికితేనే తెలంగాణ తన ప్రత్యేకతను శాశ్వతంగా నిలబెట్టుకోగలదు.

# నాణ్యమైన వైద్య సేవలు

● సిఎస్ సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే వైద్య సహాయం అందే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఇందుకు 24 గంటల సహాయ వ్యవస్థ, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, సంబంధిత ఆసుపత్రులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ (టిఇహెచ్‌సిటి) కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన శుక్రవారం ట్రస్ట్ సమావేశం జరిగింది. లబ్దిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ట్రస్ట్ కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు అవసరమైన సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం సంజయ్ జాజు మాట్లాడుతూ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకునేలా కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, యోగితా రాణా, క్రిస్టియానా జెడ్ చొంగ్తూ, శిఖా గోయల్, హెల్త్‌కేర్ ట్రస్ట్ సిఇఒ జెంగోరే హనుమంత్ కొండిబా, వివిధ శాఖల కార్యదర్శులు శ్రుతి ఓజా, దివ్య, సిక్తా పట్నాయక్, టిఎన్‌జిఒ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టిజిఒ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, తెలంగాణ సెక్రెటేరియట్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీనివాస రెడ్డి, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి, ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, పిఆర్‌టియు నాయకులు దామోదర్ రెడ్డి, యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావారవి, తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి, ఎస్‌టిఎఫ్ అధ్యక్షులు డి.సైదులు పాల్గొన్నారు.



# మీ సేవలో 'ఫ్యామిలీ సర్టిఫికెట్'

● డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పౌరులు, వారి కుటుంబ సభ్యుల వివరాలతో 'ఫ్యామిలీ సర్టిఫికెట్' అందించనున్నట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రంలోని తహశీల్దార్ కార్యాలయాలు, మీసేవ కేంద్రానికి వెళ్లి 'ఫ్యామిలీ సర్టిఫికెట్' పొందవచ్చని సూచించారు. ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం తదితర పథకాలు లబ్ది పొందుతున్న రాష్ట్ర కుటుంబ సభ్యులు ఉన్న వారి వివరాలను సంబంధిత సమాచారాన్ని తహశీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీమ్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి ఏ కుటుంబమైనా తమకు సంబంధించిన సమాచారం, కుటుంబ సభ్యుల సమాచారం కావాలనుకుంటే తహశీల్దార్ ఆఫీస్, మీసేవ కేంద్రానికి వెళ్లి ఈ 'ఫ్యామిలీ సర్టిఫికెట్' పొందవచ్చని ఆయన చెప్పారు. తద్వారా రాష్ట్రంలో ఏ వ్యవస్థనైనా, ఏ సంస్థనైనా కుటుంబ వివరాలకు సంబంధించి సర్టిఫికెట్ అడిగితే సమాచారం ఇవ్వడానికి ఫ్యామిలీ సర్టిఫికెట్ ఉపయోగకరమని భట్టి విక్రమార్క అన్నారు.

# ఆగస్టు చివరి వారంలో.. 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణాలకు శ్రీకారం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'ఇందిరమ్మ టవర్స్' పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించనున్నట్లు హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, పనులు మొదలుపెట్టేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు.

**తొలి విడతలో 8 వేల ఇళ్లు**

హైదరాబాద్ నగర పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో 4 నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, దశలవారీగా అన్ని ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. చివరికి ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మించబోతున్నామని చెప్పారు.

**రూ.40–60 లక్షల విలువైన ఫ్లాట్ ఉచిత రిజిస్ట్రేషన్**

పేద ప్రజలు సైతం నగరంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

**ఆగస్టు 10 దరఖాస్తులకు ఆఖరు తేదీ**

లబ్ధిదారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10 చివరి తేదీ అని, గడువు పెంపు ఉండదని స్పష్టం చేశారు. నివాస ధృవీకరణ కోసం ఆధార్‌తోపాటు ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని అన్నారు.

**ఈఎంఐ రూ.10 వేలు 100 శాతం రీఫండ్**

ఇంటి కేటాయింపు ప్రక్రియలో చెల్లించే రూ. 10,000 ఈఎంఐ సొమ్ముపై ఎలాంటి అపోహలు వద్దని పొంగులేటి స్పష్టం చేశారు. ఒకవేళ ఇల్లు రాకపోతే లేదా అర్హత లభించకపోతే ఆ మొత్తాన్ని 100 శాతం రీఫండ్ చేస్తామన్నారు. యుపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించిన ఖాతాలో నేరుగా ఆ డబ్బులు జమ అవుతాయన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని, ప్రస్తుతం వస్తున్న భారీ దరఖాస్తులే ఈ పథకంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులపై సిఎం వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఒకవైపు 'జెన్ జీ' యువతకు గౌరవం ఇవ్వాలని, వారి ప్రతిభను వినియోగించుకోవాలని చెబుతూ, మరోవైపు ఇంజినీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అని కించపరిచేలా మాట్లాడటం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి విద్యార్థులకు భరోసా కల్పించాల్సింది పోయి, అవమానకర వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు దేశ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను సంపాదించేందుకు కష్టపడుతున్నారని, అలాంటి విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఉన్నత విద్యాశాఖ పర్యవేక్షణలో లోపాలు, సరైన తనిఖీలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ నిర్మించిన వరద కాలువలతోనే ఎల్లంపల్లికి జలకళ

● రైతు సంతోషాన్ని చూసి ప్రతిపక్ష నేతలు ఓర్వలేకపోతున్నారు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన వరద కాలువల ద్వారానే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద జలాలు చేరాయని, దీంతో బిఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేసిన అబద్ధాలు బట్టబయలయ్యాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిందని, అక్కడి నుంచి మిడ్ మానేరు, లోయర్ మానేరు సహా దిగువ ప్రాంతాలకు నీటి విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రావిటీ ఆధారిత వరద కాలువలతో ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించిందని, అందువల్లే ఎలాంటి ఎత్తిపోతల అవసరం లేకుండానే వరద నీరు సహజసిద్ధంగా ప్రాజెక్టుకు చేరిందని చెప్పారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటార్లు ఆన్ చేయాలంటూ బిఆర్‌ఎస్ నాయకులు చేసిన ప్రచారం వాస్తవాలతో తేలిపోయిందన్నారు. ఈ అంశంపై కెటిటీఆర్, హరీష్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు సంతోషంగా సాగు పనులు చేపడుతుంటే బిఆర్‌ఎస్ ఓర్వలేకపోతోందని విమర్శించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే నిర్మితమయ్యాయని, వాటి నాణ్యతపై ఎలాంటి విమర్శలు రాలేదన్నారు. అయితే బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును నిలిపివేసి భారీ ఎత్తిపోతలతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని, తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే సహజ గ్రావిటీ ద్వారానే నీటి సరఫరా జరిగేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో ఉత్తర తెలంగాణలో సాగు విస్తీర్ణం పెరిగిందని, రైతు సంక్షేమం, సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# ఎల్లంపల్లి నిండటంతో బిఆర్‌ఎస్ అబద్ధాలు బట్టబయలు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోస్తేనే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుతుందంటూ బిఆర్‌ఎస్ నేతలు చేసిన ప్రచారం పూర్తిగా అసత్యమని, తాజా పరిస్థితులతో అది బట్టబయలైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ హరీష్‌రావు, కెటిఆర్‌తోపాటు బిఆర్‌ఎస్ నాయకులు ఎల్లంపల్లి ప్రాజెక్టుపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా విషప్రచారం చేశారని విమర్శించారు. అయితే ప్రకృతి వారికే సమాధానం చెప్పిందని పేర్కొన్నారు. త్వరలో ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు డ్యామ్‌కు నీటి ఎత్తిపోతల ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లకు నీటిని తరలిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటినే బిఆర్‌ఎస్ నేతలు కాళేశ్వరం నీళ్లుగా చెప్పుకోవడం విడ్డూరమని విమర్శించారు. కరవును కూడా రాజకీయంగా ఉపయోగించుకోవాలని బిఆర్‌ఎస్ ప్రయత్నించిందని, కానీ ప్రకృతి ప్రజాపాలనకు అండగా నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని వేములవాడలో వరుణయాగం నిర్వహిస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# ఊపందుకున్న పంట కుంటల నిర్మాణం

● వర్షపునీటి సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

● మహిళా సంఘాలు, పంచాయతీల భాగస్వామ్యంతో పనులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి, వ్యవసాయానికి భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పంట కుంటల నిర్మాణం వేగవంతమైంది. మహిళా సంఘాలు, గ్రామపంచాయతీల సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యే క చర్యలు తీసుకుంటున్నారు. జూలై 30 నాటికి ఏగ్రేడ్ గ్రామ సమాఖ్యల పరిధిలో నిర్దేశించిన 13,046 పంట కుంటల లక్ష్యంలో ఇప్పటికే 4,348 పనులను 33 శాతం గుర్తించి మంజూరు చేశారు. దీనిద్వారా 9, 930 మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 50,000 పంట కుంటలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటివరకు 3,173 పనులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయి. ఈ పనుల్లో 12,619 మంది కూలీలు భాగస్వాములవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6,523 ఏగ్రేడ్ గ్రామ సమాఖ్యల్లో ఒక్కో విఓకు రెండు చొప్పున ఈ కుంటలను కేటాయించారు. పొలాల్లో వర్షపు నీరు వృథాగా బయటకు పోకుండా నిల్వ చేసేందుకు ఈ కుంటలు ఎంతో దోహదపడతాయి. వీటివల్ల పంటలకు అవసరమైనప్పుడు నీటిని అందివ్వడమే కాకుండా, భూగర్భజలాలు పెరిగి వర్షాధార రైతులకు అదనపు ధీమా లభిస్తుంది. నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయడంతో పనుల వేగం, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

**ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి : మంత్రి సీతక్క**

'వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి. పంట కుంటలు రైతులకు సాగు నీటి భద్రతను అందిస్తాయి. మహిళా సంఘాలు, గ్రామపంచాయతీలు కలిసికట్టుగా పనిచేసి ఈ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి. గ్రామంలో నిర్మించే ప్రతి కుంట భవిష్యత్ తరాలకు నీటి భరోసానిస్తుంది. తెలంగాణను జలసమృద్ధిగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి' అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# టూరిస్ట్ బస్సుల పన్ను విధానంలో మార్పులు

● 'ఒకే రాష్ట్రం ఒకే పన్ను విధానం' యోచనలో రవాణా శాఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టూరిస్ట్ బస్సులపై ప్రస్తుతం అమలులో ఉన్న త్రైమాసిక పన్ను విధానాన్ని హేతుబద్ధీకరించే దిశగా తెలంగాణ రవాణా శాఖ చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు రవాణా శాఖ కమిషనర్ ఇళంబర్తి, అదనపు రవాణా కమిషనర్ రమేష్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) చంద్రశేఖర్ గౌడ్ శుక్రవారం టూరిస్ట్ బస్సు యజమానులతో సమావేశమై పన్ను విధానంలో మార్పులపై చర్చించారు. ప్రస్తుతం టూరిస్ట్ బస్సులపై సింగిల్ డిస్ట్రిక్ట్ ట్యాక్స్, టూ డిస్ట్రిక్ట్ ట్యాక్స్, స్టేట్ ట్యాక్స్ అనే మూడు వేర్వేరు స్లాబుల ద్వారా పన్ను వసూలు చేస్తున్నారు. ఈ విధానాన్ని సరళీకరించి, ఆపరేటర్లపై అదనపు పన్ను భారం లేకుండా మూడు స్లాబులను తొలగించి 'ఒక రాష్ట్రం ఒకే పన్ను' విధానాన్ని అమలు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కమిటీ నివేదికతో పాటు టూరిస్ట్ బస్సు ఆపరేటర్ల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన టూరిస్ట్ బస్సు యజమానులు తమ అభిప్రాయాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

● గురువారం అర్ధరాత్రి 12.51 గంటలకు మృతి

● జులై 26న గుండెపోటుతో తీవ్ర అస్వస్థత

● యశోద ఆస్పత్రిలో ఐదురోజులుగా మృత్యువుతో పోరాటం

● పెద్దికి నివాళులు అర్పించిన బిఆర్‌ఎస్ ముఖ్య నాయకులు



**ప్రజాపక్షం/హనుమకొండ :** కొద్ది రోజులుగా మృత్యువుతో పోరాడిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుడు వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి (54) కన్నుమూశారు. గత ఆదివారం హనుమకొండలో పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుకు గురైన విషయం విదితమే. తొలుత హనుమకొండలోని రోహిణి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందజేసిన అనంతరం, మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. గత ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడిన పెద్ది.. పరిస్థితి విషమించడంతో గురువారం అర్ధరాత్రి 12.51 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు యశోద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. పెద్దిని కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. గత ఆదివారం పెద్ది తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం (ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడం) బారిన పడ్డారు. దీనివల్ల ఆయన రక్తపోటు ఒక్కసారిగా పడిపోయి (హీమోడైన మిక్ కొల్లాప్స్) షాక్కు గురయ్యారు. మొదట ఆయనను రోహిణి ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో గుండె స్పందన ఆగిపోయింది. వైద్యులు సుమారు 45 నిమిషాల పాటు పలుమార్లు సీపీఆర్, ఏసీఎల్‌ఎస్ చికిత్సలు అందించగా గుండె మళ్లీ కొట్టు కోవడం ప్రారంభించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే గుండె ఆగిపోయిన సమయంలో మెదడుకు ఆక్సిజన్ అందకపోవడంతో సుదర్శన్ రెడ్డి నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందినప్పటికీ శబ్దాలకు, స్పర్శకు ఎలాంటి స్పందన చూపించలేక చివరకు ఆయన తుదిశ్వాస విడిచినట్టు వైద్యులు ప్రకటించారు. పెద్దికి భార్య మాజీ జెడ్పీటీసీ స్వప్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన పెద్దిని కాపాడేందుకు బీఆర్‌ఎస్ అధిష్ఠానం అన్ని ప్రయత్నాలు చేసింది. కాగా, పెద్ది మృతదేహాన్ని శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి నర్సంపేటకు తరలించారు. తొలుత హనుమకొండకు తరలించి అదాలత్ లోని అమరవీరుల స్థూపం వద్ద ఉంచి పలువురు నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం నర్సంపేటకు తరలించగా వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

**పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెంటే..**

2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) ఆవిర్భావం తర్వాత ఉద్యమ నేత కెసిఆర్ వెంటే ఉండి పార్టీలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కీలక నేతగా ఎదిగిన పెద్ది సుదర్శన్ రెడ్డి 2001లో జడ్పీటీసీగా గెలుపొందారు. తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి గ్రామగ్రామన సమావేశాలు నిర్వహించారు. పార్టీ అధినేత ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యమాలలో, పోరాటాలలో చురుకుగా పాల్గొని ఉధృతం చేశారు. అనంతరం 2012లో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో లక్షల మందితో తెలంగాణ గర్జన నిర్వహించి ఓరుగల్లు సత్తా చాటారు. పార్టీ అధినేత కెసిఆర్‌కు విధేయుడిగా ఉంటూ రాష్ట్ర సాధనలో పెద్దన్న పాత్ర పోషించారు. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016లో సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి చేపట్టి 2018లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ వెన్నంటే నడిచి ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారులకు బాసటగా నిలిచారు.

**తెలంగాణ వచ్చాకే పెళ్లి... ఉద్యమం కోసం శపథం**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు తాను పెళ్లి చేసుకోనని... బ్రహ్మచర్యం పాటిస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. సుమారు ఏడు సంవత్సరాల పాటు తన మాటను నిలబెట్టుకున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాత్రమే తన శపథాన్ని విరమించారు. అనంతరం కుటుంబ సభ్యులు చూసిన స్వప్నను తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో వివాహం చేసుకున్నారు. వారికి నిదర్శన్ రెడ్డి, ధర్మిష్ఠ రెడ్డి అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

**అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్, వరంగల్ పోలీస్ కమిషనర్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల రాష్ట్ర మంత్రులు, పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డి గుర్తుండిపోతారని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమని మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపిలు బోయినపల్లి వినోద్‌కుమార్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

**పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని సిఎం కొనియాడారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బాధాకరం: కూనంనేని సాంబశివరావు**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. సుదర్శన్‌రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచలంచలుగా రాజకీయంలో ఎదిగారని పేర్కొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారని వారు గుర్తు చేశారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయాను: మాజీ సిఎం కెసిఆర్**

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని కెసిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఇంజనీర్లను తక్కువ చేసి మాట్లాడటం బాధ్యతారాహిత్యం

● సిఎం వ్యాఖ్యలను ఖండించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా నిర్వహిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అని వ్యాఖ్యానించడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సిఎం హోదాలో ఉన్న వ్యక్తి సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపి మార్పుకు ప్రయత్నించాలి తప్ప, విద్యార్థులను అవమానించడం తగదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అన్నారు. 'క్రిమినల్ వేస్ట్', 'వానాకాలం చదువులు' అని కామెంట్ చేసే ముందు ఆలోచించాలని, జెన్‌జి ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రవర్తించవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ. 5,000 కోట్లతో సహా మొత్తం రూ. 10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ బకాయిలు చెల్లించాలని విద్యార్థులు, యాజమాన్యాలు అడుగుతున్నందుకే, తట్టుకోలేక రేవంత్ రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో విద్యార్థులపై ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ విచారణల పేరుతో దాడి చేయించారని, 'తమాషాలు చేస్తే తాట తీస్తాం' అంటూ బెదిరించారని అన్నారు. గతంలో 2015లో నాటి సిఎం కెసిఆర్ కూడా ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రమాణాలు బాగోలేవని, 'వానాకాలం చదువులు' అంటూ అసెంబ్లీ సాక్షిగా విద్యార్థులను కించపరిచారన్నారు. 9 ఏళ్లు అధికారంలో ఉన్నా కెసిఆర్ వ్యవస్థలో మార్పు తేలేదని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయం,
మిషన్ భగీరథ-ఇన్‌ట్రా, డివిజన్-భువనగిరి.
టెండర్ ప్రకటన
e-NIT NO. 01/T3/MB Division Bhongir/2025-26, తేది: 04.08.2026 (షార్ట్ టెండర్)
యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ, వార్డు నం. 10లో బోర్‌వెల్ తవ్వకం మరియు సబ్‌మెర్సిబుల్ పంప్‌సెట్ ఏర్పాటు. అంచనా విలువ: రూ.4.99 లక్షలు, టెండర్ల సమర్పణ ప్రారంభ తేదీ: 04.08.2026 మ.03.00గం.ల నుండి 11.08.2026 మ.03.00 గం.ల వరకు. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎంబి సర్కిల్, భువనగిరి.
DIPR R.O. No. : 7070-PP/CL/ADVT/2026-27, Date: 31-07-2026

మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), MMC (HQ) కార్యాలయం, తార్నాక హుడా కాంప్లెక్స్, హైదరాబాద్.
E-mail : eem.mulhq@gmail.com
కొటేషన్ నోటీస్
Quotation Notice No. NIT No. 12/EE/MMC(HQ)/2026-27, Date : 31.07.2026
కింద పేర్కొన్న పని కొరకు పేరున్న సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి. ఈ కొటేషన్లు తేదీ 01.08.2026న లేదా అంతకుముందుగా దిగువ సంతకందారుకు అందజేయాల్సిందిగా కోరడమైనది. ఈ కొటేషన్లు తేదీ 01.08.2026 సాయంత్రం 4.00 గంటల వరకు లేదా అంతకు ముందు స్వీకరించబడతాయి. అందిన కొటేషన్లు 4.30 గంటలకు తెరవబడతాయి. ఇతర వివరాలను కార్యాలయ వేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M) గారి నుండి పొందవచ్చు.

| క్ర. సం. | వివరణ | అవసరమైన కొటేషన్ |
| --- | --- | --- |
| 1 | ఫ్యాక్టరీలో తయారు చేయబడిన బాహ్య ఉపరితలాలపై 6 MM దృఢమైన లేయర్‌తో కప్పబడిన 75x50 MM సాలిడ్ వుడ్ పాలిమర్ కాంపోజిట్ (డబ్ల్యుపిసి) సింగిల్ ఎక్స్‌ట్రూడెడ్ డోర్ ఫ్రేమ్‌ను సరఫరా చేసి, అమర్చడం. డోర్‌ఫ్రేమ్‌కు 32 MM /37MM రిబేట్ ఉంటుంది. రివర్స్ ఫార్వర్డ్ స్పీడ్ కంట్రోల్ హ్యాండ్ డ్రిల్లింగ్ మెషీన్‌ను ఉపయోగించి 8x75 MM పొడవుగల MS Star ఫుల్ థ్రెడ్ స్క్రూలతో రెండు నిలువు భాగాలను అడ్డ భాగాలతో కలపాలి. సిద్ధంగా/అమర్చబడిన ఫ్రేమ్‌ను Z Hand fast 300 MM పొడవుగల హోల్డ్ ఫాస్ట్‌ను ఉపయోగించి గోడకు బిగించాలి. TBSC-L.I-17 | Rate / Rmt |

సంబంధిత అధికారి చిరునామా: శ్రీ కె.రమేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), MMC (HQ), తార్నాక, హైదరాబాద్.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (HQ), తార్నాక.
DIPR R.O. No. : 7081-PP/CL/ADVT/2026-27, Date: 31-07-2026




## ప్రభుత్వ పాఠశాలకు ఆర్యవైశ్య సంఘం అండ

### విద్యార్థులకు స్పోర్ట్స్ వస్తువులు, నోట్‌బుక్స్, పెన్నులు, రింగ్ బాల్స్ పంపిణీ

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం స్థానిక ఎంపిహెచ్ఎస్ రుద్ర సముద్రం పాఠశాలలో శుక్రవారం వాసవి మాత ఆలయం, ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ వస్తువులు, నోట్‌బుక్స్, పెన్నులు, రింగ్ బాల్స్ సామాగ్రి ఇచ్చారు. వాసవి క్లబ్, వనితా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు ఎల్లప్పుడూ తమ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అండగా ఉంటామని తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పిల్లలు మంచిగా చదువుకొని, భవిష్యత్తు నిర్మించుకొని దేశం పేరు నిలబెట్టాలని చెప్పి అభిలాషించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సర్పంచ్ లింగప్ప, ఉపసర్పంచ్ రామ్‌లింగప్ప, వార్డు మెంబర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, సీనియర్ ఉపాధ్యాయులు కుమార్ ప్రహల్లాద, ఎన్.మంజులత, ఎం.ఆంజనేయులు, స్వప్న, రామ్ కిరణ్, వరుణ్, ఆర్య వైశ్య సంఘం సభ్యులు, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మక్తల్ హరికృష్ణ, వనితా క్లబ్ ప్రెసిడెంట్ కె.ప్రసన్న, వనితా క్లబ్ ప్రెసిడెంట్ మహబూబ్‌నగర్ లక్ష్మి, చీఫ్ గెస్ట్ బెండే సత్యవతి, క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శరత్ రెడ్డి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### బిసి జాగృతి సేన

**ప్రజాపక్షం/నారాయణపేట :** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిసి జాగృతి సేన ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలతో కలిసి శుక్రవారం నారాయణపేటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిసి జాగృతి సేవ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలలు ఫీజుల కోసం ఒత్తిడి తేవడంతో అనేక మంది విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు జీవో నెం.8,9లను రద్దు చేసి పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు ఎడ్ల కుర్మయ్య, విద్యార్థి నాయకులు శ్రీకాంత్, ప్రసాద్, రవి, సంగీత, వనజ, అనిత సుజాత, రాణి, కల్పన, రాజు, వెంకటేష్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఒలకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మక్తల్ :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా మక్తల్ మండలంలోని సంగంబండలో 147,149 వ పోలింగ్ బూత్ పరిధిలో 100% ఎన్యూమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బలరాంరెడ్డి ఆధ్వర్యంలో బిఎల్‌ఒలు శోభమ్మ, లక్ష్మిలను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ విధిగా చేరుకొని ఎస్ఐఆర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రక్రియను బిఎల్‌ఒలు విజయవంతం చేశారన్నారు. ఏ ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవడం శుభ పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శారద, గ్రామస్తులు బాలచంద్రారెడ్డి, అజయ్, రాము, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇంటింటి పరిశుభ్రతపై అవగాహన

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆర్.నర్సిములు అన్నారు. శుక్రవారం ఉట్కూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటి పరిశుభ్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఆర్.నర్సిములు మాట్లాడుతూ వర్షాకాలంలో ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు, నిల్వనీరు ఉండటం వల్ల దోమలు, ఈగలు అధికంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి ఆవరణను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు ఎక్కగా నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్.నర్సిములు, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని ప్రజలకు పరిశుభ్రత పై సూజనలు, సలహాలు అందించారు.

## ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు

### మాజీ ఎంపిపి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో పేదలకు శాశ్వత గృహ వసతి కల్పించాలని దృఢ సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ ఎంపిపి సూర్యప్రతాప్ గౌడ్ అన్నారు. మండలంలోని వెన్నచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మాజీ ఎంపిపి సూర్యప్రతాప్ గౌడ్ ప్రరంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులుడు సత్యం, గ్రామ సర్పంచ్ సూర్యనారాయణమ్మ, పెద్దకొత్తపల్లి మార్కెట్ చైర్మన్ దండు నరసింహ, మాజీ ఎంపిపి వరదరాజుల వెంకటేశ్వర్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగపూర్ విష్ణు, మాజీ ఎంపిటిసి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, ముచ్చిపోతే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్టాగ్రామ్ ఫిర్యాదుకు వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ప్రజా ఫిర్యాదుపై కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ తక్షణమే స్పందించారు. డబుల్ బెడ్రూమ్ కాలనీని సందర్శించి స్థానిక సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. సోషల్ మీడియా ద్వారా లేదా నేరుగా వచ్చిన ప్రతి ఫిర్యాదుపై స్పందిస్తానని చెప్పారు. ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ ఎజాస్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన మినీ గురుకుల పాఠశాల, ఏరియా ఆసుపత్రిలో

## కలెక్టర్ ఖుష్బూగుప్తా ఆకస్మిక తనిఖీ





**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ ఖుష్బూగుప్తా శుక్రవారం జడ్చర్ల మండల పర్యటనలో భాగంగా తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల జడ్చర్లతో పాటు ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన మినీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల జడ్చర్లను సందర్శించిన కలెక్టర్, పాఠశాల సిబ్బంది హాజరు రిజిస్టర్, తరగతి గదులు, సిసి కెమెరాలు పనితీరును పరిశీలించారు. అనంతరం నాలుగో తరగతి గదిలోకి వెళ్లి చిన్నారులతో మాట్లాడారు. భోజనం నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా, ఇతర సౌకర్యాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. పాఠశాలలో దోమల సమస్య తీవ్రంగా ఉందని, కొన్ని తరగతి గదుల కిటికీలకు తలుపులు కూడా లేవని అన్నారు. అలాగే కొన్నితరగతి గదులలో ఫ్యాన్లు పనిచేయడంలేదని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. పాఠశాలలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో వెంటనే ఫాగింగ్ నిర్వహించి, దోమలను నిర్మూలించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

**జడ్చర్ల ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ**

అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జడ్చర్ల మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రధాన కారిడార్, వార్డులు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి భవనం వెలుపల కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయినట్లు గుర్తించిన కలెక్టర్, వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజు కనీసం మూడు పర్యాయాలు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టి అన్ని విభాగాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పాత బజార్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను జిల్లా కలెక్టర పరిశీలించారు.

పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ ఎం.గిరిష్, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మహమ్మద్ అర్షదుల్లా, తరులు పాల్గొన్నారు.



## 'ఇందిరమ్మ' లబ్ధిదారుల వివరాలను గడువులోగా పంపించాలి

### జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత లబ్ధిదారులు ఎంపికను గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హుల పూర్తి వివరాలను వెంటనే జిల్లా కేంద్రానికి పంపించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఫీల్డ్ వెరిఫికేషన్‌ను వేగంగా పూర్తిచేయాలన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలు, గృహరహిత కుటుంబాలు, అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. అర్హుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని, అనర్హులకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. నిజమైన అర్హులు మినహాయింపునకు గురికాకుండా సమగ్ర పరిశీలన చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పథకం అమలులో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనమే విజయానికి మూలమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిపిఒ శ్రీరాములు, హౌసింగ్ ఎఇలు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వరాల గ్రంథాలయ నిర్మాణానికి రూ.3.27 లక్షలు మంజూరు

### మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని కల్వరాల గ్రామ గ్రంథాలయ భవనం రెండో అంతస్తు నిర్మాణానికి మండలపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3.27లక్షలు మంజూరైనట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ తెలిపారు. గ్రంథాలయ భవనం రెండో అంతస్తు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అదనపు నిధులు అవసరమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరగా, ఆయన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. మంత్రి ఆదేశాల మేరకు వీపనగండ్ల మండల ఎంపిడివొ శ్రీనివాస్‌రావు మండలపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3.27లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు.ఎంపిడిఒ శ్రీనివాస్‌రావుకు కల్వరాల నరసింహ కృతజ్ఞతలు తెలిపారు.

## పారిశుద్ధ్యమే సీజనల్ వ్యాధులకు శాశ్వత నివారణ

### అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/పెబ్బేరు :** డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యమే కీలకమని, జిల్లాలో ప్రతి వారం నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆయన పెబ్బేర్ మున్సిపాలిటీ 7వ వార్డుతో పాటు పెబ్బేర్ మండలం బునీయాదిపూర్ గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీధులు, డ్రైనేజీలు, నివాస ప్రాంతాలను తనిఖీ చేస్తూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య, పరిశుభ్రత చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లోని కూలర్లు, నీటి పాత్రలు, పాత టైర్లు , కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వంటి వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రతి వారం తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. నిల్వ నీరే దోమల పెరుగుదలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. దోమల వ్యాప్తిని అరిట్టేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా మందులు, ఫాగింగ్ నిర్వహించడం, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, మురుగునీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వేయడం, పరిశుభ్రతను దైనందిన అలవాటుగా మార్చుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం బునియాదిపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ అక్కడి నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, చిన్నారులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై అధికారులో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ గణేష్, జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ), ఎంపిడిఒ వెంకటేష్, ఎంపిఒ రోజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వార్డు కౌన్సిలర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పౌరులు పాల్గొన్నారు.

### వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా

## తక్షణ చర్యలు తీసుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్




**మహబూబ్‌నగర్ :** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ, పట్టణంలోని అనేక ప్రాంతాల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి, మురుగు కాల్వలు పూడికతో నిండిపోవడంతో వర్షపునీరు సరిగా వెళ్లక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనేక కాలనీల్లో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లడంతోపాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల వల్ల డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించే బాధ్యతను కూడా మున్సిపాలిటీ విస్మరించిందని, కలుషిత నీరు సరఫరా అయితే దానికి పూర్తిగా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మున్సిపాలిటీ వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, చెత్తను పూర్తిగా తొలగించాలని, మురుగు కాల్వలను యంత్రాల సహాయంతో శుభ్రం చేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు కలుషితం కాని శుద్ధమైన తాగునీరు అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, లోతట్టు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.రాము, చాన్ భాషా, సత్యానారాయణరెడ్డి, లక్ష్మణ్, రాజశేఖర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్

**ప్రజాపక్షం/అమరచింత :** సీజనల్ వ్యాధుల నివారణకై ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ పిలుపునిచ్చారు. శుక్రవారం అమరచింత మున్సిపాలిటీలోని మూడవ వార్డులో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కాలనీలోని మురుగు కాలువలను, పరిసరాలను పారిశుద్ధ్య సిబ్బందిచే పరిశుభ్రం చేయించారు.ఈ సందర్భంగా నూరుల్ నజీబ్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులకు గురికాకుండా దోమల నివారణకై ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని కాలనీవాసులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతలో కాలనీవాసులందరూ భాగస్వాములై ఎప్పటికప్పుడు చెత్తాచెదారం లేకుండా ఉంచుకోవాలని కోరారు. దోమల నివారణకై మురుగు కాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్ ను చల్లించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్ పర్సన్ జింక సువర్ణ, మూడో వార్డు కౌన్సిలర్ పి.తిరుమలేష్, మున్సిపల్ మేనేజర్ యూసుఫ్, ఆర్పీలు, వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సిహెచ్‌సి ఆసుపత్రిలో అందుబాటులో చిల్డ్రన్స్ స్పెషలిస్ట్

ప్రజాపక్షం/వీపనగండ్ల : వీపనగండ్ల మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ (శిశు వైద్య నిపుణులు) డాక్టర్ వంశీ అందుబాటులో ఉన్నట్లు సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. చిన్నపిల్లలకు జ్వరం, దగ్గు, జలుబు, శ్వాసకోశ, సంబంధిత సమస్యలు పోషకాహార లోపం, అలర్జీలు నవజాత శిశువుల ఆరోగ్య సమస్యలు, టీకాలు, ఎదుగుదల, అభివృద్ధికి సంబంధించిన వ్యాధుల నిర్ధారణతో పాటు అవసరమైన వైద్య చికిత్సలను ఆసుపత్రిలో అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం సిహెచ్‌సి ఆసుపత్రిని ఆశ్రయించాలని డాక్టర్ శ్రీనివాసులు కోరారు.

## తెలంగాణ ఉద్యమకారుడికి ఘన నివాళి

**ప్రజాపక్షం/వెల్దండ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు చిరస్థాయిలో నిలిచిపోతాయని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ జంగిలి నిరంజన్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై డాక్టర్ బిఆర్ఎస్ విగ్రహం వద్ద మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన త్యాగాలు, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, తెలంగాణ రాష్ట్ర అవిర్భావం కోసం అనేక కష్టనష్టాలను భరిస్తూ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నాయకుల్లో ఆయన ఒక్కరని గుర్తుచేశారు. నివాళులర్పించిన వారిలో ఉద్యమకారులు సింగం విజయ్‌గౌడ్, కానుగుల జోగయ్య, మొక్తాల శేఖర్ ముదిరాజు, పోలేఅశోక్‌కుమార్, గుద్దటి ప్రభాకర్, ద్యాప ఆనంద్‌రెడ్డి, లింగం ముదిరాజు, యాదిగిరి, డీలర్ వెంకటయ్య, గోరటి అశోక్, లక్ష్మారెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జూద స్థావరంపై దాడి 8 మందిపై కేసులు

**ప్రజాపక్షం/గట్టు :** మండలంలోని బోయలగూడెం గ్రామంలో శుక్రవారం ఓ జూద స్థావారంపై దాడి చేసి 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సుధాకర్ గౌడ్ కథనం ప్రకారం బోయలగూడెం గ్రామ శివారులో కొంత మంది జూదం ఆడుతున్నట్లు ఠాణాకు శుక్రవారం సమాచారం అందింది. ఈ క్రమంలో పోలీసులు రహస్యంగా అక్కడికి చేరుకున్నారు. అప్పటికి పేకాట ఆడుతున్న వారు పారిపోయేందుకు ప్రయత్నం చేశారు. వారిలో 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో ఉన్న నగదు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎన్యుమరేషన్ పత్రాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్లో ఓటరుగా నమోదు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ పత్రాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్లో ఓటరుగా నమోదు కాబడతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని 17వ వార్డు భీమ్‌నగర్, రెవెన్యూ కాలనీలకు సంబంధించి, పోలింగ్ స్టేషన్ 256 పరిధిలో బూత్ లెవెల్ అధికారులు ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా మొదట నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత పిఎస్ పరిధిలో ఉన్న మొత్తం ఓటర్లు, ఎన్నుమరేషన్ ఫారాలు పంపిణీ, ఓటర్ల నుంచి తిరిగి తీసుకున్న పూరించిన ఫారాల సంఖ్య, డిజిటలైజేషన్ శాతం వివరాలను అడిగారు. ఆగష్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ పూర్తి కావాల్సి ఉన్నందున బిఎల్‌ఒలు ఇంకా ఫారాలు పూరించి ఇవ్వని ఓటర్లతో తిరిగి తీసుకోవాలన్నారు. మరణించిన, డబుల్ ఓట్లు కలిగిన, చిరునామా మారిన, వలస వెళ్లిన ఓటర్ల విషయంలో నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ పర్యటనలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఉప తహసీల్దార్ అజిత్, సూపర్వైజర్, తిమ్మప్ప, బిఎల్‌ఒ సునీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరిదేవిగా వాసవీమాత

### కూరగాయలతో అమ్మవారి విశేష అలంకరణ

### భక్తిశ్రద్ధలతో ఆషాఢ మాసం మూడో శుక్రవారం వేడుకలు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరిదేవి అలంకరణలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దీంతో ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఆలయ అర్చకులు కిట్టుస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజామునే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మహా మంగళహారతి సమర్పించారు. ఆషాఢ మాసంలో శాకాంబరి దేవి అలంకరణకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని పట్టణ ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున కూరగాయలను ఆలయానికి తీసుకువచ్చారు. వివిధ రకాల కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారి ఉత్సవమూర్తిని అత్యంత సుందరంగా అలంకరించారు. ముఖ్యంగా ఆర్యవైశ్య మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని కూరగాయలను కళాత్మకంగా అమర్చి చిన్నమ్మవారికి శాకాంబరి దేవి రూపాన్ని తీసుకువచ్చారు. కూరగాయలతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు అలంకరణను వీక్షిస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేకంగా కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, వాసవి మాతా పారాయణం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయ పరిసరాల్లో పల్లకీసేవ నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆషాఢ మాసం, శాకాంబరి దేవి అలంకరణకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. ప్రకృతి, పంటలు, ఆహార సమృద్ధికి ప్రతీకగా శాకాంబరి దేవిని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువతలు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, భక్తులు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఆగస్టు 15లోపు 'కురుమ కార్పొరేషన్' ఏర్పాటు

హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సిఎంను కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం

**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్రంలో కురుమ సామాజిక వర్గం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న 'కురుమ కార్పొరేషన్' ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రంలో కురుమ కార్పొరేషన్ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెల్లడించారు. శుక్రవారం కురుమ సంఘం రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశంతో కలిసి ఐలయ్య హైదరాబాద్లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కురుమ సామాజిక వర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సీఎంతో వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా కురుమల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వచ్చే ఆగస్టు 15వ తేదీలోపు కురుమ కార్పొరేషన్ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మీడియాకు వెల్లడించారు. కార్పొరేషన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ పట్ల కురుమ సమాజంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని నేతలు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల తమ ఆకాంక్ష నెరవేరబోతుండటం పట్ల కురుమ కులస్తుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీర్ల అయిలయ్య, ఎగ్గే మల్లేశం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎంఈఓ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ తో కలిసి పాఠశాలలోని విద్యా బోధన, మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో వారి విద్యాభ్యాసం, ఎదురవుతున్న సమస్యలు, ఆహార నాణ్యత, ఫుడ్ మెనూ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనాన్ని ప్రతి రోజూ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి గుట్టురట్టు

దుర్గాపురం స్టేజీ వద్ద ఇద్దరు అరెస్ట్, మరో నిందితుడు పరారీ

2కిలోల గంజాయి, పల్సర్‌బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం



**ప్రజాపక్షం/కోదాడ:** మత్తు పదార్థాల అక్రమరవాణ, విక్రయాలపై కోదాడ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. పట్టణ శివారులోని దుర్గాపురం స్టేజీ వద్ద గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద రెండు కిలోల గంజాయి, పల్సర్ బైక్‌ను, ఒక సెల్ ఫోన్ స్వాదీనం చేసుకున్నట్లు కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దుర్గాపురం స్టేజీ వద్ద తనిఖీలు నిర్వహించగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో మరో వ్యక్తి పరారిలో ఉండగా అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలుచేపట్టినట్లు వివరించారు. ఈ గంజాయి కేసును చాకచక్యంగా పట్టుకున్న పట్టణ సిఐశివశంకర్, ఎస్ఐ అజయ్‌కుమార్, క్రైమ్ పార్టీ సిబ్బంది లోకేష్, నవీన్, శివ లను అభినందించారు.

## నేడు ఎఐటియుసి జిల్లా మహాసభలు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఎఐటియుసి సూర్యాపేట జిల్లా మూడో మహాసభల ఏర్పాట్లను ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా మహాసభలకు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, సిపిఐ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ ఏర్పాట్లలో ఎఐటియుసి గౌరవ సలహదారులు చామల అశోక్‌కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రాజారాం, సాయిబాబా, శ్రీకాంత్, సైదులు పాల్గొన్నారు.

## నూతన ఎస్‌ఐకి సన్మానం

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఏడుకొండలని అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్‌ఐ ఏడుకొండలు నాయకత్వంలో స్థానిక పోలీస్ శాఖ, ప్రజాప్రతినిధులు ప్రజలను సమన్వయంతో అనంతగిరి మండలంలో శాంతిభద్రతల మరింత బలోపేతం కావాలన్నారు. కొండపల్లి వాసు, బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నర్సింహారెడ్డి, ముత్తినేని కోటేశ్వరరావు, ముస్కు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

### యువత, నిరుద్యోగుల జీవితాలతో

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం

ఖాళీల భర్తీ, ఉద్యోగాల కోసం యువత సంఘటితం కావాలి : ఎఐవైఎఫ్




**ప్రజాపక్షం/డిండి:** నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీకి, ఉద్యోగ హక్కుల కోసం యువత సంఘటితం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. శుక్రవారం ఏఐవైఎఫ్ డిండి మండల 15వ మహాసభ స్థానిక యెలకుర్తి జైపాల్ గార్డెన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు ఏఐవైఎఫ్ జెండాను జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఎగరవేశారు. అనంతరం జరిగిన మహాసభలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత ఉద్యగోల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికి నియామకాలు సకాలంలో పూర్తికావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిండి మండలంలో యువత ప్రధానంగా నిరుద్యోగం, స్థానిక పరిశ్రమల కొరత, వలసలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల లేని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం యువత సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని, సెప్టెంబర్ 8, 9, 10 తేదిలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రభుత్వ ఖాళీల భర్తీ, యువత హక్కులు తదితర అంశాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి ఉదయ్, డివిజన్ అధ్యక్షులు వినయ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, కోశాధికారి మధుకర్, సభ్యులు వెంకటేష్, శివ, అనిల్, ప్రవీణ్, నాగార్జున్ పాల్గొన్నారు.

## గత సంవత్సరం కంటే అడ్మిషన్స్ పెరిగాయా?

మోడల్ స్కూల్ విద్యార్థుల సంఖ్యపై కలెక్టర్ ఆరా



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలో ఉన్న ప్రభుత్వ కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, పి ఎం మోడల్ స్కూల్,కాలేజీ, మండల ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ సెంటర్ లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు.కేజీబివిలో విద్యార్థుల సంఖ్య ఎంత,గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్స్ పెరిగాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది టీచర్స్ ఉన్నారు. అందరు రెగ్యులర్ గా వస్తున్నారా అని అడిగారు.స్కూల్ లో కిచెన్, స్టోర్ రూమ్ లు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా, స్టోర్ లో కూరగాయలు ఫ్రెష్ గా ఉన్నాయా, ఎగ్స్, ఆయిల్ పాకెట్స్ ఎక్సపైరీ డేట్ ఉన్నాయా లేవా అని పరిశీలించారు.విద్యార్థులతో రోజు మెనూ ప్రకారం ఫుడ్ పెడుతున్నారా లేదా, ఈ వారంలో చికెన్ పెట్టారా రుచికరంగా ఉంటున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బిఎస్‌కే టీం వాళ్ళు ఈ సంవత్సరం వచ్చి టెస్ట్‌లు చేసారా లేదా అని, అందులో రక్తహీనత ఉన్న విద్యార్థులు ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ కాలేజీ లలో 14 ఏళ్ల లోపు బాలికలకే హెచ్పీవీ వ్యాక్సిన్ పై అవగాహన కల్పిస్తూ 100% చేయించాలని డిఈఓ కి ఆదేశించారు. అంగన్వాడి సెంటర్ సెంటర్లో ఎంతమంది చిన్నారులు ఉన్నారు, అందులో సామ్ అండ్ మామ్ లో ఎవరైనా పిల్లలు ఉన్నారా అని అంగన్వాడి టీచర్ ని అడిగి తెలుసుకున్నారు. మామ్ లో ఉన్న పిల్లలకి ఏం ఫుడ్ పెడుతున్నారు అని,పిల్లలకి ఏమేమి నేర్పిస్తున్నారు ఆట వస్తువులు ఉన్నాయా లేవా అని అడిగారు. ఈ సంవత్సరంలో కొత్తగా ఏమైనా అడ్మిషన్లు వచ్చాయా గ్రామంలో ఎంతమంది పిల్లలే ఉన్నారా అని అడిగారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కొరకు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

## నకిలీ డిఏపి తయారీదారులు అరెస్ట్

పోలీసుల అదుపులో ఆరుగురు

మిగిలిన ఇద్దరిని కూడా పట్టుకుంటాం

కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నకిలీ డిఏపి అడుగు మందు తయారు చేసి అమాయకులైన రైతులను మోసం చేస్తూ అమ్ముతున్న ముఠా గుట్టురట్టు చేశారు మఠంపల్లి పోలీసులు. తెలంగాణ రాష్ట్రంలో అడుగు మందు డిఏపి కొరత ఉన్న విషయాన్ని అదునుగా చేసుకుని రైతులను మోసం చేయాలనే ఉద్దేశ్యంతో కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఈ నకిలీ దందాకు తెరలేపారు. శుక్రవారం కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి హుజూర్ నగర్‌లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 15వ తేదీన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల వ్యవసాయ అధికారి బొలిశెట్టి శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారం మేరకు మఠంపల్లి పోలీసులతో కలిసి మండంలోని రఘునాధపాలెం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా కొండేటి పిచ్చిరెడ్డి అనే వ్యాపారి దగ్గర నకిలీ డిఏపి కట్టలను స్వాదీనం చేసుకున్నారు. ఈ నేరానికి సంబంధించి కేసు నమోదు చేసి హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు, మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్, ఎఎస్ఐ బలరాంరెడ్డి, శంభయ్య, నాగరాజు ఆధ్వర్యంలో విచారణ జరపగా వీస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. రఘునాధపాలెం గ్రామానికి చెందిన కొండేటి పిచ్చిరెడ్డితో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 8 మంది ముఠాగా ఏర్పడి నకిలీ డిఏపి మందు దందాకు తెరలేపినట్లు విచారణలో తెలిసింది. హైద్రాబాద్ నగరంలో పెద్ద అంబర్‌పేట పరిధిలోని అబ్దుల్లాపూర్ మేట్‌లో గోదాం ఏర్పాటు చేసుకుని అక్కడ కోట్ల రూపాయల విలువ కలిగిన నకిలీ డిఏపి అడుగు మందు బస్తాలను తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ముఠాకు సంబంధించి 8 మందిని నిందితుల్లో ఆరుగురిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు ఒక డిసిఎం వాహనం, ఒక మారుతి ఎర్టిగా కారు, ఐదు సెల్ ఫోన్లు, వివిధ కంపెనీలకు చెందిన లేబుల్ కలిగిన నకిలీ డిఏపి బస్తాలు, నకిలీ ఎరువు మందులు తయారు చేయడానికి వాడిన మిషన్, నకిలీ పాస్పేట్, దాదాపు రెండుకోట్ల విలువైన సామాగ్రిని పట్టుబడి చేసి స్వాదీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారిలో ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకుని తగిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతులు రాష్ట్ర వ్యవసాయ అధికారులు సూచించిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులను కొనుగోలు చేసి ఆర్థికంగా శారీరకంగా నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ చరమందరాజు, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, హనుమాన్‌నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

## విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అడిషనల్ కలెక్టర్ హెచ్చరిక



**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక సంస్థల గౌరవ అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు శుక్రవారం రామన్నపేట మండలంలో ఆకస్మికంగా పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా ఆయన జనంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్, మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి, ఎంపీడీఓ కార్యాలయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు పలు కీలక సూచనలు చేశారు. ముందుగా జనంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్, అక్కడ నెలకొన్న కోతుల సమస్యపై ఆరా తీశారు. కోతుల బెడద లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టల్ చుట్టూ ఉన్న సోలార్ ఫెన్సింగ్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ ఏఈని ఆదేశించారు. అలాగే, విద్యార్థులకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ ఏఈకి స్పష్టం చేశారు. హాస్టల్ పక్కనే ఉన్న రైతు భూమిలో పెరిగి ప్రమాదకరంగా మారిన చెట్లను తక్షణమే తొలగించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడాన్ని గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సూపరింటెండెంట్ తీరుపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆవుల రాములు, ఏఈలు ఆశిష్ రాఘవ, సందీప్, పంచాయతీ కార్యదర్శులు సైదిరెడ్డి, అయ్యప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో నిరుద్యోగ యువతకు అన్యాయం

యాదాద్రి భువనగిరి జిల్లా ఎఐవైఎఫ్ కార్యదర్శి పేరబోయిన మహేందర్



**ప్రజాపక్షం/మోటకొండూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పోలీస్ రిక్రూట్మెంట్ యాదాద్రి భువనగిరి జిల్లాకు ఖాళీలు లేవని ప్రకటించడం సరైన విధానం కాదని ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వీరబోయిన మహేందర్, యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ లు ఆరోపించారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మూటకొండూర్ మండల నిర్మాణ మహాసభ బీరకాయల మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్‌లో కోడ్ నెంబర్ 21 సివిల్ కానిస్టేబుల్, కోడ్ నెంబర్ 22 ఏఆర్ కానిస్టేబుల్ జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లా (ఖాళీలు)లేకపోవడం వల్ల జిల్లాకు సంబంధించిన నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 317 జీవో ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా, రాచకొండ పరిధిలో ఉండేదని, నల్గొండ, సూర్యాపేట ఇతర జిల్లాలకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు యాదాద్రి జిల్లాలో విధులకు కేటాయించబడ్డారని ఈ కేటాయింపు పారదర్శకంగా జరగలేదన్నారు. సెప్టెంబర్ 8 9 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు, యువజన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఏర్పాటు : ఏఐవైఎఫ్ మోటకొండూరు మండల శాఖ అధ్యక్షులుగా బీరకాయల మధు, ప్రధాన కార్యదర్శిగా గొట్టిపాముల సునీల్ కుమార్, సహాయ కార్యదర్శిగా దేవల్ల కృష్ణ, కోశాధికారిగా పల్లె ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆలేటి సాయికుమార్, రేగు పాండు తదితరులు పాల్గొన్నారు.

## ముద్ర రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని చేనేత కళాకారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిని విస్తరించడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా చేనేత కళాకారులకు ముద్ర రుణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.చేనేతకు ప్రభుత్వం అండచేనేత రంగం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే రంగమని,చేనేత కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు.అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు ముద్ర రుణాలను వినియోగించుకుని తమ వృత్తిని విస్తరించి, ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.ముద్ర పథకం కింద రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందుబాటులో ఉన్నాయని, వ్యక్తిగతంగా, సంఘాలుగా లేదా క్లస్టర్ల రూపంలో కూడా ఈ రుణాలను పొందే అవకాశం ఉందన్నారు.ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాలోని చేనేత కళాకారుల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా చండూరు మాజీ జడ్‌పిటీసీ కర్నాటి వెంకటేశం చేనేత రంగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,చేనేత శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ ఒబిసి మహాసభలు విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు

**ప్రజాపక్షం/చండూరు:** ఆగస్టు 7న బెంగుళూరులో జరుగనున్న జాతీయ ఓబీసీ మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్‌ను గురువారం చండూరులో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం బీసీయువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత చంద్రశేఖర్ గౌడ్ ,బీసీ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఓబీసీల సామాజిక ,విద్యా , రాజకీయ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఓబీసీ సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే జనగణనలో ఓబీసీ కుల గణనను తప్పనిసరిగా చేపట్టాలని ,మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కేటాయించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్ల శాతం పెంచాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ,అసెంబ్లీ , ఇతర చట్టసభల్లో ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విధంగా రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత చంద్రశేఖర్ గౌడ్ , బీసీ సంఘం బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల మధు యాదవ్ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత దోటివెంటేశ్ యాదవ్ ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## మహిళల హక్కుల కోసం పోరాటాలు ఉధృతం : ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు



**ప్రజాపక్షం/భువనగిరి :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రాక ముందు మహిళలకు వివాహ సందర్భంగా కల్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) జిల్లా అధ్యక్షురాలు సోమన సవిత డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య మండల 3 మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన సంఘం జెండాను జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా తులం బంగారం హామీ ఇప్పటికీ అమలు కాకపోవడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన మహిళలు, యువతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంట్, శాసనసభల్లో కూడా మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా 33 శాతం రిజర్వేషన్ను వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముంతాజ్ బేగం అధ్యక్షతన జరిగిన మహాసభలో దొంతి నిర్మల, బీరకాయల లక్ష్మమ్మ, జిన్నా రాజమణి, ఆడెపు శోభ, చాట్ల శారద, ఇట్టేబోయిన అరుణ, పరుశ పుష్ప, ఇట్టేబోయిన లలిత, అండాలు, వాణి, కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా జిసిడిఒ,ఎంఇఒ అరుంధతిని విధుల నుండి తొలగించాలి

నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు: ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల జిల్లా జిసిడిఓ,ఎంఈఓ గా విధులు నిర్వహిస్తున్నఅరుంధతిని వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు.నల్లగొండ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అరుంధతి కస్తూర్బా గాంధీ పాఠశాలలను సరిగా పర్యవేక్షణ చేయడం లేదని,దీనివల్ల పాఠశాలలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆరోపించారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఏ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు.ప్రైవేటు స్కూళ్ల ఫీజులపై నిర్లక్ష్యంనల్లగొండ మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు పెంచుతున్నా, పుస్తకాలు అధిక ధరలకు అమ్ముతున్నా ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ నాయకులు అరవిందు,అనిల్, శ్రవణ్,శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ రింగ్ రోడ్ చౌరస్తా నుంచి బిఎన్‌రెడ్డి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం

త్వరలో నిధులు మంజూరు

హస్తినాపురం మాజీ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** సాగర్ రింగ్ రోడ్డు నుంచి హస్తినాపురం మీదుగా బి.ఎన్.రెడ్డి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం కోసం టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సహకారంతో సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు హస్తినాపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ సుజాత నాయక్ పేర్కొన్నారు. సాగర్ రింగ్ రోడ్డు నుంచి బి.ఎన్.రెడ్డి వరకు ప్రతి రోజు వేలాది వాహనాలు ప్రయాణిస్తుండటంతో రోజూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయన్నారు. ఉదయం, సాయంత్రం వేళ పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. రోజురోజుకు కాలనీలు పెరుగుతూ సాగర్ రోడ్డుపై వాహనాల రద్దీ పెరుగుతూ మరింత ఇబ్బందులు కల్గిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరింత ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ట్రాఫిక్ రద్దీకి పరిష్కారంగా ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని సిఎం రేవంత్‌రెడ్డికి కోరినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరై సాగర్ రింగ్ రోడ్ నుంచి బి.ఎన్.రెడ్డి వరకు ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతుందని సుజాత నాయక్ పేర్కొన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయితే ప్రజలకు ట్రాఫిక్ రద్దీ సమస్య తీరుతుందన్నారు.

## అనాథాశ్రమానికి నాగార్జునస్కూల్ విద్యార్థుల వితరణ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** సాగర్ రోడ్డు హస్తినాపురం డివిజన్ సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరీ, ఐ.ఐ.టి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం కీర్తన అనాథ ఆశ్రమానికి ఆరు క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల కందిపప్పును విరాళంగా నాగార్జున విద్య సంస్థల చైర్మన్ గుమ్మకొండ వికల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నాగార్జున విద్య సంస్థల చైర్మన్ గుమ్మకొండ వికల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలలో ఛారిటీ డే నిర్వహించారు. విద్యార్థుల నుంచి సేకరించిన సరుకులను తోడు యాజమాన్యం మరి కొంత కలిపి ఆశ్రమానికి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా నాగార్జున విద్య సంస్థల చైర్మన్ గుమ్మకొండ వికల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో సేవా భావం పెంపొందించడానికి తమ పాఠశాలల్లో ప్రతిఏడాది ఒక రోజు ఛారిటీ డే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమాజం పట్ల చిన్నారులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించి వారిని ఉన్నత విలువలు కల్గిన పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల వైస్ చైర్మన్ జి. రజని వికల్‌రెడ్డి, సి.పి.ఓ.ఏ శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ మహేష్, ఇన్చార్జులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల సిఐ, ఎస్ఐకి సన్మానం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** చేవెళ్ల పోలీస్ స్టేషన్ లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ నరేందర్ రెడ్డి,ఎస్ఐ కోటేశ్వర్ రావు లను శుక్రవారం శంకర్ పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన, చేవెళ్ల నియోజకవర్గ బిసి సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటేష్, మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి,శాలువాతో సన్మానించారు.అనంతరం జ్ఞాపికను కూడా బహూకరించారు.ఈ సందర్భంగా బండమీది వెంకటేష్ మాట్లాడుతూ మోకిల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న వేళ ఎస్.ఐ కోటేశ్వర్ రావు,మద్య పాన నిషేధం, మాదక ద్రవ్యాల, భద్రత, రోడ్డు ప్రమాదాల మార్గ దర్శకత కోసం విధులు నిర్వర్తించిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. ఇలాగే సేవలు చేస్తూ మున్ముందు ఉన్నత పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి...



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరవేయడానికి సర్పంచ్‌లు అధికారులు అంకిత భావంతో పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గం అభివృద్ధికి తాను అంకిత భావంతో పని చేస్తున్నానని తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నియోజకవర్గానికి అధిక నిధులు తెస్తున్నారు. రోడ్ల నిర్మాణం కోసం నియోజకవర్గానికి రూ.300 కోట్లకు పైగా నిధులు కేటాయించామని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. భూసేకరణలో రైతులకు అన్యాయం చేయడం సరైందికాదన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎంత భూమి ఉంటే అంత భూమికి నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. వచ్చే నెల 10 లోగా సమావేశం పెడతామని సమస్యలపై మళ్లీ రివ్యూ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డిఒ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మాధవరావు, ఎంపిడిఒ రాధారాణి, తహశీల్దార్ అయ్యప్ప, పంచాయతీ రాజ్ డిఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ సూర్యదత్, ఎంఈఓ శ్రీలత, వ్యవసాయాధికారి బి. అర్ రవినాథ్, వెటర్నరీ అధికారి రేఖా, మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, ట్రాన్స్‌కో ఏఈ సికిందర్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

# మెట్రో, ఆర్టీసీ ప్రజా రవాణా వ్యవస్థల్లో... ఒకే టికెట్‌పై ప్రయాణం



మెట్రో రైల్‌లో నెలవారీ పాసులు

అమలు ప్రణాళిక రూపొందించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** మెట్రో, ఆర్టీసీ వంటి ప్రజా రవాణా వ్యవస్థలు అన్నిటిలోను ఒకే టికెట్‌పై ప్రయాణించే విధానాన్ని అమలు చేసేలా తగు ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. మెట్రో రైల్ ప్రయాణీకులు సురక్షితంగా, సులభతరంగా, సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ బోర్డు అఫ్ డైరెక్టర్ల చైర్మన్‌గా సంజయ్ జాజు తొలి సారిగా మెట్రో రైల్ నిర్వహణ, అభివృద్ధిపై సమీక్షించారు. బోర్డు అఫ్ డైరెక్టర్ల సమావేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి యాప్‌ని అభివృద్ధి చేసేలా టీజీఎస్‌ఆర్టీసీతో చర్చించాలని తెలిపారు. మెట్రో ప్రయాణీకులకు రోజు వారీ, నెలవారీ పాస్‌లను ప్రవేశపెట్టేందుకు తగు మార్గాలను అన్వేషించాలన్నారు. మెట్రో మొదటి దశ స్వాధీనం, రెండవ దశ అనుమతుల తాజా ప్రగతిపై చర్చించారు. అదనపు బోగీలను వీలైనంత త్వరగా సమీకరించేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో బోర్డు అఫ్ డైరెక్టర్లు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రోడ్లు, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డీజీపీ (శాంతి భద్రతలు) మహేష్ భగవత్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, వాటర్‌బోర్డు ఎండి కె.అశోక్‌రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



## ఉజ్జయినీ జాతరకు సర్వం సిద్ధం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆగస్టు 2న జరగనున్న అమ్మవారి బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆయన శుక్రవారం అధికారులతో కలిసి ఆలయ పరిసరాలలో తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్ల విషయంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 200 సంవత్సరాల చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిపారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా వివిధ శాఖల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2న తెల్లవారుజామున అమ్మవారికి బోనాల సమర్పణ ప్రారంభమై, 3న రంగం, అంబారీపై అమ్మవారి ఊరేగింపు, సాయంత్రం ఫలహారం బండ్ల ఊరేగింపుతో జాతర ముగుస్తుందన్నారు. భక్తులకు డెక్కన్ మానవ సేవా సమితి, ఆర్య సమాజ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఇతర వాలంటీర్లు భక్తులకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట లష్కర్ జెడ్‌సి మంగ తాయారు, వాటర్ వర్క్స్ జిఎం శ్రీధర్, ఆలయ ఇఒ మనోహర్‌రెడ్డి, ఎఇ చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, బిఆర్‌ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, నాయకులు కిషోర్, సతీష్, కోటేశ్వర్‌గౌడ్, కొండాపురం మహేష్ యాదవ్, గణేష్, జనార్దన్, రాజు, చంద్ర ప్రకాష్, అరుణ్ భట్, జయరాజ్, సత్యనారాయణ, డెక్కన్ మానవ సేవా సమితి, ఆర్య సమాజ్, వివిధ స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు ఉన్నారు.

## డాక్టర్ దత్తాత్రేయుడు నోరి వైద్య ప్రయాణం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకం

డాక్టర్ నోరికి కేంద్ర మంత్రి అమిత్‌షా అభినందన లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (వైద్యం), ప్రముఖ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ దత్తాత్రేయుడు నోరికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు డాక్టర్ నోరికి కేంద్ర మంత్రి ఒక ప్రత్యేక అభినందన లేఖను పంపించారు. క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించిన నోరి సేవలను అమిత్‌షా ఆ లేఖలో కొనియాడారు. విజ్ఞానం, సేవ, సహానుభూతి కలబోసిన ఆయన వైద్యప్రయాణం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రోగుల సంక్షేమం పట్ల డాక్టర్ నోరి కనబరుస్తున్న అంకితభావం ఆయన దేశభక్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

## రాంకీ సంస్థతో స్వచ్ఛ ఆటో కార్మికులకు తీవ్ర అన్యాయం

జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన స్వచ్ఛ ఆటో కార్మికులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో చెత్త సేకరణ చేపడుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులకు రాంకీ సంస్థ వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, వారి వేధింపుల నుండి తమకు న్యాయం చేయాలని తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్ అండ్ రిక్షా కార్మికుల యూనియన్ నాయకులు శుక్రవారం జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిహెచ్‌ఎంసి అధ్యక్షుడు కత్రావత్ గోపాల్ నాయక్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా తాము హైదరాబాద్ నగరంలో చెత్త సేకరణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే, తాము పనిచేసే ప్రాంతాల్లో రాంకీ సంస్థ యుపి వాహనాలతో చెత్తను సేకరిస్తోందని తెలిపారు. ఆర్‌టిసి క్రాస్ రోడ్ పరిధిలోని చిక్కడపల్లి ప్రాంతంలో 'యుపి 32 ఆర్‌టి 8375' నెంబరు గల ఆటోతో చెత్తను తీసుకెళ్తుండటంతో కార్మికుల మధ్య అనవసర వివాదాలు, గొడవలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2009 పాత జీఓ ప్రకారం ఒకరి పొట్ట కొట్టి మరొకరికి ఉపాధి కల్పించవద్దనే నియమం ఉన్నప్పటికీ, రాంకీ సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్నారు. తాము పనిచేస్తున్న ఏరియాలోకి ఇతర రాంకీ వాహనాలు రాకుండా అడ్డుకోవాలని, తమ ప్రాంతాలకు రాంకీ రాకుండా చూడాలని కమిషనర్‌ను కోరారు. కొత్తగా ఈవి ఆటోలు తీసుకొచ్చి తమ పొట్ట కొడుతోందని, తమ ఆటోలు నడవకుండా కుట్రలు చేస్తోందని, తమను ఇలాగే ఇబ్బందులు పెడితే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు హంసరాజు, అర్జున్, లక్ష్మ న్, రాము, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణలో సిబ్బంది కృషి ప్రశంసనీయం

సిపి డాక్టర్ ఎం రమేష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సేవ, నేర నియంత్రణ, పోలీస్ శాఖ అభివృద్ధికి సిబ్బంది కృషి ప్రశంసనీయమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పదవీ విరమణ చేసినవారు కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని, తమ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిసిపి(అడ్మిన్) టి.అన్నపూర్ణ, స్పెషల్‌బ్రాంచ్ డిసిపి వై.వి.ఎస్.సుధీంద్ర, సైబర్ క్రైమ్ డిసిపి కె.పుష్ప, డిసిపి (కార్ హెడ్‌క్వార్టర్స్) పి.సంజీవ్, ఎడిసిపి షమీర్, సిఎఒ(అకౌంట్స్) వెంకట్‌రెడ్డి, ఎఒ(అడ్మిన్) వై.వి.ఎస్. జ్యోతిర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమాకర్, కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి ఎస్ఐ జి.మల్లేశం పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్.కిషన్ సింగ్, షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్, ఆర్ఎస్ఐ ఎల్.రాజేశ్వర్, సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్, ఆర్ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ ఖాదీర్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్, ఆర్ఎస్ఐ మహమ్మద్ మక్సూద్ ఘోరీ సిఎఆర్‌హెడ్‌క్వార్టర్స్, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జలీల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, టాఫిక్ పోలీస్ స్టేషన్, ఆర్‌జీఐఏ, మహమ్మద్ నూర్ ఉద్దీన్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ హెచ్‌సి గెనుగుల రమేష్ ఉన్నారు.

## సేఫ్ స్పోర్ట్స్ తెలంగాణకు శ్రీకారం

హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రీడా విధానం–2025లో భాగంగా క్రీడాకారులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (ఎస్ఏటీజీ) 'సేఫ్ స్పోర్ట్స్ తెలంగాణ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, క్రీడల్లో సేఫ్‌గార్డింగ్, వేధింపులు లేదా దుర్వినియోగం ఎదురైనప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేయాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యునెస్కో ప్రతినిధి శ్రద్ధా చిక్కేరూర్, యుగాంతర్ సంస్థకు చెందిన తేజస్విని మాదభూషి పాల్గొని విద్యార్థులతో మమేకమయ్యారు. ప్రతి క్రీడాకారుడు భద్రతతో శిక్షణ పొందేలా సురక్షిత, సమ్మిళిత క్రీడా వాతావరణం కల్పించేందుకు ఎస్ఏటీజీ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం శనివారం, సోమవారం గచ్చిబౌలి స్టేడియంలో కోచ్‌లు, క్రీడా రిపాలనాధికారులకు కొనసాగనుంది.

## అక్రమ సంబంధాలపై పోలీసులకు సజ్జనార్ హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్‌శాఖ అంతర్గత క్రమశిక్షణ, పోలీస్ ప్రతిష్ఠ విషయంలో హైదరాబాద్ సిపి సజ్జనార్ కఠిన వ్యాఖ్యలు చేశారు. ఓల్డ్ సిటీలోని సింహవాహిని మహంకాళి అమ్మవారి శిఖర పూజలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల చోటుచేసుకున్న వరుస వివాదాలపై స్పందిస్తూ, విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగత ప్రవర్తనలో గానీ హద్దులు దాటే అధికారులపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై వచ్చిన ఆరోపణల కేసు విచారణ పూర్తిగా నిష్పాక్షికంగా కొనసాగుతుందని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని సజ్జనార్ తెలిపారు. ఏ స్థాయి అధికారి అయినా అక్రమ సంబంధాలు, వేధింపులకు పాల్పడినట్లు తేలితే డిపార్ట్‌మెంట్ తరఫున కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే జూబ్లీహిల్స్, మలక్‌పేట్, దోమలగూడ ఠాణాల పరిధిలోని ఘటనలు, ట్రైనీ ఐపీఎస్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను సస్పెండ చేశామని గుర్తుచేశారు. స్పెషల్ బ్రాంచ్ ద్వారా నిఘా ఉంచి, వివాదాస్పద పోలీసుల వివరాలు సేకరిస్తున్నామని సజ్జనార్ తెలిపారు. పోలీస్ శ్రేణులు తమ ప్రాముఖ్యతను గుర్తుంచుకోవాలని, యూనిఫాం చాటున అనాలోచిత చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. బాధితులకు న్యాయం అందించడమే పోలీస్ వ్యవస్థ ప్రాథమిక కర్తవ్యమని, కొందరు వ్యక్తుల వల్ల మొత్తం శాఖకు మచ్చ రాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## టిఇలు.. టికెట్ తనిఖీదారులే కాదు.. ప్రాణరక్షకులూ!

సికింద్రాబాద్ డివిజన్ సిబ్బంది

సేవలకు దక్షిణ మధ్య రైల్వే ప్రశంసలు



SAIRAM



M SAI SHANKAR



MV SUBBA REDDY



N UTTAM SINGH



BALRAJU



RACHEAL RANJITHA

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైళ్లలో టికెట్లు తనిఖీ చేయడం మాత్రమే ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ల (టిటిఇలు) పని కాదని, ప్రయాణికుల ప్రాణాలు, భద్రత, ఆస్తుల పరిరక్షణలోనూ వారు కీలక పాత్ర పోషిస్తున్నారని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన టికెట్ తనిఖీ సిబ్బంది సేవలను వివరించిన ప్రత్యేక కథనాన్ని శుక్రవారం విడుదల చేసింది. రోజూ కోట్లాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న భారతీయ రైల్వేలో టిటిఇలు టికెట్ తనిఖీలతో పాటు సీనియర్ సిటిజన్లు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులకు సహాయం చేయడం, రిజర్వేషన్ నిర్వహణ, రద్దీ నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో తొలి స్పందనదారులుగా వ్యవహరించడం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని పేర్కొంది. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన టిటిఇలు ఇటీవలి కాలంలో చిన్నారులను అక్రమ రవాణా నుంచి రక్షించడం, ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికుల ప్రాణాలు కాపాడడం, గుండెపోటుకు గురైన ప్రయాణికుడికి సిపిఆర్ అందించి ప్రాణాలు నిలబెట్టడం, రైళ్లలో అగ్నిప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడం, ప్రయాణికులు మరిచిపోయిన విలువైన వస్తువులను తిరిగి అప్పగించడం వంటి అనేక సేవలతో ప్రశంసలు అందుకున్నారని తెలిపింది.

## సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపిడిఒ అధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు పంటలను సాగుచేసుకునే విధంగా అధికారులు పంచాయతీల్లో సభలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని అన్ని శాఖ అధికారులు ప్రజా ప్రతినిధులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకునే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. జలసిరి, శానిటేషన్, వన మహోత్సవం, తడిచెత్త, పోడి చెత్త వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ, విద్యుత్ సమస్యలపై సభలో సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగా ఏర్పడిన మండలం లో తహశీల్దార్, ఎంపిడివో, పోలీస్‌స్టేషన్ వంటి ప్రభుత్వ కార్యాలయాకు భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచులు నర్సింలు, నీలయ్య, రామచంద్రయ్య, జంగయ్య, చందునాయక్, మోనాచారి, రవినాయక్, విజయలక్ష్మి, పావని, సుమలత, మహబూబ్ భీ, అరుణ, సనా, సునీత, స్వప్న, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

**లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ...** కొందుర్గు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొందుర్గు తహసీల్దార్ అజం ఆలీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు గోవర్ధన్ గౌడ్, మల్లేష్‌గౌడ్, బ్యాటరీ కృష్ణారెడ్డి, రాములుగౌడ్, కేకే కృష్ణ, సర్పంచ్‌లు విక్రమ్, అంజి, రాజ్‌కుమార్, రమేష్, ప్రభాకర్, అశోక్, యాదయ్య, మల్లయ్య, రామస్వామి, మాణేయ్య, నర్సింలు, గోపాల్, రాజేందర్ గౌడ్, జంగయ్య, జీపిఓలు హరీష్, నరేష్, శ్రీకాంత్, రామాస్వామితోపాటు లబ్దిదారులు పాల్గొన్నారు.

# థానేలో కుప్పకూలిన శిథిల భవనం

**10 మంది సమాధి**
**శిథిలాల కింద మరికొంత మంది**
**కొనసాగుతున్న సహాయక చర్యలు**



**థానె :** మహారాష్ట్రలో విషాదన ఘటన సంభవించింది. థానే జిల్లా భివండిలో శిథిలావస్థలో ఉన్న నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో పది మంది భూ సమాధి అయ్యారు. ముగ్గురికి గాయాలు కాగా, మరి కొంత మంది కూడా శిథిలాల కింద చిక్కుకు పోయారు. వారిని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అయితే కుప్పకూలిన భవనాన్ని ఇంతకు ముందే ప్రమాదకర భవనాల్లో ఒకటిగా స్థానిక మున్సిపల్ అధికారులు గుర్తించడం గమనార్హం. పవర్‌లూమ్ పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న కోహినూర్ భవనంలో కొంత భాగం గురువారం రాత్రి 11.20 గంటలకు కూలిపోయిందని అధికారులు చెప్పారు. భివండి నిజాంపూర్ నగర మున్సిపల్ కార్పొరేషన్ (బిఎన్‌సిఎంసి) ఈ భవనాన్ని 2020 సెప్టెంబర్‌లో ప్రమాదకరంగా గుర్తించిందని, చివరకు ఈ ఏడాది జూన్ 5న ఖాళీ చేయమని నోటీసులు జారీ చేసి, తదుపరి విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేసినట్లు తెలిపింది. అయినప్పటికీ, యజమానులు మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతి పొందకుండానే నిర్మాణ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ చట్ట విరుద్ధమైన మరమ్మతు పనులలో పాల్గొన్న కాంట్రాక్టర్‌పై కఠినమైన శిక్షా చర్యలు, క్రిమినల్ విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, కేసు నమోదు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భవనంలో మరమ్మతు పనులు జరుగుతుండగా ఈ ఘటన జరిగిందని ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. భివండిలో భవనం కూలి తొమ్మిది మంది మరణించారని, ఘటనా స్థలంలో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మహారాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీష్ మహాజన్ తెలిపారు. ఆ నిర్మాణంలో ప్రతి అంతస్తులో 12 గదుల చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో, భవనం నుండి పెద్ద పగుళ్ల శబ్దాలు వినిపించాయని నివాసితులు చెప్పారని ఒక అధికారి తెలిపారు. విపత్తు జరిగిందనే భయంతో, స్థానికులు వెంటనే అనేక కుటుంబాలను ఇతర ప్రాంతాలకు తరలించడంలో సహాయపడ్డారు. అయితే, కొంతమంది నివాసితులు ఇంకా బయటకు వస్తుండగానే, భవనంలోని 'బి' వింగ్ కూలిపోయిందని ఆయన చెప్పారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, థానే విపత్తు ప్రతిస్పందన దళం , స్థానిక అగ్నిమాపక దళం బృందాలు సహాయక చర్యను ప్రారంభించారు. ఒక శునక దళం, నాలుగు అగ్నిమాపక యంత్రాలు, రెండు అంబులెన్సులు, భారీ మట్టితవ్వే యంత్రాలను కూడా రంగంలోకి దించారు. ఒక మహిళ తనను మృత్యు కోరల నుండి కాపాడినందుకు కృతజ్ఞతలు తెలిపింది. కేవలం కొన్ని అడుగుల దూరంలోనే తన తల్లిదండ్రులు ఆత్రంగా తన పేరు పెట్టి పిలుస్తుండగా, బురద, చిత్తడి నేల కింద చిక్కుకుపోయిన ఆ భయానక అనుభవాన్ని ఆమె గుర్తుచేసుకుంది. నివాసితులు పదే పదే హెచ్చరించినప్పటికీ మరమ్మతులు సరిగ్గా జరగడం లేదని ఆ మహిళ ఆరోపించింది. చాలా మంది నివాసితులు తమ ఒంటిపై ఉన్న బట్టలు తప్ప మరేమీ మిగల్లేదు. మరణించిన తొమ్మిది మందిలో షమీమ్ షేక్ (32), రంజీత్ సింగ్ (45), మిరాజ్ రసూల్ షేక్ (34), సంతోష్ కుమార్ పాండే (42), షమీమ్ అన్సారీ (30)లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

# 'పిఎం–కిసాన్' మరో ఐదేళ్లు పొడిగింపు

**రూ. 3.15 లక్షల కోట్లు కేటాయింపు**
**'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు రూ. 5,070 కోట్లు**
**రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం**




**న్యూఢిల్లీ :** దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పిఎం–కిసాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లు పొడిగించింది. ఈ మేరకు మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు పచ్చజెండా ఊపింది. పిఎం–కిసాన్ పథకాన్ని 2030–31 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. పిఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది.

**ఇంధన రంగాన్ని ప్రోత్సహించేందుకు 'సూర్య సరోవర్ యోజన'**

పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026–27 నుంచి 2030–31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032–33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది. సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

## జనన, మరణాల సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** విద్యార్థులు, యువత జులై 20న నిర్వహించిన 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులపై పోలీసుల అణచివేతకు నిరసనగా ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026ను లోక్‌సభ శుక్రవారం ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించింది. శుక్రవారం ఉదయం సభ ప్రారంభమైన కొద్ది నిమిషాలకే సభ వాయిదా పడింది. ఆ తరువాత మధ్యాహ్నం బిజెపి ఎంపి దిలీప్ సైకియా అధ్యక్షతన సభ తిరిగి సమావేశం కాగా, బిల్లును పరిశీలన, ఆమోదం కోసం చేపట్టారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండగా, వారిలో పలువురు హోం మంత్రి అమిత్ షా సభకు హాజరు కావాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లగా, ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ముఖ్యమైన బిల్లుపై ప్రభుత్వం చర్చను కోరుకుంటోందని చెబుతూ, చర్చలో పాల్గొనడానికి ప్రతిపక్షాలు నిరాకరించడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఇది దురదృష్టకరం. దయచేసి భవిష్యత్తులో ఇలా పునరావృతం చేయవద్దు. మిమ్మల్ని పార్లమెంటుకు పంపిన ప్రజలే మీ నుండి సమాధానాలు కోరుకుంటారు' అని రిజిజు అన్నారు. భవిష్యత్తు చట్టాలపై అంతరాయాలు సృష్టించకుండా చర్చలలో పాల్గొనాలని ఆయన ప్రతిపక్ష సభ్యులను కోరారు. ప్రతిపక్ష సభ్యుల సహకారం లేకుండా బిల్లును ఆమోదించాల్సి రావడం దురదృష్టకరమని సైకియా కూడా అన్నారు. బిల్లు ఆమోదం పొందిన వెంటనే సభ ఆగస్టు 3వ తేదీకి వాయిదా పడింది. ప్రస్తుత సమావేశాల్లో ఇప్పటివరకు రెండు బిల్లులు — 'ప్రజా పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026', 'దేశ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, 2026' (వందేమాతరం బిల్లు) పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందాయి. 'జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026' ప్రస్తుతం రాజ్యసభ ఆమోదం కోసం వేచి ఉంది. సభ కార్యకలాపాల సమయంలో, 'రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, 2025'ను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న బిజెపి ఎంపి అపరాజిత సారంగికి, ఆ కమిటీ నివేదిక సమర్పణ గడువును శీతాకాల సమావేశాల చివరి వారంలోని మొదటి రోజు వరకు పొడిగించే అవకాశం కల్పించారు.

## దేశ భవిష్యత్తు కంటే ప్రధాని చర్మం ప్రకాశవంతం

**మోదీపై సిజెపి వ్యస్థాపకుడు అభిజీత్ దీప్కే వ్యంగ్యాస్త్రాలు**

**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో పేపర్ లీక్ నియంత్రణ బిల్లు ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ విడుదల చేసిన సెల్ఫీ స్టైల్ వీడియోపై, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. 'దేశ భవిష్యత్తు కంటే ప్రధాని మోదీ చర్మం చాలా ప్రకాశవంతంగా ఉంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్లమెంట్‌లో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026 ఆమోదం పొందింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సెల్ఫీ స్టైల్ వీడియో విడుదల చేశారు. పేపర్ లీకేజీ అంశంపై ప్రధాని మోదీ విడుదల చేసిన నాలుగో సెల్ఫీ వీడియో ఇది. దీనిపైనే అభిజీత్ దీప్కే తాజాగా విమర్శలు గుప్పించారు. 'దేశ భవిష్యత్తు కంటే ప్రధాని మోదీ చర్మం చాలా ప్రకాశవంతంగా ఉంది. మోదీ రాజకీయాలు వదిలేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలని నేను అనుకుంటున్నాను. ఆయన అందులో చాలా బాగా రాణిస్తున్నారు. ఆయన ప్రధానమంత్రి కుర్చీ వదిలి, ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలి. ప్రధానమంత్రి పనిని వేరొకరికి వదిలేయాలి' అని అభిజీత్ దీప్కే అన్నారు. బుధవారం మహారాష్ట్రలోని తన స్వగ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే 'నరేంద్ర మోదీ 3 రోజు క్రితం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో ప్రజలు చాలా సంతోషించారు. కానీ ఏం జరిగింది? సిబిఐ తరఫు న్యాయవాది హాజరు కాకపోవడంతో మొదటి విచారణే వాయిదా పడింది. కాబట్టి మీరు ఎలాంటి చట్టాలనైనా చేయవచ్చు. కానీ వాటిని అమలు చేసే వ్యక్తులు మంచివారు కానంత వరకు ఆ చట్టాల వల్ల ప్రయోజనం ఏమిటి?' అని అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

# ఏ మాత్రం సిగ్గు ఉన్నా... అమిత్ షాతో రాజీనామా చేయించాలి

**ప్రధాని మోదీకి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే డిమాండ్**



**న్యూఢిల్లీ :** విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, వారిని బలవంతంగా నిర్బంధించడం ద్వారా కేంద్రం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం ఆరోపించారు. హోం మంత్రి అమిత్ షా చేత రాజీనామా చేయించాలని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. తమపై ఎటువంటి చర్యలు తీసుకోరనే షరతుపై యువత ఆందోళనను విరమించుకున్నారని, కానీ ఇప్పుడు బిజెపి ప్రభుత్వాలు తమ మాటను నిలబెట్టుకోలేదని ఖర్గే ఆరోపించారు. నరేంద్ర మోదీ గారూ, 10 రోజుల క్రితం మీ ప్రభుత్వం లాఠీలు, బ్యాటన్లు, పెల్లెట్ గన్‌లను ఉపయోగించి యువతపై ఉక్కుపాదం మోపిందని ఖర్గే దుయ్యబట్టారు. జూలై 20న జరిగిన 'సంసద్ చలో' ర్యాలీలో, దేశంలోని ఇతర ప్రాంతాల్లో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై భద్రతా దళాలు జరిపిన దాడులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.'ఇప్పుడు విద్యార్థులు తమ నిరసనను విరమించుకున్నప్పటికీ, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, బలవంతంగా నిర్బంధించడం ద్వారా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు' అని ఖర్గే ఎక్స్ వేదికగా ఆరోపించారు. యువతకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తున్నారని, అలాగే యువతుల వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు సభలోకి అడుగు పెట్టకపోవడం, బాధ్యతాయుతమైన ప్రకటన చేయడానికి వెనుకడుగు వేయడం అనేది ఆయన అహంకారానికి నిదర్శనమని ఖర్గే విమర్శించారు. పరువు కాపాడుకోవడానికి, ఇమేజ్‌ను రక్షించుకోవడానికి చేసే ఇటువంటి ఎత్తుగడలు ఇకపై పనిచేయవని, మీ గురించి వాస్తవం యువతకు అర్థమైపోయిందన్నారు. ఏ మాత్రం సిగ్గు మిగిలి ఉన్నా, అమిత్ షా చేత రాజీనామా చేయించండి అని కాంగ్రెస్ అధినేత డిమాండ్ చేశారు.

**మోదీ రీల్స్ చేయడంలో బీజీగా ఉన్నారు!**

మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రధాని మోదీపై తనదైన రీతిలో సెటైర్లు వేశారు. 'ఓ వైపు ప్రధాని మోదీ రీల్స్ చేయడంలో బిజీగా ఉంటే, మరోవైపు పేపర్ లీక్ అయ్యింది' అని ఎద్దేవా చేశారు. 'ప్రధాని మోదీ రీల్స్‌మేకింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో నిరంతరం బిజీగా ఉన్నారు. మోదీ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు సంబంధించిన కండితుడుపు చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించింది. ఈ తరుణంలోనే దేశంలో మరో పేపర్ లీక్ వార్త వెలుగులోకి వచ్చింది. ఈసారి మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వరాష్ట్రమైన ఒడిశాలో ఈ ఘటన జరిగింది. జులై 27న ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కి చెందన పీజీ పరీక్ష జరుగుతుండగానే, దానికి సంబంధించిన ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో సర్క్యులేట్ అయినట్లు తేలింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ తన స్థిరమైన వైఖరిని స్పష్టం చేసింది. 2024లో అయినా లేదా ఇప్పుడు 2026లో అయినా కాంగ్రెస్ వాదన ఒక్కటే. కేవలం పేపర్ లీకేజీలకు కఠినమైన శిక్షలను చట్టబద్ధం చేయడం, కోర్టులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులుగా ప్రకటించడం ఇక ఎంత మాత్రం సరిపోదు. మన విద్యావ్యవస్థలో పేరుకుపోయిన వ్యాపార ధోరణి, అవినీతిపై మనం మరింత విస్తృతమైన, నిజాయితీతో కూడిన చర్చ జరపాల్సిన అవసరం ఉంది. దేశంలో జరిగిన విద్యార్థి ఉద్యమం అసలు ఆశయం కూడా ఇదే. మోదీ ప్రభుత్వం ఈ ఆశయాన్ని కచ్చితంగా గౌరవించాలి' అని జైరాం రమేశ్ అన్నారు.

# 'జెన్ జీ'ని బెదిరిస్తున్నారు!

**ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాపై రాహుల్‌గాంధీ ధ్వజం**



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వీరిద్దరూ 'జెన్ జీ'ని బెదిరిస్తున్నారని ఆరోపించారు. వారిద్దరూ భారతదేశ గతం అని, దేశ భవిష్యత్తు విషయంలో వారు ఎలా వ్యవహరిస్తున్నారనే దానిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థి నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగించడం వెనుక మోదీ, షాలు ఉన్నారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. జెన్ జెడ్‌ను బెదిరించి ప్రధాని మోదీ, అమిత్ షా మౌనంగా ఉంచలేరని, మొదట వారి ఎముకలు విరిచారు, ఇప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారి ఖాతాలను తొలగిస్తున్నారు అని మండిపడ్డారు. పేపర్ లీక్‌ల బెడదను ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావడం అవసరమని, పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ముఠాలపై ఎలాంటి కనికరం చూపబోమని గురువారం మోదీ చెప్పిన తర్వాత ఈ వ్యాఖ్యలు వచ్చాయి. పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించడానికి పార్లమెంట్ బిల్లును ఆమోదించిన కొద్దిసేపటికే ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధానమంత్రి వీడియాఓ సందేశమిచ్చారు. వివిధ పరీక్షలలో జరిగే లీకులు విద్యార్థులకు మాత్రమే కాకుండా కేంద్రానికి, అనేక రాష్ట్రాలకు కూడా ఒక పెద్ద సవాలుగా మారాయన్నారు. కేంద్రం, అనేక రాష్ట్రాలు చాలా సంవత్సరాలుగా పేపర్ లీక్ సమస్యను ఎదుర్కొంటున్నాయని, ఈ ముప్పు వివిధ పరీక్షలకు హాజరయ్యే పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేసిందన్నారు. అందువల్ల, ఈ సమస్యను పరిష్కరించడానికి విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకురావడం అవసరమైంమని ప్రధానమంత్రి అన్నారు. బుధవారం లోక్‌సభలో, గురువారం రాజ్యసభలో ఆమోదం పొందిన యాంటీపేపర్ లీక్ బిల్లును ప్రస్తావిస్తూ, వాగ్దానం చేసినట్లుగా ఈ సమస్యను పరిష్కరించడానికి ఇప్పుడు ఒక బలమైన చట్టం అమల్లోకి వచ్చిందని మోదీ అన్నారు. పేపర్ లీక్ ముఠాలను, పేపర్ లీక్ మాఫియాను, పిల్లల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టబోమని ప్రధానమంత్రి అన్నారు. పరీక్షల ప్రక్రియను బలోపేతం చేయడానికి, అవకతవకలను నివారించడానికి ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రాల నుంచి సూచనలు తీసుకుంటున్నామని కూడా మోదీ తెలిపారు. పేపర్ లీక్‌లపై కఠినమైన శిక్షలను ప్రవేశపెట్టడం ద్వారా 2024 యాంటీపేపర్ లీక్ చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026'ను పార్లమెంట్ గురువారం ఆమోదించింది. ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది.

## కేంద్ర మంత్రి జితేంద్రసింగ్‌పై కాంగ్రెస్ హక్కుల ఉల్లంఘన తీర్మానం నోటీసు

**న్యూఢిల్లీ :** విద్యార్థులనిరసనల సమయంలో 'ఎటువంటి కాల్పులు జరుగలేదు' అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చేసిన వ్యాఖ్యలపై హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ ఎంపి కెసి.వేణుగోపాల్ శుక్రవారం నోటీస్ సమర్పించారు. జితేంద్రసింగ్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించారని వేణుగోపాల్ ఆరోపించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించిన ఒక లేఖలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిలు, 2026పై జరిగిన చర్చ సందర్భంగా జులై 29న సభలో జితేంద్రసింగ్ చేసిన ప్రకటనకు సంబంధించి తాను హక్కుల పరిరక్షణ అంశాన్ని లేవనెత్తాలని అనుకుంటున్నట్లు వేణుగోపాల్ పేర్కొన్నారు. డాక్టర్ జితేంద్ర సింగ్ దీనికి సమాధానమిస్తూ 'అసలు కాల్పులు జరపలేదని, భాష్పవాయువును ఉపయోగించారని పదేపదే స్పష్టం చేయబడింది. కాబట్టి అసలు కాల్పులు జరగనప్పుడు, ఆదేశం ఇచ్చే ప్రశ్నే తలెత్తదు' అని మంత్రి జితేంద్రసింగ్ వ్యాఖ్యల ఆంగ్ల అనువాదాన్ని అందిస్తూ వేణుగోపాల్ వివరించారు. దీనిపై, సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి, కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అయిన కెసి.వేణుగోపాల్ స్పందిస్తూ, ఈ ప్రకటన క్షేత్ర స్థాయి వాస్తవాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని నొక్కిచెప్పారు. 'మంత్రి వాదనలకు విరుద్ధంగా కాల్పులు జరిగాయి. గాయపడిన వ్యక్తి ఇప్పటికీ చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం బహిరంగంగా అందుబాటులోఉంది. ఎటువంటి కాల్పులు జరగలేదని మంత్రి సభలో చెప్పడం ద్వారా మంత్రి తెలిసి, ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించారు 'అని కాంగ్రెస్ ఎంపి తెలిపారు. సభను తప్పుదారి పట్టించడమనేది హక్కుల ఉల్లంఘన, సభాధిక్కారం కిందకు వస్తుందనేది సుస్పష్టమైన విషయమని వేణుగోపాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. దేశంలోని అత్యున్నత సభలో వాస్తవాలను రికార్డులో ఉంచడానికి ముందు ఒక మంత్రి వాటిని సరిచూసుకోవాలి' అని ఆ లేఖలో తెలిపారు. అందువల్ల, మంత్రిపై విశేషాధికార ఉల్లంఘన చర్యలను ప్రారంభించి, ఈ విషయాన్ని 'సమగ్ర పరిశీలన, అవసరమైన చర్య'గా హక్కుల పరిరక్షణ కమిటీకి నివేదించవలసిందిగా నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని కాంగ్రెస్ ఎంపి కెసి.వేణుగోపాల్ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు రాసిని లేఖలో తెలియజేశారు. విద్యార్థుల శాంతియుత నిరసనలకు ప్రతిస్పందనగా కాల్పులు జరగలేదని పార్లమెంట్‌లో నిస్సిగ్గుగా అబద్ధం చెప్పినందుకు జితేంద్రసింగ్‌పై హక్కుల ఉల్లంఘన తీర్మానం కింద తాను ఒక నోటీస్ సమర్పించినట్లు వేణుగోపాల్ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఇలాంటి స్పష్టమైన అబద్ధాలతో ప్రభుత్వం తప్పించుకోలేదని, మంత్రిపై చర్య తీసుకోవాలని వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

# 45 లక్షల ఓట్ల తొలగింపు

- ఏపీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ
- శాశ్వత వలసదారులు, మరణించిన, డూప్లికేట్ ఓట్లను తీసివేసినట్లు వెల్లడి
- పేర్ల నమోదు, అభ్యంతరాలకు ఆగస్టు 30 వరకు అవకాశం
- అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్న ఈసీ



**అమరావతి:** రాష్ట్ర ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ ఈసీ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది.175 శాసనసభ నియోజకవర్గాల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జులై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. శుక్రవారం ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచుతారు.

**SHRIRAM Finance** **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS27T 1698 | Tarigoppula Kanakaraju | TATA ACE | 2018 |
| 2 | TG27 7287 | Jeedi Niranjan | ZEST 1.3L XE QUADRAJET 75PS DIESEL 5 SEATER | 2017 |
| 3 | TS24T 0085 | Mandha Saritha | CHEVROLET TAVERA NEO-P | 2016 |
| 4 | TS36TA 4156 | Hari Chityala | TATA INTRA V50 BS6 | 2023 |
| 5 | TS34T 1069 | Maraboina Kavitha | AL DOST | 2017 |
| 6 | TS12UC 1562 | Ramesh Kothapeta | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 7 | TG27T 0029 | Murali Gugulothu | TATA INTRA V30 BS6 | 2024 |
| 8 | TS04UB 0643 | Panjala Ramesh | CHEVROLET TAVERA NEO-P | 2015 |
| 9 | TS27T 1193 | Ravi Kumar Devaraboina | JOHN DEERE 5036 C | 2017 |
| 10 | TS10UD 2829 | Kalla Sai Kumar | AL BADA DOST i4 BS6 | 2023 |

**AUCTION DATE : 01-08-2026**
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
**SHRIRAM FINANCE LIMITED**
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9000014364 , 98499 11793

**CHANGE OF NAME**
I, **ERAGALA YELLESH,** (old Name), H.No. 11-156, Naglur, Hyderabad, Medchal. has changed as **EARAGALA YELLESHA, S/o. NARSIMHA EARAGALA** (New Name) for all purposes.

**CHANGE OF NAME**
I, **SHEEREEM BEGUM, D/o. GHOUSE KHAN,** (old Name) H.No. 6-46, Dundigal Village, Quthbullapur Mandal, Medchal -Malkajgiri Dist., Telangana State, has changed as **SHIREEN BEGUM, W/o. MOHAMMED ASIF ULLAH** (New Name) for all purposes.

**కెనరా బ్యాంక్** (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Syndicate
చైతన్యపురి బ్రాంచ్, ఇం.నెం.1-1-904, సిద్ధార్థ్ నగర్, ఫాతిమా కాంప్లెక్స్ దగ్గర, హన్మకొండ, వరంగల్ - 506 004.

**ఇ-వేలం అమ్మకపు ప్రకటన**

ఇ- వేలం తేది & సమయం: 28.08.2026, ఉ.11.30 గం.ల నుండి మ.12.30 గం.ల వరకు (అమ్మకము ముగిసేవరకు ప్రతి 5 ని॥లకు ఒకసారి అపరిమిత పొడిగింపుతో) బయానా డిపాజిట్ ఆఖరి తేది తేది: 27.08.2026న సా॥ 5.00 గం॥లకు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8(6)లోని నిబంధనలతో చదవబడుతూ స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలము అమ్మకపు ప్రకటన.
ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా క్రింద తెలిపిన స్థిరాస్తిని సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/కుదువ పెట్టగా వాటిని చైతన్యపురి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి ద్వారా నిర్మాణాత్మకముగా/ భౌతికముగా స్వాధీనము చేసుకొని అనంతరం బకాయిల వసూలు కొరకు కెనరా బ్యాంక్, చైతన్యపురి బ్రాంచ్ (ఇంతకు ముందు కాజీపేట్) వారికి చెందవలసిన బకాయి మొత్తం రూ.36,76,871.13 (రూపాయలు ముప్పై ఆరు లక్షల డెభై ఆరు వేల ఎనిమిది వందల డెభై ఒక్కటి మరియు పైసలు పదమూడు మాత్రమే) (తేది: 20.09.2021 నాటికి ఒప్పంద బకాయిలు)లను వసూలు చేసుకొనుటకు క్రింద తెలిపిన ఆస్తులను "ఎక్కడ ఎలా వుందో, ఏది ఎలా ఉందో, ఏదైతే ఎలా ఉందో, అది అలానే ప్రాతిపదికన" తేది: 28.08.2026న అమ్మబడును.

రుణగ్రహీత(లు) పేరు మరియు చిరునామా : మెస్సర్స్ నోబెల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైటర్ ఖాజా మహమూదుల్ అబిదీన్, ఇంటి నం. 35-3-26/ఎ, తౌడు ఫ్యాక్టరీ దగ్గర, మెయిన్ రోడ్, గోపాల్‌పూర్ హన్మకొండ-506001. ప్రొప్రైటర్ : శ్రీ ఖాజా మహమూదుల్ తండ్రి జఫారుల్ అబిదీన్ ఖాజా, హెచ్.నెం. 11-23-1781/1 ఎల్.బి. నగర్, వరంగల్-506002, హామీదారు : శ్రీ మొహమ్మద్ జాఫర్ ఖాన్ తండ్రి రషీద్ అహ్మద్ ఖాన్, ఇంటి నం. 17-7-163, కరీమాబాద్, వరంగల్-506002
ఆస్తి వివరణ మరియు పూర్తి వివరములు: వరంగల్ సిటీ, మట్వాడ, పేర్‌పురా వీధిలో 164 చ.గ.ల విస్తీర్ణం గల స్థలం (పాత ఇంటి నం. 13/1090; కొత్త ఇంటి నం. 13-8-43/44). సరిహద్దులు: తూర్పు: కొనుగోలుదారుని ఇంటి నం. (13-8-45), పడమర: 14' వెడల్పు రోడ్డు, ఉత్తరం: 14' వెడల్పు రోడ్డు, దక్షిణం: సయ్యద్ గౌసుద్దీన్ గారి ఇంటి నం. (13-8-41 & 13-8-42) మరియు ఫెరోజ్ అథర్ గారి ఇంటి నం. (13-8-39).

రిజర్వు ధర : రూ.12,05,000/- ధరావత్తు సొమ్ము (ఇ.ఎం.డి) రూ.1,20,500/-

*బ్యాంక్‌కు తెలిసినంత వరకు తాకట్టు రుణభారములు ఏమీ లేవు. వేలమును ఆన్‌లైన్ పోర్టల్ https://ebkray.in/ ద్వారా నిర్వహించబడును
రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని మొత్తాన్ని E-వ్యాలెట్ of M/s PSB Alliance Private Limited, BAANKNET యొక్క portal లో లేదా సదరు చలాన్‌లో పేర్కొన్న ఖాతా వివరాలలో RTGS/NEFT ద్వారా బయానా డిపాజిట్ చేయుటకు దానిలో చలాన్ జనరేట్ చేయుట ద్వారా డిపాజిట్ చేయవలెను.
బిడ్డింగ్ ప్రాసెస్ మాన్యువల్, బిడ్డర్ రిజిస్ట్రేషన్ మరియు బయానా చెల్లింపు కొరకు దర్శించండి ఆన్‌లైన్ పోర్టల్ వెబ్‌సైట్ https://ebkray.in/ సంప్రదించండి. 8291220220, E-mail : support.ebkray@psballiance.com
అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్: (www.canarabank.com)లో ఏర్పాటు చేసిన ఇ-వేలం లింక్‌ను రిఫర్ చేయవలెను లేదా బ్రాంచ్ మేనేజర్ కెనరా బ్యాంక్, చైతన్యపురి, ఫోన్ నెం.7382932273, వారిని ఏపని రోజులోనైనా కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చును.
తేది: 27.07.2026, ప్రదేశము: హన్మకొండ సం/- అధీకృత అధికారి/ కెనరా బ్యాంక్

## మధ్య ప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తత



**టెహ్రాన్:** ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన సైనిక ఘర్షణల తర్వాత పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు మరింత సమస్యాత్మకంగా మారాయి. ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషించే 'హోర్ముజ్ జలసంధి' వద్ద నౌకలను లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ ప్రకటించింది. అలాగే అమెరికా సైనిక స్థావరాలపై డ్రోన్లతో దాడులు నిర్వహించినట్లు కూడా పేర్కొంది. ఈ ఆరోపణలపై అమెరికా అధికారికంగా పూర్తి స్థాయి స్పందన ఇవ్వకపోయినా, తన సైనిక అప్రమత్తతను పెంచినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకలను భద్రపరచేందుకు సౌదీ అరేబియా యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటు దళాలపై విస్తృత స్థాయి సైనిక చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. హౌతీలకు ఇరాన్ మద్దతు ఉందని అమెరికా, సౌదీ అరేబియా చాలా కాలంగా ఆరోపిస్తున్నాయి. ఎర్ర సముద్ర మార్గం ఆసియా–యూరప్ వాణిజ్యానికి అత్యంత కీలకమైనది కావడంతో అక్కడ ఉద్రిక్తతలు పెరిగితే ప్రపంచ సరఫరా వ్యవస్థ, చమురు ధరలు, సముద్ర రవాణా వ్యయాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతర్, ఒమాన్ వంటి దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఏ పక్షమూ తన వైఖరిలో గణనీయమైన మార్పు చూపకపోవడంతో చర్చల్లో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదు. ఫలితంగా మధ్యప్రాచ్యంలో భద్రతా పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే కొనసాగుతోంది.

## పాక్‌లో గని ప్రమాదం..
# 34 మంది కార్మికులు మృతి

**కరాచీ:** పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఘోర గని ప్రమాదం చోటుచేసుకుంది. క్వెట్టా సమీపంలోని 'సోరాంజ్' బొగ్గు గనుల ప్రాంతంలో మీథేన్ వాయువు పేలుడుతో కనీసం 34 మంది కార్మికులు మృతి చెందగా, మరో డజనుకుపైగా కార్మికులు ఇంకా గనిలో చిక్కుకుపోయారు. గురువారం షిఫ్ట్ మారుతున్న సమయంలో సుమారు 4,000 అడుగుల లోతులో ఈ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి అగ్నిప్రమాదం చెలరేగడంతో పాటు గని లోపలి భాగాలు కూలిపోవడంతో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సహాయక బృందాలు ఇప్పటివరకు 34 మృతదేహాలను వెలికితీశాయి. 22 మందిని రక్షించి, సజీవంగా బయటకు తీసుకొచ్చాయి. వారిని వెంటనే వైద్య సేవల నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మీథేన్ వాయువు అధికంగా పేరుకుపోవడమే ఈ ప్రమాదానికి కారణమని పాకిస్తాన్ ఆల్ పాకిస్తాన్ కోల్ మైనర్స్ అసోసియేషన్ తెలిపింది. ఇంత లోతులో పేలుళ్లు జరిగినప్పుడు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ధ్వంసమవుతాయని, అందువల్ల ప్రాణాలతో బయటపడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని అధికారులు చెప్పారు.



కాగా, ఈ ఘటనతో పాకిస్థాన్‌లోని బొగ్గు గనుల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. అనేక ప్రైవేట్ గని యజమానులు భద్రతా నిబంధనలను పాటించడం లేదని, గ్యాస్ పర్యవేక్షణ వ్యవస్థలు, తగిన గాలి ప్రసరణ, రక్షణ పరికరాలు లేకుండానే కార్మికులను పనిచేయిస్తున్నారని కార్మిక సంఘాలు చాలా కాలంగా ఆరోపిస్తున్నాయి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల పాకిస్తానీ రూపాయలు, గాయపడిన వారికి 3 లక్షల పాకిస్తానీ రూపాయలు చొప్పున పరిహారం ప్రకటించిన బలూచిస్తాన్ ప్రభుత్వం, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి గని భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షిస్తామని వెల్లడించింది. బలూచిస్థాన్‌లో నిరుద్యోగం, పేదరికం అధికంగా ఉండటంతో వేలాది మంది ప్రమాదాలు తెలిసినా బొగ్గు గనులపైనే జీవనోపాధి కోసం ఆధారపడుతున్నారు.

## భారత్–భూటాన్ మధ్య కీలక ఒప్పందాలు

**థింపూ:** భారత్–భూటాన్ మధ్య అభివృద్ధి భాగస్వామ్యానికి మరింత బలం చేకూర్చే దిశగా ఇరు దేశాలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. థింపూలో జరిగిన ఐదో ద్వైపాక్షిక అభివృద్ధి సహకార చర్చల్లో విదేశాంగ కార్యదర్శులు విక్రమ్ మిస్రీ, దాషో పెమా చెవాంగ్ దోర్జీ పాల్గొని, భూటాన్ 13వ పంచవర్ష ప్రణాళిక (2024–29) కింద భారత్ అందిస్తున్న అభివృద్ధి సహాయంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూటాన్ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా రూ.4,000 కోట్ల రాయితీ రుణం అందించే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అలాగే వైద్య విద్య, పరిశోధన రంగాల్లో సహకారం పెంచేందుకు 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్', భూటాన్‌లోని 'ఖేసర్ గ్యాల్పో వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం' మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. భూటాన్ 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ ఇప్పటికే రూ.10,000 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఇందులో మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులు ఉన్నాయి. కాగా, ఈ సమావేశంలో, రూ.332 కోట్ల విలువైన మరో 12 కొత్త అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీంతో ప్రస్తుత ప్రణాళిక కాలంలో భారత్ మద్దతుతో ఆమోదం పొందిన ప్రాజెక్టుల సంఖ్య 82కు చేరింది. అదనంగా, థింపూలో భారత్ నిధులతో నిర్మించిన రెండు పర్యావరణ పార్కులను వర్చువల్‌గా ప్రారంభించారు. భూటాన్‌లో హరిత రవాణాను ప్రోత్సహించేందుకు 45 ఎలక్ట్రిక్ వాహనాలను కూడా భారత్ ఆ దేశ ప్రభుత్వానికి అందించింది. దశాబ్దాలుగా భూటాన్‌కు అభివృద్ధి భాగస్వామిగా ఉన్న భారత్, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, అనుసంధానం, సామర్థ్యాభివృద్ధి వంటి రంగాల్లో నిరంతరం ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది. ఈ తాజా ఒప్పందాలు ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయనున్నాయని అధికారులు పేర్కొన్నారు.



## ఎఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఇయు కఠిన చర్యలు

**బ్రస్సెల్స్:** కృత్రిమ మేధ (ఎఐ) వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దాని దుర్వినియోగాన్ని అరికట్టేందుకు యూరోపియన్ యూనియన్ (ఇయు) కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. బ్రస్సెల్స్‌లో ప్రత్యేక పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేసి, ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న ఎఐ సంస్థల కార్యకలాపాలను నిశితంగా పరిశీలించాలని నిర్ణయించింది. ఆగస్టు 2 నుంచి అమల్లోకి రానున్న ఎఐ చట్టం ప్రకారం, ఎఐతో రూపొందించిన చిత్రాలు, వీడియోలు, చాట్‌బాట్ సమాధానాలు వంటి కంటెంట్‌పై స్పష్టమైన లేబుల్ లేదా డిజిటల్ వాటర్ మార్క్ తప్పనిసరిగా ఉండాలి. దీంతో వినియోగదారులు నిజమైన కంటెంట్‌కు, ఎఐ సృష్టించిన కంటెంట్‌కు మధ్య తేడాను గుర్తించగలుగుతారు. డీప్‌ఫేక్ వీడియోలు, అశ్లీల చిత్రాల తయారీ, సైబర్ దాడులు, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం, ప్రజాస్వామ్య వ్యవస్థలకు ముప్పు కలిగించే ఎఐ వినియోగాన్ని అరికట్టడం వంటివి ఈ కొత్త నిబంధనల ప్రధాన లక్ష్యం. రసాయన, జీవ, అణు సంబంధిత ప్రమాదాలకు దారితీసే ఎఐ వినియోగం, మానవ హక్కులకు భంగం కలిగించే చర్యలు కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. దీని అమలును పర్యవేక్షించేందుకు యూరోపియన్ కమిషన్ తన ఎఐ కార్యాలయాన్ని విస్తరించి మరో 38 మంది నిపుణులను నియమించింది. వీరు ఓపెన్‌ఎఐ, డీప్‌సీక్ వంటి అంతర్జాతీయ ఎఐ సంస్థలతో పాటు ఇతర కంపెనీల



కార్యకలాపాలను కూడా పరిశీలిస్తారు. అక్రమాలు జరిగాయని అనుమానం వస్తే సంస్థల నుంచి వివరాలు కోరడం, ఉద్యోగులను విచారించడం, సాంకేతిక నిపుణుల నుంచి రహస్య సమాచారాన్ని స్వీకరించడం వంటి అధికారాలు ఈ బృందానికి ఉంటాయి. ఎఐ చట్టాన్ని ఉల్లంఘించిన సంస్థలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే యూరోపియన్ మార్కెట్‌లో కార్యకలాపాలను నిషేధించే అధికారం కూడా ఇయుకి ఉంది. సాంకేతిక రంగంలో అమెరికా, చైనా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా స్వతంత్ర ఎఐ వ్యవస్థను నిర్మించడమేగాక. ప్రజల భద్రత, విశ్వసనీయతను కాపాడడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని యూరోపియన్ యూనియన్ వెల్లడించింది.

## జపాన్ భూకంప మృతులు
# 34కు చేరిక

**కుమమొటో:** జపాన్ నైరుతి ప్రాంతంలో 7.1 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య 34కు చేరింది. మరొకరు కూడా మృతి చెందినట్టు వచ్చిన వార్తలపై అధికారులు ఇంకా దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం క్యుషూ ద్వీపాన్ని కుదిపేసిన ఈ భూకంపం వల్ల ఎన్నో భవనాలు కూలిపోగా, కర్మాగారాల నిర్మాణాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 80 మందికిపైగా గాయపడగా, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. భూకంపం సమయంలో కుమమోటో ప్రాంతంలోని కషిమా పట్టణంలో ఉన్న ఏయాన్ మాల్‌లో వేలాది మంది షాపింగ్ చేస్తున్నారు. ప్రమాదాన్ని గుర్తించిన యాజమాన్యం దాదాపు 3,000 మంది వినియోగదారులను పార్కింగ్ ప్రాంతానికి సురక్షితంగా తరలించింది. అయితే మాల్‌లోని మరో భాగంలో పనిచేస్తున్న సిబ్బంది బయటకు రాకముందే భారీ పేలుడు సంభవించింది. ఆ పేలుడు అనంతరం రెండో అంతస్తు కూలిపోవడంతో పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. అక్కడ ఇప్పటివరకు ఏడుగురు మృతి చెందగా, 11 మందిని సజీవంగా రక్షించారు.



ఇంకా ఎంతమంది గల్లంతయ్యారో అధికారులు వెల్లడించలేదు. అదే సమయంలో యత్సుషిరో ప్రాంతంలోని నిప్పాన్ పేపర్ ఇండస్ట్రీస్ కర్మాగారంలో భూకంపం కారణంగా పొగ గొట్టం కూలిపోయింది. అక్కడ 11 మందిని రక్షించగా, తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. భూకంప ప్రభావంతో ఇంకా 3,500కుపైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సి ఉంది. దాదాపు 9,000 మంది సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. తీవ్ర వేసవి వేడి కారణంగా శిబిరాల్లో ఉన్నవారికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అదనపు విద్యుత్ సౌకర్యాలు, ఎయిర్ కండిషనింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం సహాయక బృందాలు ఇంకా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## సియూటలో వలసదారుల తొక్కిసలాట

### 18 మంది మృతి



**సియూట:** మొరాకో సరిహద్దుకు ఆనుకుని ఉన్న స్పెయిన్ భూభాగం సియూటలోకి వేలాది మంది వలసదారులు ఒక్కసారిగా ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 18 మంది వలసదారులు మృతి చెందగా, భారీ సంఖ్యలో గాయపడ్డారు. పరిస్థితి అదుపు తప్పడంతో స్పెయిన్ ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించి భద్రతను కట్టుదిట్టం చేసింది. మృతుల్లో చాలామంది సముద్ర మార్గంలో ఈదుకుంటూ స్పెయిన్ భూభాగానికి చేరే ప్రయత్నంలో మునిగిపోయారు. మరికొందరు టరాజల్ బీచ్ వద్ద ఉన్న సరిహద్దు అడ్డంకిని దాటే క్రమంలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను స్పెయిన్ సివిల్ గార్డ్ ప్రతినిధులు 'తీవ్రమైన మానవతా సంక్షోభం'గా అభివర్ణించారు. సుమారు 60,000 మంది వలసదారులు, వారిలో తల్లిదండ్రులు లేని చిన్నారులు కూడా ఉండడంతో, వారికి ఆశ్రయం లేక పార్కులు, రహదారుల పక్కనే రాత్రి గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు స్పెయిన్‌లోకి ప్రవేశించగా, మరికొందరు తిరిగి మొరాకో వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో వలసదారులు ఒక్కసారిగా సరిహద్దు దాటేందుకు ఎందుకు ప్రయత్నించారనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటనపై మొరాకో ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. పరిస్థితిని సమీక్షించేందుకు స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్, అంతర్గత వ్యవహారాల మంత్రి ఫెర్నాండో గ్రాండేమార్లాస్కా స్యూటాను సందర్శించారు. ఈ సంఘటనతో యూరప్‌లో అక్రమ వలసలు, సరిహద్దు భద్రత, శరణార్థుల సంక్షేమంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.

## టామ్‌కామ్‌దే బాధ్యత
**(మొదటి పేజీ తరువాయి)**

పాటు వివిధ దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సిఎం సూచించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సిఎం సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

**ఎటిసి విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్**

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటిఐలు, ఎటిసిలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేపట్టనున్న ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. ఎటిసిలలో ఈవి సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని సిఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సిఎం సూచించారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సిఎం తెలిపారు. సమావేశంలో సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, 'శక్తి' కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర గోదావరి
**(మొదటి పేజీ తరువాయి)**

తెలుస్తోంది. గోదావరి భద్రాచలం వద్ద 53 అడుగులకు చేరుకుంటే చివరి ప్రమాదహెచ్చరికను జారీ చేస్తారు. ఇదిలా ఉండగా ఎగువ ప్రాంతాలు చాలా వరకు జలమయం అవుతున్నాయి. దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టి, తూరుబాక ప్రాంతాల్లో గోదావరి వరద నీరు ప్రధాన రహదారిపైకి చేరుకోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోదావరి 51 అడుగులకు చేరుకుంటే దుమ్ముగూడెం మండంలోని గంగోలు, బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం భద్రాచలం సమీపంలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం ఎటపాక, గుండాల ప్రధానరహదార్లపైకి నీరు చేరుతుంది. భద్రాచలంవద్ద గోదావరి ఉధృతి పరిస్థితిని ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు జిల్లా కలెక్టర్ అంకిత్ ఎస్‌పి రోహిత్ రాజ్ సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ తదితరులు పరిశీలించారు. చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపు కూలీలు, ఇసుక లారీల డ్రైవర్లు గోదావరిలో చిక్కుకుపోయారు. ఒక్కసారిగా గోదావరి వరద ర్యాంపును చుట్టుముట్టడంతో భయాందోళనకు గురి కావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఐదు గంటల పాటు శ్రమించి జేసిబిల సహాయంతో వారిని రక్షించారు. ఎన్‌ఎండిసి అధికారులు ఇసుక సైట్ తెరిచి ఉంచడంతో లారీలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నట్లు తెలుస్తోంది. గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుంటే అధికారులకు సోయి లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు. కూలీలు, లారీల డ్రైవర్లు బయట పడ్డప్పటికీ సుమారు 40 లారీల వరకు ఇసుక ర్యాంపులోనే ఉన్నాయి. గోదావరి వరద మరింత పెరిగితే ఆ లారీలు మొత్తం గోదావరిలో కొట్టుకుపోయే, ఇసుకలో కూరుకుపోయే ప్రమాముంది.

## థర్మల్ కేంద్రాలకు
# బొగ్గు కొరత లేకుండా చర్యలు
### సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో రా ష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందని సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు రోజుకు 28 నుంచి 32 రేక్‌ల ద్వారా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు, నాణ్యత అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణం గా ఓపెన్‌కాస్ట్ గనుల ఉత్పత్తిపై కొంత ప్రభావం పడినా, ముందస్తు జాగ్రత్తలతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను తప్పకుండా సాధించాలని సూచించారు. అదే సమయంలో వర్షాకాలంలో భూగర్భ గనుల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 7580 శాతం బొగ్గును సరఫరా చేస్తున్నట్లు సిఎండి తెలిపారు. వర్షాకాలంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని, స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సింగరేణి రెస్క్యూ బృందా లు, ఇతర విభాగాల అధికారులు వెంటనే సహాయక చర్యల్లో పాల్గొనే విధంగా సిద్ధం గా ఉండాలని ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తికి అనుగుణంగా అన్ని ఓపెన్‌కాస్ట్ గనుల్లో లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని, 500 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని చేరుకునేందుకు కొత్త గనులకు అవసరమైన వివిధ అనుమతుల సాధన ప్రక్రియను ఇప్పటి నుంచే వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్ట ర్లు ఎల్.వి.సూర్యనారాయణ , కె.వెంకటేశ్వర్లు , గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వెంకన్న, జిఎం టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆగస్టులోనూ లోటు
**(మొదటి పేజీ తరువాయి)**

35.4 శాతంగా ఉండేది. అయితే, జులైలో మంచి వర్షపాతం నమోదవ్వడం కారణంగా ఈ వర్షపాత లోటు తగ్గిందని డాక్టర్ మహాపాత్ర తెలిపారు. 'జులై నెల సాధారణ సగటు వర్షపాతం 280.5 మి.మీ కాగా, ఈ ఏడాది దేశంలో 283.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే, దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిలో రెండు తీవ్రతరం చెంది వాయుగుండాలుగా మారాయి' అని ఆయన పేర్కొన్నారు. జులై మొదటి వారంలో గాలి, మేఘాల కదలికల వ్యవస్థ (ఎంజెఒ) భారతదేశానికి అనుకూలమైన దశలో ఉండటం వల్ల దక్షిణ భారతం మీదుగా రుతుపవన మేఘాలు ఉత్తరం వైపు విస్తరించి భారీ వర్షాలు పడ్డాయి. అయితే జులై చివరి భాగంలో ఇది ప్రతికూలంగా మారింది. కాగా, భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఐదేళ్లలో అత్యధిక సంఖ్యలో 'అత్యంత భారీ వర్షపాత' సంఘటనలు (204.5 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం) కూడా ఈ జులైలోనే నమోదయ్యాయి. ఇవి ప్రధానంగా ఒడిశా, గుజరాత్, మహారాష్ట్రల్లో కేంద్రీకృతమై ఉన్నాయని డాక్టర్ మహాపాత్ర పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చూస్తే ఈ ఏడాది జులైలో సాధారణం కంటే కొంచెం ఎక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మాత్రం 1901 తర్వాత లోటు వర్షపాతం నమోదైంది.

**ఆ రాష్ట్రాల్లో భారీ వర్షాలు**

ఇదిలా ఉండగా, కేరళ, అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములతో కూడిన వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రుతుపవన కాలంలో పలు రాష్ట్రాలు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలతో సతమతమవుతున్న తరుణంలో ఈ తాజా హెచ్చరికలు వెలువడ్డాయి.

## సిఎస్‌కు ఆదేశం
**(మొదటి పేజీ తరువాయి)**

ప్రజల్లో విశ్వాసం కొనసాగాలంటే కోర్టు ఆదేశాలను ధిక్కరించిన అధికారిని అదే బాధ్యతల్లో కొనసాగించడం సరికాదని పేర్కొంటూ రంగనాథ్‌ను వెంటనే ప్రస్తుత పదవి నుంచి రిలీవ్ చేసి మరో అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. గ్రీకు పురాణంలోని 'హైడ్రా'ను ప్రస్తావిస్తూ చట్టానికి అతీతంగా ఏ ప్రభుత్వ వ్యవస్థా వ్యవహరించలేదని కోర్టు వ్యాఖ్యానించింది. లోతుకుంట భూముల వ్యవహారంలో కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించి హైడ్రా అధికారులు భూమిలోకి ప్రవేశించి నిర్మాణాలు తొలగించడాన్ని ఉద్దేశపూర్వక ధిక్కరణగా తేల్చింది. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకే చర్యలు చేపట్టామని చేసిన వాదనకు ఆధారాలు లేవని పేర్కొంది. హైడ్రా కమిషనర్‌పై ఇప్పటికే 62 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కూడా తీర్పులో నమోదు చేసింది.

## వారంపాటు వర్షాలు
**(మొదటి పేజీ తరువాయి)**

బుధవారం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ ఇదే తరహా వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు అక్కడక్కడ వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రైతులు, వాహనదారులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వచ్చే బుధ, గురు, శుక్రవారం వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, ఈ రెండు రోజులకు ప్రత్యేక వాతావరణ హెచ్చరికలు ఏవీ జారీ చేయలేదన్నారు. కాగా తూర్పు విదర్భ, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలపై ఏర్పడిన వాయుగుండం గత 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో పశ్చిమ, వాయువ్య దిశగా కదిలింది. శుక్రవారం ఇది పశ్చిమ విదర్భ, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో వద్ద కేంద్రీకృతమై ఉంది. ఇది అమరావతి (మహారాష్ట్ర)కు తూర్పుఈశాన్యంగా 50 కి.మీ, వార్ధా (మహారాష్ట్ర)కు వాయువ్యంగా 60 కి.మీ, బేతుల్ (మధ్యప్రదేశ్)కు దక్షిణ, ఆగ్నేయంగా 90 కి.మీ, ఖాండ్వా (మధ్యప్రదేశ్)కు తూర్పుఆగ్నేయంగా 210 కి.మీ, ఖర్గోన్ (మధ్యప్రదేశ్)కు తూర్పుఆగ్నేయంగా 280 కి.మీ దూరంలో ఉంది. రాబోయే 24 గంటల్లో ఇది విదర్భ, దక్షిణ మధ్యప్రదేశ్, దానికి ఆనుకుని ఉన్న మధ్య మహారాష్ట్ర మీదుగా పశ్చిమ, వాయువ్య దిశగా కదిలి, తీవ్ర అల్పపీడన ప్రాంతంగా బలహీనపడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. సముద్ర మట్టంలో రుతుపవన ద్రోణి జైసల్మేర్, ఉదయపూర్, ఇండోర్, వాయుగుండం కేంద్రం, గోపాల్పూర్ మీదుగా ఆగ్నేయంగా మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించిందన్నారు.

## పార్లమెంట్ వద్ద స్కిట్
**(మొదటి పేజీ తరువాయి)**

సేకరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి రుచి వీరా (మోరదాబాద్), అవధేశ్ ప్రసాద్ (అయోధ్య) కూడా ఈ స్కిట్‌లో నటించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అతిథి పాత్రలో కనిపించారు. ఆయన కొంత మొత్తాన్ని హుండీలో వేశారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ కూడా తమ వంతుగా విరాళాలు ఇచ్చారు. అలా పలువురు ఎంపిలు ఇచ్చిన విరాళాలతో ఆ సన్యాసి ఉడాయిస్తాడు. అది గమనించిన ఎంపిలు అతడిని పట్టుకొన్ని దేహశుద్ధి చేసినట్లు నటిస్తారు. అక్కడితో స్కిట్ ముగుస్తుంది. 'అమిత్ షా సదన్ సే గాయబ్ క్యా?' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక నిలబడి, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అవధేష్ ప్రసాద్, ధర్మేంద్ర యాదవ్, జార్ఖండ్ ముక్తి మోర్చాకు చెందిన మహువా మార్ఝి తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు జరిపిన నిరసనల సందర్భంగా, విరాళాల దొంగతనం, విద్యార్థులపై క్రూరమైన బలప్రయోగం వంటి ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఇండియా కూటమి పేర్కొంది. ఇదిలా ఉండగా, విన్నూత్న స్కిట్‌పై సమాజ్‌వాదీ పార్టీ ఎంపి ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ..' ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ జరిగింది. దీనిపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లూ నీట్ పేపర్ లీక్ అంశంపై ఉభయసభల్లోనూ ఆందోళనలు రేగడంతో ఈ విషయం చర్చకు రాలేదు. దీనిపై చర్చ చేపట్టాలని నేను కూడా పార్లమెంట్ ప్రారంభమైన రోజు నుంచి నోటీసులు ఇస్తూనే ఉన్నాను. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందుకే, పప్పు యాదవ్ ఆలోచనతో ఈ స్కిట్ చేశాం' అని అన్నారు. లోక్‌సభలో పప్పు యాదవ్ కాషాయ వస్త్రధారణ అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభకు ఇలా రావడం సరికాదన్నారు.

## ప్రతిష్టంభన
**(మొదటి పేజీ తరువాయి)**

సభ ముందు ఉంచినప్పుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేను మాట్లాడటానికి అనుమతించాలని డిమాండ్ చేస్తూ పలువురు ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడ్డారు. అయితే ప్రతిపక్షం ఇంకా ఎమర్జెన్సీ మోడ్‌లోనే ఉందని చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ విమర్శించారు. 'మీరు ఈ రోజు వరకు ఎమర్జెన్సీ మోడ్‌లోనే ఉన్నారు. అందరూ వినాలని మీరు కోరుకుంటారు, కానీ మీరు ఎవరి మాట వినరు. ఇది నియంతృత్వం. మీరు ప్రజాస్వామ్య విలువలకు విలువ ఇవ్వాలనుకోవడం లేదు' అని చైర్మన్ అన్నారు. తరువాత చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఖర్గేను మాట్లాడటానికి అనుమతించారు, కానీ ప్రతిపక్ష నాయకుడు రూల్ 267 కింద కొన్ని అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నించడంతో, ఆ నిబంధన కింద ఎలాంటి నోటీసులను స్వీకరించబోమన్నారు. అయోధ్య రామ మందిరం నిధుల చోరీ, భూసేకరణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి రూల్ 267 కింద ప్రతిపక్ష నేత నోటీసు ఇచ్చారు. పేపర్ లీక్‌లపై ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు. హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని కూడా వారు డిమాండ్ చేశారు. అయితే, జీరో అవర్‌తో హోం మంత్రికి ఏం సంబంధం? అని చైర్మన్ అన్నారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగిస్తుండగా, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జోక్యం చేసుకుని చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని, సభ గౌరవంతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. జీరో అవర్‌లో సభ్యులు తమ అంశాలను లేవనెత్తడానికి చైర్మన్ అనుమతించినప్పటికీ, రామ మందిరంలో విరాళాల దొంగతనం జరిగిందన్న ఆరోపణలకు వ్యతిరేకంగా సహా ప్రతిపక్షం నినాదాలు కొనసాగించింది. విరాళాలు దొంగిలించే వారి ప్రభుత్వం సాగదు, విరాళాలు దొంగిలించేవారు గద్దె దిగాలి వంటి నినాదాలను ప్రతిపక్ష ఎంపిలు చేశారు. ఆ గందరగోళం మధ్య చైర్మన్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు.

**లోక్‌సభలో రెండవ వారమూ సాగని ప్రశ్నోత్తరాలు**

నీట్ పేపర్ లీక్, రామ మందిర విరాళాల చోరీ ఆరోపణలపై ప్రతిపక్షాలు చేస్తున్న నినాదాల కారణంగా, లోక్‌సభలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయం వరుసగా రెండో వారం కూడా పూర్తి కాలేదు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. ఈ సమయంలో మంత్రులు మౌఖికంగా సమాధానాలు ఇవ్వడానికి 20 వరకు ప్రశ్నలు ఉంటాయి. జూలై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి, ప్రశ్నోత్తరాల సమయంలో సభ 10 నిమిషాలకు మించి పనిచేయలేకపోతోంది. ప్రశ్నోత్తరాల సమయం సజావుగా సాగేందుకు అనుమతించాలని స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష సభ్యులను పదేపదే కోరారు. ఇది ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడానికి ఎంపిలకు సహాయపడుతుందని ఆయన అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ముందస్తు ప్రణాళికతో అంతరాయాలు కలిగిస్తున్నారని బిర్లా తరచుగా విచారం వ్యక్తం చేశారు. పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించే బిల్లుపై లోక్‌సభ 10 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించినప్పటికీ, సభ్యులు ప్రజా ప్రాముఖ్యత గల విషయాలను లేవనెత్తే ప్రశ్నోత్తరాల సమయాన్ని గానీ, జీరో అవర్‌ను గానీ నిర్వహించలేకపోయింది. గురువారం నాడు, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండగా జరిగిన సంక్షిప్త చర్చ అనంతరం, జాతీయ గేయం వందేమాతరంను అగౌరవపరచడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించే బిల్లును కూడా సభ ఆమోదించింది.

# ఫిట్‌నెస్ పాస్.. శ్రీలంక సిరీస్‌కు బుమ్రా

శ్రీలంక పర్యటనకు ముందే భారత జట్టుకు గుడ్ న్యూస్, ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చేస్తున్నాడు. గాయం నుంచి కోలుకున్న ఈ యార్కర్ కింగ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. దాంతో, త్వరలో లంకతో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. పొరుగుదేశమైన లంకకు శుభ్మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఆగస్టులో వెళ్లనుంది. పని ఒత్తిడి కారణంగా తరచూ గాయపడుతున్న జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసయ్యాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడిన బుమ్రా.. బెంగళూరులోని బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైన అతడు శ్రీలంక పర్యటనకు సిద్ధమవుతున్నాడని సమాచారం. దాంతో, ఇప్పటికే స్క్వాడ్‌కు ఎంపికైన బుమ్రా సిరీస్‌లో ఆడడం దాదాపు ఖరారైన నేపథ్యంలో భారత జట్టుకు పేస్ బౌలింగ్ కష్టాలకు తెరపడనుంది. ఆగస్టులో శుభ్మన్ సారథ్యంలోని భారత జట్టు లంకకు వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్2లోకి వచ్చే అవకాశాలు తక్కువే.



**భారత టెస్టు స్క్వాడ్ :** శుభ్మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.

# కామన్వెల్త్ క్రీడల్లో భారత పతకాల సంఖ్య 17

### లవ్‌ప్రీత్ సింగ్‌కు సిల్వర్..
### డిస్కస్ త్రోలో సీమకు కాంస్యం

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 8వ రోజు భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. భారత వెయిలిఫ్టర్ లవ్‌ప్రీత్ సింగ్ సిల్వర్ మెడల్ సాధించగా.. డిస్కస్ త్రోయర్ సీమ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. దాంతో భారత్ పతకాల సంఖ్య 17కి చేరింది. ఇందులో 3 స్వర్ణాలతో పాటు 10 రజతాలు, 4 కాంస్యాలు ఉన్నాయి.

పురుషుల 110 కేజీల వెయిట్లిఫ్టింగ్‌లో లవ్‌ప్రీత్ సింగ్ 388 కేజీల బరువు ఎత్తి తృటిలో స్వర్ణాన్ని కోల్పోయాడు. స్నాచ్ విభాగంలో 176 కేజీల బరువు ఎత్తి కామన్‌వెల్త్‌లో నయా రికార్డ్ నమోదు చేశాడు. క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 212 కేజీలు ఎత్తాడు. న్యూజిలాండ్‌కు చెందిన డేవిడ్ ఆండ్రూ లిట్టి క్లీన్ అండ్ జర్క్లో 223 కేజీలు సరికొత్త రికార్డుతో మొత్తం 389 కేజీలు ఎత్తి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఒక్క కేజీ తేడాతో గోల్ మెడల్‌ను సొంతం చేసుకున్నాడు.

లవ్‌ప్రీత్ సింగ్ రజతంతో భారత వెయిట్ లిఫ్టింగ్ బృందం ఒక స్వర్ణం, 6 రజతాలు, ఒక కాంస్యంతో సహా మొత్తం 8 పతకాలు సాధించింది. మహిళల డిస్కస్ త్రోయర్ విభాగంలో సీమ డిస్కస్ను 58.65 మీటర్ల దూరం విసిరింది. ఈ ఈవెంట్లో జమైకాకు చెందిన సమంత హాల్ 61.66 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించింది. కెనడాకు చెందిన జూలియా దంక్స్ 60.67 మీటర్ల త్రో సాయంతో సిల్వర్ గెలుచుకుంది. మరో భారత ప్లేయర్ నిధిరాణి 57.10 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకాన్ని కోల్పోయింది. గతంలో బర్మింగ్హామ్ కామన్వెల్త్ గేమ్స్లో కాంస్య పతకం గెలుచుకున్న లవ్‌ప్రీత్ సింగ్ ఈ సారి సిల్వర్ మెడల్ సాధించాడు. కామన్వెల్త్ గేమ్స్లో 8వ రోజు నాటికి భారత్ మెడల్స్ 9వ స్థానంలో నిలిచింది.





**కామన్వెల్త్ టీటీ చాంప్ భారత్...** ప్రతిష్టాత్మక కామన్వెల్త్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. ఫైనల్లో భారత పురుషుల, మహిళల జట్లు మలేషియాను ఓడించి టైటిల్ నెగ్గాయి. టైటిల్ పోరులో మెన్స్ టీమ్ 3–2తో నెగ్గగా అమ్మాయిల జట్టు 3–0తో మలేషియాపై ఏకపక్ష విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది.



## సైన్స్

# సొంత గ్రహాన్నే మింగేసిన నక్షత్రం!

సూర్యుడిని పోలిన ఒక నక్షత్రం తన చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాన్ని పూర్తిగా మింగేసిన అరుదైన సంఘటనకు శాస్త్రవేత్తలు స్పష్టమైన ఆధారాలను గుర్తించారు. ఈ ఘటన తర్వాత ఆ నక్షత్రంలో అసాధారణంగా అధిక స్థాయిలో 'లిథియం' మూలకం కనిపించడంతో, గ్రహాన్ని మింగిన 'రసాయనిక ఆనవాలు'గా దానిని పరిశోధకులు భావిస్తున్నారు. సాధారణంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో లిథియం క్రమంగా నశిస్తూ ఉంటుంది. అయితే ఈ నక్షత్రంలో ఒక్కసారిగా లిథియం పరిమాణం పెరగడం, ఒక గ్రహం నక్షత్రంలో కలిసిపోయిన తర్వాత దాని పదార్థం నక్షత్రంలో మిళితమైందనే సంకేతంగా శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు నక్షత్రాలు, గ్రహాల పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడంలో ఎంతో కీలకమని పరిశోధకులు చెబుతున్నారు. ఒక నక్షత్రం వయసు పెరిగే కొద్దీ దాని పరిమాణం విస్తరించి, సమీపంలో ఉన్న గ్రహాలను తనలోకి లాగుకునే అవకాశం ఉంటుందని ఇప్పటికే భావిస్తున్నారు. తాజా పరిశోధన ఆ సిద్ధాంతానికి మరింత బలమైన ఆధారాలను అందించింది. ఈ ఆవిష్కరణ ద్వారా గ్రహ వ్యవస్థల జీవన చక్రం, నక్షత్రాల పరిణామం, భవిష్యత్తులో సౌర కుటుంబాల గమ్యం వంటి అంశాలపై మరింత లోతైన అవగాహన పొందే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.



# మళ్లీ మేల్కొన్న 'హొరైజన్స్'

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన న్యూ హొరైజన్స్ అంతరిక్ష నౌక భూమికి దాదాపు 6 బిలియన్ మైళ్లు (సుమారు 9.7 బిలియన్ కిలోమీటర్లు) దూరంలో ఉండి, 321 రోజుల హైబర్నేషన్ (నిద్రావస్థ) తర్వాత మళ్లీ విజయవంతంగా పనిచేయడం ప్రారంభించింది. హైబర్నేషన్ అంటే విద్యుత్‌ను ఆదా చేయడానికి అవసరం లేని పరికరాలను తాత్కాలికంగా నిలిపివేసే విధానం. ఈ నౌక 2026 జూన్ 23న మేల్కొని, తన వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయని భూమికి రేడియో సంకేతం పంపింది. అంత దూరం నుంచి పంపిన ఆ సంకేతం భూమికి చేరడానికి 8 గంటల 52 నిమిషాలు పట్టింది. ఈ సంకేతాన్ని నాసా డీప్ స్పేస్ నెట్‌వర్క్ ద్వారా స్వీకరించింది. న్యూ హొరైజన్స్ 2015లో ప్లూటో గ్రహాన్ని అత్యంత సమీపంగా చేరుకొని, ఆ మరుగుజ్జు గ్రహానికి సంబంధించిన తొలి స్పష్టమైన చిత్రాలు, విలువైన శాస్త్రీయ సమాచారాన్ని ప్రపంచానికి అందించింది. అనంతరం 2019లో కైపర్ బెల్ట్‌లోని ఆరోకోత్ అనే ఖగోళ వస్తువును సమీపం నుంచి పరిశీలించి మరో చరిత్ర సృష్టించింది. నిద్రావస్థలో ఉన్నప్పటికీ, నౌకలోని ప్లాస్మా సెన్సార్, డస్ట్ డిటెక్టర్ వంటి కీలక పరికరాలు పనిచేస్తూనే ఉన్నాయి. వీటి ద్వారా కైపర్ బెల్ట్‌లోని ధూళి కణాలు, అంతరిక్ష వాతావరణానికి సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించాయి. ఇప్పుడు మళ్లీ చురుకుగా మారిన ఈ అంతరిక్ష నౌక ఇప్పటివరకు సేకరించిన సమాచారాన్ని భూమికి పంపడంతో పాటు, తన పరికరాల పనితీరును పరీక్షించి, సూర్యుని ప్రభావం విస్తరించిన బయటి హీలియోస్ఫియర్ ప్రాంతంపై కొత్త పరిశోధనలు ప్రారంభించనుంది. ప్రస్తుతం కైపర్ బెల్ట్‌లో క్రియాశీలంగా శాస్త్రీయ పరిశోధనలు కొనసాగిస్తున్న ఏకైక అంతరిక్ష నౌక న్యూ హొరైజన్స్ మాత్రమే. సౌర కుటుంబం అంచుల్లో దాగి ఉన్న ఎన్నో రహస్యాలను వెలికితీయడంలో ఇది శాస్త్రవేత్తలకు అమూల్యమైన సమాచారాన్ని అందిస్తోంది.



# గాజులా కనిపించే సోలార్ కిటికీలు

ఇంటి కిటికీలు సాధారణ గాజులా కనిపిస్తూనే, అదే సమయంలో సూర్యకాంతి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తే ఎలా ఉంటుంది? ఇదే పారదర్శక లేదా 'అదృశ్య' సౌర కిటికీల వెనుక ఉన్న వినూత్న సాంకేతికత. ఈ కిటికీలు మనకళ్లకు కనిపించే కాంతిని యథావిధిగా లోపలికి అనుమతిస్తూనే, సూర్యకాంతిలోని అతినీలలోహిత, పరారుణ కిరణాలను గ్రహించి వాటిలోని శక్తిని విద్యుత్‌గా మారుస్తాయి. సాంప్రదాయ సౌర ఫలకాలతో పోలిస్తే ఇవి పారదర్శక ఫొటోవోల్టాయిక్ పదార్థాలతో తయారవుతాయి. ప్రస్తుతం ఇవి సాధారణ సోలార్ ప్యానెల్‌లంత విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోయినా, భవనాల గాజు ఉపరితలాలనే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చగల సామర్థ్యమే వాటి ప్రధాన ప్రయోజనం. కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లలో విస్తారంగా ఉన్న గాజు కిటికీలను ఈ సాంకేతికతతో వినియోగిస్తే, భవనాలు తమవిద్యుత్ అవసరాల్లో గణనీయమైన భాగాన్ని స్వయంగా ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ సాంకేతికత భవిష్యత్తులో శక్తి సామర్థ్యం ఎక్కువగా ఉండే పర్యావరణహిత భవనాల నిర్మాణానికి కీలకంగా మారవచ్చు. అప్పుడు కిటికీలు కేవలం వెలుతురును లోపలికి అనుమతించే గాజుపలకలు మాత్రమే కాకుండా, రోజంతా నిశ్శబ్దంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే శక్తి కేంద్రాలుగా పనిచేస్తాయి. దీనివల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. అయితే, ఈ సాంకేతికత ఇంకా పరిశోధన, అభివృద్ధి దశలోనే ఉంది. వాణిజ్యపరంగా విస్తృతంగా అందుబాటులోకి రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో సౌరశక్తి వినియోగంలో ఇది ఒక కీలక మార్పుకు శ్రీకారం చుడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



## కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై
# సమరశంఖం పూరించాలి

### సామాన్యుల నడ్డి విరుస్తున్న ధరలు
### జెన్ జి ఉద్యమం ఓ మైలురాయి
### 6 నుంచి ప్రజాచైతన్య యాత్రలు
### సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా బాధ్యుల సమావేశం శుక్రవారం పాల్వంచలోని సిపిఐ కార్యాలయం సిఆర్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై కూనంనేని మాట్లాడుతూ కేంద్ర పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలు, కార్మికులు, రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసరాల ధరలను అరికట్టడంలో కేంద్రం విఫలమైందన్నారు. జంతర్ మంతర్ వద్ద యువత చేపట్టిన పోరాటం చారిత్రాత్మకమైనదని, నిర్బంధాలకు బెదరకుండా ప్రజాస్వామ్యబద్దంగా పోరాడి తమ డిమాండ్లను సాధించుకున్న యువత పట్టుదలను ఆయన కొనియాడారు. దేశయువత పోరాటానికి కేంద్రప్రభుత్వం దిగిరాక తప్పలేదని, జెన్ జి ఉద్యమం చరిత్రలో ఒకమైలురాయి కూనంనేని అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, వారిని చైతన్య పరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్యయాత్రలు, సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా మాట్లాడుతూ సీతారామ, సీతమ్మదార ప్రాజెక్టుల ద్వారా రైతాంగానికి సాగు జలాలు అందించాలని, పాల్వంచ కేంద్రంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జరిగే సిపిఐ ప్రజాచైతన్య యాత్రలో పార్టీశ్రేణులు పాల్గొనాలని కోరారు. కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, నరాటి ప్రసాద్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఎస్‌డి. సలీమ్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, మున్నా లక్ష్మీకుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, రేసు ఎల్లయ్య, వాసిరెడ్డి మురళీ, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, దేవరకొండ శంకర్, ఎస్‌కె. ఫహీమ్, మువ్వ వెంకటేశ్వర్లుతో పార్టీ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.




# ఒసి డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి అప్పగించాలి

### ఎఐటియుసి డిమాండ్
### మణుగూరులో ఆందోళన, రాస్తారోకో

**ప్రజాపక్షం/మణుగూరు :** డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కేటాయించకపోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి కొరిమి రాజకుమార్, అదనపు డిప్యూటీ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య హెచ్చరించారు. శుక్రవారం మణుగూరు ప్రధాన రహదారి సిపిఐ కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి), సిపిఐ నాయకులు పెద్దఎత్తున జెండాలు చేత పట్టుకొని 'సేవ్ మణుగూరు', ఒసి టు డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కేటాయించాలంటూ పెద్ద ఎత్తున ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. ధర్నాతో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో మణుగూరు సిఐ నాగబాబు, ఎస్ఐ పోలీసులు రాస్తారోకో జరిగే ప్రాంతానికి వచ్చి బలవంతంగా నాయకులను తరలించారు. దీంతో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సిపిఐ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజకుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య మాట్లాడుతూ ఒసి టు డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణి కాకుండా జెన్‌కోకు అప్ప చెప్పాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. దీనివలన సింగరేణి కార్మికులు పూర్తిస్థాయిలో నష్టపోయే ప్రమాదం ఉందని, సింగరేణి కేటాయిస్తే సింగరేణి ద్వారా జెన్‌కోకు బొగ్గు సరఫరా చేసుకోవచ్చని, దీనివలన కార్మికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో డిసైడ్ బ్లాక్ సింగరేణి కేటాయిస్తే సింగరేణి పది సంవత్సరాల మనుగడ కొనసాగుతుందన్నారు. దీని వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ప్రాంతంలో సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు, లారీ ఓనర్స్, లారీ డ్రైవర్స్, గుమస్తాలు, బొగ్గు ముఠా కార్మికులు, ఇలా ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల కుటుంబాలు ఉపాధి దొరుకుతుందన్నారు. కమిషన్లకు కక్కుర్తి పడి సింగరేణి బ్లాకులను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కొంగు బంగారమైన సింగరేణి బ్లాకులను ప్రైవేటుపరం కాకుండా ముఖ్యమంత్రి దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలనీ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై.రామ్‌గోపాల్, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, నాయకులు జంగం మోహన్‌రావు, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సింగరేణి నాయకులు రామనరసయ్య, మేకల ఈశ్వర్, అదెర్ల సురేందర్, ఇమాముద్దీన్, శనిగరపు కుమారస్వామి, ఆవుల నాగరాజు, సాయి, కిషోర్ బాబు, యాకూబ్ శివయ్య, సందీప్, కందిమల్ల రామయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, తోట రమేష్, చింతల దశరథం, వేర్పుల నరేష్, ఎస్‌కె.సర్వర్, ఎస్‌డి.ఓమర్, సర్పంచ్ చీడం ఉషారాణి, ఉపసర్పంచ్ పులిగల రమేష్, బోలగాని సమ్మక్క, తేనేటి నారాయణ, కొత్తపల్లి సీతారాములు, వార్డుమెంబర్ వజ్రా వెంకటేశ్వర్లు, ఆధార్ల రాములు, కోటి, యాకూబ్, వీరమల్లుతో పాటు యూనియన్‌నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.




# ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో పాదయాత్ర

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు
### ఎం.బాల నరసింహ్మ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** ప్రజా సమస్యలను గ్రామాల స్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో ఆగస్టు 6 నుండి 14 వరకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ నాచారి భవన్‌లో సిపిఐ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం పి.కృష్ణాజీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బాల నరసింహ్మ హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యలను గ్రామాల స్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో పాదయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. నీట్ పేపర్ లీకేజీపై ఉద్యమం చేసిన విద్యార్థులు, యువతపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బిజెపి ఎంపి కంగనా రనౌత్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామ మందిర నిధుల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ వైఫల్యాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో చాలాహామీలు ఇంకా అమలు కాలేదన్నారు. ఈఅంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, ఉపాధి, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. పాదయాత్రల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని, ప్రజలను సంఘటితం చేసి సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వార్ల వెంకటయ్య, కే.కేశవులుగౌడ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్యాద వెంకటయ్య, మారేడు శివ శంకర్, సూర్య శంకర్ గౌడ్, దాసరి బాలమురళీకృష్ణ, తెలకపల్లి మండల కార్యదర్శి వి.రవీందర్, తాడూరు మండల కార్యదర్శి ఎండి, కుతుబుద్దిన్, మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్, మధుగౌడ్, మండ లనాయకులు ఉషమ్మ, సాయిలు, గొర్ల సత్యం, చిన్నపాగ శ్రీనివాసులు, చెన్నయ్య, బుగ్గ స్వామి, కొత్త రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి ప్రభుత్వానిది నియంతృత్వ పాలన

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ
### కార్యదర్శి ఇటి.నర్సింహ్మ

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పాలన చేస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యాదర్శి ఇటి.నర్సింహ్మ ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై అన్ని రకాల దాడులు చేస్తున్నారన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానిక ముఖ్య అతిథి ఇటి.నర్సింహ్మ హాజరై మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి రాకముందు నరేంద్ర మోదీ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో మగ్గుతున్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చి జనధన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని, పెట్రోల్, డిజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలు తగిస్తానని, ప్రజా శ్రేయస్సు కొరకు పనిచేస్తానని పలు రకాల హామీలిచ్చి, అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, దేశ సంపదను తన మిత్రులైన ఆదాని, అంబానీలకు దోచి పెట్టున్నారని ఆరోపించారు. ప్రజల శ్రేయస్సు కొరకు పని చేయకుండా కార్పొరేట్ల ఆదాయం పెంచేందుకు మోదీ పనిచేస్తున్నారని విమర్శించారు. దేశ నడిబొడ్డున తమ హక్కుల కొరకు పోరాడిన విద్యార్థులపై పోలీసు, ఆర్ఎస్ఎస్ గుండాలతో దాడులు చేయించారని, మహిళలపై కూడా లాఠీచార్జీ చేయించారన్నారు. ఈ దాడులు బిజెపి ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. లాఠీచార్జికి పూర్తి బాధ్యత ప్రధాని నరేంద్రమోదీ, బిజెపి ఎంపి కంగానారనౌత్ తమ హక్కుల సాధనకు పోరాటం చేసిన జెన్‌జీ యువతపై నోరు పారేసుకోవడం సిగ్గుచేటన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలో నిత్యావసర, చమురు, ధరలను పెంచుతూ పేద, మధ్య, సామాన్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం దేశంలో మీడియాను, పత్రికలను, చివరికి సిబిఐ, కోర్టులను కూడా తమ ఆధీనంలో ఉంచుకొని దేశాన్ని తమ ఇష్టానుసారంగా ఏలుతూ రాజ్యాంగాని నిర్వీర్యం చేస్తూ భవిష్యతు లేకుండా చేస్తున్నారన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ ప్రజలను చైతన్యం చేయాల్సిన సమయం ఆసన్నమయిందని, రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఇటి.నర్సింహా తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ.రహెమాన్, నాయకులు నర్సింలు, అజహార్, దత్తురెడ్డి, అశోక్, సతీష్, లక్ష్మి, రూబినా, సయ్యద్, సమద్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణకు రండి.. పెట్టుబడులు పెట్టండి

- పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం
- ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఫ్యూచర్ సిటీకి రావాలనేదే లక్ష్యం
- తెలంగాణ రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు
- సిఐఐ ఉత్తర భారత ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ సురక్షిత స్థానమని, తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఉత్తర భారత ప్రతినిధులను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడులకు రక్షణగా నిలుస్తుందని సిఎం హామీ ఇచ్చారు. సిఎం ఎ.రేవంత్ రెడ్డితో సిఐఐ ఉత్తర భారత ప్రతినిధులు హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ప్రస్తుతం దేశ జిడిపిలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, అది 10 శాతంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ప్రభుత్వాలు మారినా తెలంగాణలో పారిశ్రామిక విధానాలను మార్చడం లేదని అన్నారు. 1994 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అనేక పెట్టుబడులను ఆకర్షించారని, బిల్ గేట్స్, బిల్ క్లింటన్ లాంటి దిగ్గజాలను హైదరాబాద్ కు తీసుకువచ్చారని సిఎం గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతయ ఎయిర్ పోర్టు, అవుటర్ రింగ్ రోడ్డు, ఫార్మా, ఐటి కంపెనీలు హైదరాద్‌కు వచ్చాయన్నారు. 2014 నుంచి 2023 వరకు బిఆర్ఎస్ పాలనలో వారు కొన్ని పాలసీలు తీసుకువచ్చారని, వాటిని కొనసాగిస్తూనే కాంగ్రెస్ సరికొత్త పాలసీలు తీసుకువచ్చామని సిఎం తెలిపారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదని, నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకువస్తే అది కొనసాగుతోందన్నారు. తాము తీసుకువచ్చిన పారిశ్రామిక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, మంచి ప్రతిపాదనలతో వచ్చిన వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నామని సిఎం చెప్పారు.

కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబయి, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సిఎం తెలిపారు. 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగు రోడ్డు లోపల ప్రాంతాన్ని క్యూర్‌గా గుర్తించామని, ఇక్కడ సర్వీస్ సెక్టార్‌కు పెద్ద పీట వేస్తున్నామని, ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు ప్రాంతాన్ని ప్యూర్‌గా గుర్తించామని, అక్కడ మాన్యుఫ్యాక్చర్ రంగానికి ప్రాధాన్యమిస్తున్నామని, రీజినల్ రింగు రోడ్డు వెలుపల వ్యవసాయ రంగానికి, అగ్రి పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సిఎం వివరించారు.

ప్యూర్, రేర్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇవ్వడంతో పాటు ఇతర వసతులు కల్పిస్తామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మించనున్నామని, విభాగాల వారీగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సిఎం వివరించారు. వరంగల్, ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టుల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తెలిపిందని, 7 బుల్లెట్ ట్రైన్లను కేంద్రం ప్రకటిస్తే 3 తెలంగాణకు వచ్చాయన్నారు. శంషాబాద్ నుంచి చెన్నై, శంషాబాద్ నుంచి పూణె, శంషాబాద్ నుంచి బెంగళూరు బుల్లెట్ ట్రైన్లు రానున్నాయన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీ పడదల్చుకోలేదని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీ పడి చైనా+ కంట్రీగా తెలంగాణను నిలపడమే తన లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

తెలంగాణ సంస్కృతి ప్రభుత్వానికి పెద్ద ఆస్థి అని, హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారని, ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందని సిఎం చెప్పారు. పారిశ్రామికవేత్తలు తమకు ఏం కావాలో చెబితే ఆ వసతులు కల్పిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని, పరిశ్రమల శాఖ మంత్రి ప్రతి రెండు నెలలకోసారి, తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని సిఎం హామీ ఇచ్చారు. తెలంగాణను పారిశ్రామికవేత్తలు తమ సొంత ప్రాంతంగా భావించాలని సిఐఐ ప్రతినిధులకు సిఎం సూచించారు.

**తెలంగాణ పారిశ్రామిక విధానాలకు ఆకర్షితులమయ్యాం: సిఐఐ నార్తరన్ రీజియన్ ఛైర్మన్ పునీత్ కౌరా**

"తెలంగాణ పారిశ్రామిక విధానాలు చాలా బాగున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, ఇస్తున్న మద్దతుతో జిసిసిలు హైదరాబాద్‌కు వరుస కడుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఇక్కడ ఉంది. మౌలిక వసతులు, ప్రభుత్వ సహాయ సహకారాలు మెరుగ్గా ఉండడంతోనే సమావేశానికి హైదరాబాద్‌ను ఎంచుకున్నాం. ఇక్కడ అధ్యయనం చేసేందుకు వచ్చాం" అని సిఐఐ నార్తరన్ రీజియన్ ఛైర్మన్ పునీత్ కౌరా చెప్పారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సిఐఐ నార్తరన్ రీజియన్ వైస్ ఛైర్మన్ శారదా సూరి మార్వా, ప్రతినిధులు కృష్ణ బోధనపు, గౌరవ్ మహేశ్వరి, వనిత దాట్ల, వినోద్ కె బాప్న తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ఫీజు రాయితీ మరో నాలుగు నెలలు పొడిగింపు

- నవంబర్ 30 వరకు 25 శాతం రాయితీ అవకాశం
- జీ.ఓ ఎంఎస్ నెంబర్ 213 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అనధికార లేఔట్‌ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరట కల్పించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులు, ఇతర ఛార్జీలపై గతంలో ఇచ్చిన 25 శాతం రాయితీ గడువును మరో నాలుగు నెలల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ (ఎంఏయుడి) స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ శుక్రవారం జీ.ఓ ఎంఎస్ నెంబర్ 213ను జారీ చేశారు. గతంలో ఈ రాయితీ ఆగస్టు 1, 2026 వరకు మాత్రమే వర్తించాల్సి ఉండగా, తాజా ఉత్తర్వుల ప్రకారం దీన్ని నవంబర్ 30, 2026 వరకు పొడిగించారు. అంటే ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 మధ్య ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించే దరఖాస్తుదారులకు 25 శాతం మినహాయింపు లభించనుంది.

**గత గడువులు, ఆలస్యానికి కారణాలు**

గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీని మార్చి 31, 2026 వరకు, ఆ తర్వాత మే 1 నుంచి జులై 31 వరకు అమలు చేసింది. అయితే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పనుల్లో ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నిమగ్నమవడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వెనుకబడింది. దీనికితోడు దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్థాయిలో ఫీజులు రాకపోవడం, ఫీజు చెల్లించిన వారికి కూడా సకాలంలో ప్రొసీడింగ్స్ జారీ కాకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే గడువును మరో నాలుగు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం తొలుత అంచనా వేసినప్పటికీ, మూడుసార్లు గడువు పొడిగించినా ఇప్పటివరకు కేవలం రూ.2 వేల కోట్ల ఆదాయం మాత్రమే సమకూరినట్లు తెలిసింది.

**ఎవరికి వర్తిస్తుంది?**

ఈ రాయితీ హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు (యుడిఏలు), మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్ విభాగాల పరిధిలోని దరఖాస్తుదారులందరికీ వర్తిస్తుంది. ఉత్తర్వుల ప్రతులను హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, జిహెచ్ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్‌లతో పాటు రాష్ట్రంలోని అన్ని పురపాలికల కమిషనర్లు, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, నమోదు, స్టాంపుల శాఖకు పంపారు. ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని సంబంధిత శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నవంబర్ 30లోపు ఫీజులు చెల్లించాలని అధికారులు సూచించారు.

## సర్టిఫికెట్‌లు విద్యార్థి సొత్తే

- ఫీజు బకాయిల పేరుతో నిలుపుదల చెల్లదు
- మల్లారెడ్డి కాలేజీకి హైకోర్టు ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్‌లు వారి వ్యక్తిగత ఆస్తి అని, ఫీజు బకాయిలు ఉన్నాయనే కారణంతో వాటిని కాలేజీలు తమ వద్ద ఉంచుకోవడం చట్టవిరుద్ధమని హైకోర్టు స్పష్టం చేసింది. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం నుంచి అందలేదన్న కారణంతో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను నిలుపుదల చేసే అధికారం విద్యాసంస్థలకు లేదని తేల్చింది. బకాయిలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లోనే వసూలు చేసుకోవాలని, సర్టిఫికెట్‌లను బందీగా ఉంచడం సరైన విధానం కాదని పేర్కొంది. హనుమకొండకు చెందిన చరణ్‌తేజ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జువ్వాడి శ్రీదేవి, బీటెక్ పూర్తి చేసిన తర్వాత కూడా రూ.3.09 లక్షలు చెల్లిస్తేనే సర్టిఫికెట్‌లు ఇస్తామని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చెప్పడం చట్టవిరుద్ధమని తేల్చారు. తీర్పు ప్రతి అందిన వారం రోజుల్లోగా పిటిషనర్‌కు చెందిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్‌లను తిరిగి అప్పగించాలని కాలేజీ యాజమాన్యాన్ని ఆదేశించారు.

## కస్టడీ ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరపాలి

- సీసీటీవీ, వైద్య ఆధారాలు పరిశీలించాలని ఆదేశం
- పోలీసు కమిషనర్‌కు హైకోర్టు సూచన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మలకపేట పోలీస్‌స్టేషన్‌లో అక్రమ నిర్బంధం, కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణలపై సమగ్రంగా, పారదర్శకంగా విచారణ నిర్వహించాలని నగర పోలీసు కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. నిర్బంధ సమయంలోని సీసీటీవీ ఫుటేజీతో పాటు బాధితుడికి సంబంధించిన వైద్య నివేదికలను పరిశీలించి ఆయన సమర్పించిన వినతి పత్రంపై చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని సూచించింది. తనను పోలీసులు కారణం లేకుండా అదుపులోకి తీసుకుని 24 గంటలకు పైగా నిర్బంధించి వేధించారని పి.శ్రీకాంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డీజీపీ, పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న ఆధారాలన్నింటినీ పరిశీలించి ఫిర్యాదును పరిష్కరించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను ముగించారు.

## అక్రిడేషన్ వ్యవహారంలో అధికారులకు ధిక్కరణ నోటీసులు

- సీఎస్‌తో పాటు సంబంధిత శాఖలకు నోటీసులు
- విచారణ సెప్టెంబరు 16కు వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మీడియా అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగింపు వ్యవహారంలో కోర్టుకు ఇచ్చిన హామీ అమలు కాలేదన్న ఆరోపణలపై దాఖలైన ధిక్కరణ పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సమాచార శాఖ అధికారులు, మీడియా అకాడమీలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అక్రిడేషన్ కార్డుల గడువును జూన్ 16 వరకు పొడిగిస్తామని ప్రభుత్వం కోర్టులో హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయకపోవడంతో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ పి.శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబరు 16కు వాయిదా వేసింది.

## ఫేక్ ప్రచారం నమ్మొద్దు.. అదంతా తప్పుడు ప్రచారం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తనకు ఒక నెల రోజుల జైలు శిక్ష విధించారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారాన్ని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ తీవ్రంగా ఖండించారు. తనపై వస్తున్న ఆ వార్తలు పూర్తిగా అవాస్తవమని, వాటిలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. స్వార్థ పూరిత శక్తులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు కావాలనే తనపై ఇటువంటి ఫేక్ ప్రచారానికి ఒడిగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, సోషల్ మీడియా వినియోగదారులు ఇటువంటి అసత్య ప్రచారాలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. హైడ్రా సంస్థ చట్ట నిబంధనలకు లోబడి, పూర్తి పారదర్శకతతో తన విధులను నిర్వహిస్తోందని పునరుద్ఘాటించారు.

## రియల్ ఎస్టేట్ రిజిస్ట్రేషన్‌కు నాలుగు నెలల గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావం నేపథ్యంలో అన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లకు రేరా రిజిస్ట్రేషన్ చేసుకునే గడువును నాలుగు నెలలు పొడిగించారు. గృహ కొనుగోలుదారుల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్ట్‌లను సజావుగా పూర్తవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ రేరా అథారిటీ శుక్రవారం వెల్లడించింది. 2026, ఫిబ్రవరి 28 నాటికి లేదా ఆ తర్వాత పూర్తి కావాల్సిన రేరా రిజిస్టర్డ్ ప్రాజెక్ట్‌ల కాలపరిమితిని పొడిగించారు.

## 'ఉల్లాస్' ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్),'ఉల్లాస్' వయోజన విద్య పథకాలను మరింత బలోపేతం చేసేందుకు సంబంధిత శాఖలు, సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. టాస్, ఉల్లాస్, సమగ్ర శిక్ష, సెర్ప్, మెప్మా, ఎడ్యుకేట్ గర్ల్స్, ప్రథమ్ ప్రతినిధులతో హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగితారాణ మాట్లాడుతూ వివిధ కారణాలతో పాఠశాల మధ్యలో మానేసిన వారు, పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారిని గుర్తించి టాస్ ద్వారా విద్యాభ్యాసం పూర్తిచేసేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని నిరక్షరాస్యులను గుర్తించి 'ఉల్లాస్' ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సెర్ప్ కార్యదర్శి దివ్య దేవరాజన్ మాట్లాడుతూ సెర్ప్ ద్వారా గ్రామాల్లోని అర్హులైన అభ్యాసకులను గుర్తించి, టాస్, ఉల్లాస్ కేంద్రాల్లో చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమానికి స్వయం సహాయక సంఘాల మద్దతు ఎంతో అవసరమని ఏ.శ్రీనివాసరెడ్డి అన్నారు. పాఠశాల విద్యా శాఖ సంచాలకులు డాక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ వృత్తి విద్యా సిలబస్ పట్ల పాఠశాలల్లోని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియను మరింత సరళతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతేడాది నిర్దేశిత నమోదు లక్ష్యాలను చేరుకున్నామని, పలు నూతన విధానాలను అందుబాటులోకి తెచ్చామని సమగ్ర శిక్ష అదనపు రాష్ట్ర ప్రాజెక్ట్ డైరక్టర్ పివి శ్రీహరి వివరించారు. టాస్ అడ్మిషన్ల విధానం, ప్రతిపాదిత బోధనా ప్రణాళికలను ఓపెన్ స్కూల్ డైరక్టర్ కె.లింగయ్య వివరించారు. ఈ సమావేశంలో టాస్ జాయింట్ డైరెక్టర్ పీ.రాజీవ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

- అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వైనరీల ఏర్పాటుకు అవకాశం
- ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం.. స్థానికంగా ఉపాధి అవకాశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు. సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు.హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025–30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకుపైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌థ్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే 'గ్రేప్ స్టాం పింగ్' అనుభూతిని కూడా పొందవచ్చన్నారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరి జం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు.



## నల్లగొండ ఎక్స్ రోడ్స్ ఫ్లైఓవర్ ప్రారంభానికి..ముహూర్తమే తరువాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రూ.620 కోట్ల అంచనా వ్యయంతో 3.3 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్న నల్లగొండ ఎక్స్ రోడ్స్ ఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరుకున్నాయి. బిటి రోడ్డు పనులు పూర్తయ్యాయి. రోడ్డు మార్కింగ్‌లు, పెయింటింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే నల్లగొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఒవైసీ ఆస్పత్రి వరకు ట్రాఫిక్ సమస్యలు తీరి, ప్రస్తుతం పట్టే 35 నిమిషాల ప్రయాణ సమయం కేవలం 5 నిమిషాలకు తగ్గిపోనుంది.



## ఆరు రోజులుగా దొరకని దూబే ఆచూకీ



**కీవ్:** ఉక్రేన్‌లోని ఒడెసా నౌకాశ్రయం సమీపంలో డ్రోన్ దాడికి గురైన ఎంవి ఎజిఎన్ రాగ్నార్ అనే వాణిజ్య నౌకలో పనిచేస్తున్న భారతీయ నావికుడు రామ్ చంద్ర దుబే ఆచూకీ ఆరు రోజులుగా తెలియడం లేదు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాకు చెందిన 22 ఏళ్ల రామ్ చంద్ర ఇటీవలే మర్చంట్ నేవీలో చేరాడు. గత ఏడాది సెప్టెంబరులో తన రెండో విదేశీ విధి కోసం బయలుదేరిన ఆయన, ఈనెల 24 రాత్రి తన తల్లితో చివరిసారిగా మాట్లాడాడు. తమ నౌక ఉక్రేన్ నుంచి బయలుదేరిందని ఆ సందర్భంలో ఆమెకు తెలిపాడు. అయితే మరుసటి రోజే ఒడెసా నౌకాశ్రయం సమీపంలో నౌకపై డ్రోన్ దాడి జరిగింది. నౌకలో మొత్తం ఎనిమిది మంది సిబ్బంది ఉండగా, వారిలో నలుగురు భారతీయులు. దాడి సమయంలో ప్రాణాలు కాపాడుకోవడానికి భారతీయ సిబ్బంది సముద్రంలోకి దూకారు. ఉక్రేన్ సహాయక బృందాలు వెంటనే గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరు భారతీయులను సురక్షితంగా రక్షించాయి. అయితే దూబేతో పాటు మరో భారతీయ నావికుడి జాడ ఇంకా తెలియరాలేదు. స్పష్టమైన సమాచారం అందకపోవడంతో దూబే కుటుంబ సభ్యులు ఢిల్లీకి వెళ్లి షిప్పింగ్ కంపెనీ అధికారులను కలిశారు. మరోవైపు ప్రధానమంత్రి కార్యాలయం, విదేశాంగ మంత్రిత్వ శాఖను కూడా ఆశ్రయించి, ఉక్రేన్ అధికారులతో సమన్వయం చేసి గల్లంతైన నావికులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

## విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి

- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి: వి.హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల ఉద్యమంలో పాల్గొన్న వారిపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరీక్ష పేపర్ లీక్ ఘటన నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బిజెపి నాయకులు అభిషేక్‌ను తమ పార్టీలో చేరాలని ఒత్తిడి చేయడం, లేదంటే పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. విద్యార్థుల ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ వారు ధైర్యంగా పోరాడటంతోనే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు. హిందుత్వ పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి, అయోధ్య ఆలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని హనుమంతరావు ప్రశ్నించారు. ఈ అంశంపై చినజీయర్ స్వామితో పాటు ఇతర ఆధ్యాత్మిక గురువులు కూడా స్పందించాలని, విరాళాల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నర్సింగ్‌స్టాఫ్‌కు త్వరలోనే పోస్టింగ్

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు జెఎసి ప్రతినిధుల వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాన్సువాడ నర్సింగ్ స్టాఫ్‌ను త్వరలోనే పోస్టింగ్ ఇస్తామని, మిగతా అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీనిచ్చినట్టు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జెఎసి తెలిపింది. జెఎసి చెర్మన్ డాక్టర్ మధుసూదన్, కో చైర్మన్లు డాక్టర్ క్రాంతి, ఆదిలక్ష్మి, క్రిస్టఫర్, వీరమ్మ, బాలు నాయక్‌లతో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. బాన్సువాడలో సస్పెండైన నర్సింగ్ సిబ్బందిని తక్షణమే రీ ఇనిస్టిటు చేయాలని, మిగిలిన నర్సింగ్ పారామెడికల్ మినీ స్టేరియల్ స్టాఫ్ రీడిప్లమెంట్ చేయాలని కోరారు. అప్‌డేట్ అయిన హాస్పిటల్స్‌లో క్యాడర్ స్ట్రెంత్‌ను మంజూరు చేయాలని వారు కోరారు. వైద్య విధాన పరిషత్‌కు పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలన్నారు.

## క్షుద్రపూజలతో ప్రభుత్వానికి నష్టం చేయాలని బిఆర్ఎస్ కుట్ర

- ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్
- హరీష్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ క్షుద్రపూజలకు పాల్పడుతోందని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడం, రాష్ట్రంలో వర్షాలు కురవకుండా చేసి ప్రభుత్వ వ్యతిరేకత పెంచాలనే ఉద్దేశంతో తాంత్రిక పూజలు నిర్వహించారని ఆయన విమర్శించారు.సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శివమొగ్గ, తిరుచ్చిలోని జై అఘోర కాళీ ఆలయంలో మాజీ మంత్రి హరీష్ రావు తాంత్రిక పూజలు చేయించారనే సమాచారం తమ వద్ద ఉందని దయాకర్ పేర్కొన్నారు. అధికార దాహం, పదవీ వ్యామోహంతో బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రయోజనాలను కూడా పక్కన పెడుతున్నారని ఆరోపించారు. తెలంగాణకు నష్టం జరిగినా తమ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్న ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ఆరోపణలపై హరీష్ రావు వెంటనే ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా తాము ఆరోపణలు చేయడం లేదని, హరీష్ రావు మౌనం వహిస్తే ఆరోపణలు నిజమేనని ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం కూడా పరిశీలిస్తుందని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

## కార్మిక చట్టాలు, సంఘాలను కాలరాసే కుట్ర

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో కార్మిక చట్టాలను,కార్మిక సంఘాల హక్కులను కాలరాసేందుకు కుట్ర చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వమే కార్మికుల శ్రమను దోచుకుంటూ, ప్రైవేట్ శక్తులకు మార్గం చూపుతోందన్నారు. తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ కార్యక్రమం హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా 'ట్రేడ్ యూనియన్' లోగోను కవిత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో కార్మికులు, ఉద్యోగులు, టీచర్లకు అన్యాయం జరగనివ్వబోమని, తమ ట్రేడ్ యూనియన్‌ను కార్మిక లోకానికి అంకితం చేస్తున్నామన్నారు. కార్మికుల హక్కులు రక్షణ కోసం కార్మిక సంఘాల అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్మికులు, యువశక్తి లేని దేశం ముందుకు వెళ్లడం కష్టమన్నారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ పనిచేస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి, నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తెస్తోందన్నారు. ఈ చట్టాలను అమలు చేయబోమని బెంగాల్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు స్పష్టం చేశాయని, తెలంగాణ రాష్ట్రంలో కూడా కోడ్‌లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కవిత డిమాండ్ చేశారు.



## పేదింట్లో కొత్త వెలుగు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజల్లో ఆనందాన్ని నింపుతోందని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఎదులాబాద్ 7వ డివిజన్ ఘనపూర్, లింగాపురం గ్రామంలో అబ్ధిదారురాలు లింగాల భూలక్ష్మి , యాదగిరి నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తోందని రానున్న రోజుల్లో మరింత మందికి వాటిని చేరవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్ నాయక్, వేముల మమత గౌడ్, బద్దం గోపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేముల సత్తయ్య గౌడ్, గాయరు విశ్వనాథం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సంక్షేమం దిశగా కృషి

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, అలియాబాద్ పురపాలక సంఘాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపాలిటిలో సాధారణ సమావేశాన్ని చైర్ పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల అభివృద్ధికి సంబంధించిన సమస్యలు, ప్రజా అవసరాలను సమావేశం దృష్టికి తీసుకరాగా వాటిపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. మౌలిక వసతులను మెరుగుపరుచడం, కార్యాలయ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి అలియాబాద్ పురపాలక సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిదేద్దందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతిమాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## సురక్షిత వాతావరణంలోనే క్రీడాకారులకు శిక్షణ

### తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ చేపట్టిన సమగ్ర సేఫ్‌గార్డింగ్ పాలసీ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** క్రీడారంగంలో బాలికలు, మహిళా క్రీడాకారులకు భద్రతా వాతావరణాన్ని మెరుగుపరచే లక్ష్యంగా తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ సమగ్ర సేఫ్‌గార్డింగ్ పాలసీకి శ్రీకారం చుట్టింది. దీనిలోని భాగంగా శుక్రవారం హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో యునెస్కోకు చెందిన శ్రద్దా చిక్కేరూర్, యుగాంతర్ సంస్థకు చెందిన తేజస్విని మాడభూషి క్రీడా విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడుతూ తమ వ్యక్తిగత భద్రత, వేధింపుల విషయంలో నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయటంలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క క్రీడాకారునికి సురక్షితమైన, సమ్మిళితమైన, ప్రోత్సాహకరమైన క్రీడా వాతావరణాన్ని ఏర్పాటు చేయటమే ఈ పాలసీ లక్ష్యమని తెలిపారు. ప్రతి క్రీడాకారులు సురక్షిత వాతావరణంలో శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించే విధంగా ముందుకు వెళ్లేందుకు తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ కట్టుబడి ఉందని అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అనిత ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ మమత, పిఆర్ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగులో అంతర్‌పంటల పరిశీలన

**ప్రజాపక్షం/పరిగి :** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ తండాలో సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ సాగులో అంతర్ పంటలను జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ పరిగి మండలంలోని 1000 ఎకరాల అయిల్ ఫామ్ పంటకు రైతులను సన్నద్దం చేయాలన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగువల్ల అధిక లభాలను సంపాదించవచ్చు అనే విషయాన్ని రైతుల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ పంట కొనుగోలు రైతులకు అందుబాటులో ఉండే విధంగా పరిశ్రమ ను స్థాపించడం జరుగుతుందని రైతులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులను నీటి అనుకూలత విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు

## స్కైలార్క్ డయాగ్నస్టిక్స్ సెంటర్ తనిఖీ

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా కేంద్రంలో ఉన్న స్కైలార్స్ డయాగ్నస్టిక్స్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ అందిస్తూన్న నిర్ధారణ సేవల నాణ్యతతో పాటు,అమలులోఉన్న విధానాలు ,మౌలిక వసతులు ,పరిశుభ్రత ,రికార్డుల నిర్వహణ ,రోగులకు అందిస్తున్న సేవల నాణ్యతను పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాలను నిరంతర ం పాటిస్తూ ప్రజలకు సురక్షితమైన నాణ్యమైన సేవలు అందించేలా అవసరమైన సూచనలు జారీ చేయడం జరిగిందన్నా రు.

# 'సర్' లో వెనుకబడిన మేడ్చల్ మల్కాజిగిరి

### అసంతృప్తి వ్యక్తం చేసిన భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్






**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) నిర్వహణలో మేడ్చల్ మల్కాజిగిరి రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే వెనుకబడి ఉందని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. నిర్దేశిత గడువు త్వరలో ముగియనున్నందున పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని చేరుకునేందుకు పారదర్శకంగా, వేగవంతంగా ఇకనైనా బిఎల్ఓలతో సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాగానికి పలు కీలక ఆదేశాలు జారీచేసారు. జిల్లాలో కొనసాగుతు న్న 'సర్'లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, మ్యాపింగ్ ప్రక్రియల పురోగతిపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఇఆర్ఓ, ఎఇఆర్ఓలతో ఆయన జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కల్సి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మ్యాపింగ్ కానివి చాలా ఉన్నాయని, వీటిలో మరో ప్రాంతానికి వెళ్లి పోయిన ఓటర్లు అధికంగా ఉన్నారని, వారితో మాట్లాడి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన హెల్ప్‌సెంటర్లకు ఏ విధంగా ఓటర్లు స్పందిస్తున్నారని, ఫోన్ల ద్వారా అడిగే సందేహాలకు సరైన సమాధానాలిస్తూ వారి సందేహాలను ఏ మేరకు నివృత్తి చేస్తున్నారని అడిగి తెల్సుకొన్నారు. నోటీసులు జారీ చేయటంలోనూ జిల్లా వెనుక బడి ఉన్న విషయాన్ని గమనించామని, ప్రతి నోటీసును ఓటర్లకు అందించి ప్రతిస్పందనలను సేకరించాలని, పట్టికల ద్వారా వాటన్నింటిని పరిశీలించాలన్నారు. ఈ సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి సర్ ప్రక్రియ, మ్యాపింగ్ వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తూ నిర్దేశిత గడువులోగా లక్ష్యాన్ని చేరుకొంటామన్నారు. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఉన్న మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ అర్బన్ జిల్లా అని, 2011 జనాభా లెక్కల ప్రకారం 24.60 లక్షల జనాభా 2025 నాటికి 48 లక్షలకు చేరుకొందని వివరించారు.



**ప్రభుత్వ భవనాల్లోనే పోలింగ్ కేంద్రాలు**

పోలింగ్ కేంద్రాలన్నిటిని ఖచ్చితంగా ప్రభుత్వ భవనాల్లోనే కొనసాగించాలని, గతంలో ప్రయివేట్ భవనాల్లో కొనసాగిన పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్లకు మార్చాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి 1200ఓటర్లను ప్రామాణికంగా తీసుకొని హేతుబద్దీకరణ చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, ఇతర సవరణలు చేసే ముందు తప్పనిసరిగా ఆయా ప్రాంత రాజకీయ ప్రతినిధులకు తెలియచేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఇఆర్ఓలు వెంకటరెడ్డి, సంచిత్ గంగ్వార్, పింకేష్ కుమార్, రాధికా గుప్తా, మయాంక్ సింగ్, డిఆర్డిఓ మాలతి, తదితరులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్‌కుమార్ జిల్లా అధికారులతో కల్సి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తిమ్మాయిపల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని దూలపల్లి ప్రాంతాల్లో బిఎల్ఓలు చేస్తున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, వాటిని తిరిగి సేకరిస్తున్న విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించి బిఎల్ఓలు, ఓటర్లతో మాట్లాడి తెల్సుకొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పర్యావరణ పరిరక్షణతో పాటు మన పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. చర్లపల్లిలోని మేధా సర్వో డ్రైవ్ సంస్థలో శుక్రవారం సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కులు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతాల్లో కాలుష్య నివారణకు ప్రణాళికాయుక్తంగా ఆయా సంస్థ యాజమాన్యాలు వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటాలని, నాటటమే కాక వీటిని సంరక్షించి ఎదిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరచు వనమహోత్సవ కార్యక్రమాలను ఏర్పాటు చేయటం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జెడి, జిఎం డి.వినయ్‌కుమార్, డిప్యూటి చీఫ్ ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్‌రెడ్డి, ఫ్యాక్టరీల శాఖ ప్రతినిధి శ్రీ విద్య, డిప్యూటి డైరెక్టర్ రఘునాథ్, మేధా సర్వో సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా ఎన్.జగన్**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా ఎన్.జగన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయ న జిల్లా కలెక్టర్ మనుచౌదరిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు.

**పదవీ విరమణ**

డిఆర్‌డిలో 23 ఏళ్లుగా విధులు నిర్వహించిన కమ్యూనిటి కోఆర్డినేటర్ సెర్ప్ ఉద్యోగి శుక్రవారం పదవీ విరమణ చేసారు. ఈ సందర్భంగా డిఆర్డీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమం లో జిల్లా అభివృద్ధి అధికారి సాంబశివరావు, టిజిఓస్ జిల్లా అధ్యక్షుడు వినోద్, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, జిల్లా సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు తరుచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి : అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు తరుచు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని దీంతో వారి ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించే అవకాశం ఉందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని కేశవరంలో హైద్రాబాద్ భారత్ లిమిటెడ్ ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో రోహిణి పౌండేషన్ ఆధ్వర్యంలో దంత వైద్యం, మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో విద్యార్థులకు డెంటల్, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి. ఎంఇఓ భాగ్యమణి, కౌన్సిలర్లు కొంపల్లి మాధవి భూమేష్‌గౌడ్, బొమ్మలపల్లి మల్లేష్‌యాదవ్, ఉపాధ్యాయుడు సుబ్బారావు, వైద్య బృందం, రోహిణి ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ దూరవిద్య దరఖాస్తులకు గడువు పొడిగింపు

### సిఆర్పీఎఫ్ డిఐజిపి డాక్టర్ బి.వీర్రాజు

**ప్రజాపక్షం/జవహార్ నగర్ :** సిఆర్పీఎఫ్ క్యాంపస్ అంబేద్కర్ దూరవిద్యా కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడగిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీఆర్పీఎఫ్ డీఐజీపీ డాక్టర్ బి. వీర్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ మధ్యలో చదువును ఆపేసిన వారికి సువర్ణావకాశమని, దూరవిద్య ద్వారా చదువును కొనసాగించవచ్చని తెలిపారు. బీఏ, బీకామ్ కోర్సులు ఏర్పాటు చేశామన్నారు. మరిం త సమాచారం కోసం స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ హరిశంకర్‌ను సంప్రదించాలన్నారు. 7 ఆగస్టు, 2026లోగా దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

## శాఖల సమన్వయంతోనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం

### అదనపు కలెక్టర్ జిల్లా పరిషత్ సిఇఓ సుధీర్




**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హుడికి సమర్థవంతంగా చేరేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సిఇఓ సుధీర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వ యం, తక్షణ స్పందన, బాధ్యతాయుతమైన పనితీరు అత్యంత కీలకమని ఆయన అన్నారు. శుక్రవారం నవాబుపేట్ మండల కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి సమీక్ష సమావేశం, సమర్థ వృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ శాఖల అధికారుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ వ్యవసాయం, విద్యుత్, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలపై శాస్త్రీయ సూచనలు అందించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు పంటల ఎంపిక, నీటి వినియోగంపై వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో మార్గనిర్దేశనం చేయాలని చెప్పారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తమ పనితీరును మెరుగుపరచుకుని దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. మండలంలోని పలు ప్రధాన రహదారులు అధ్వాన్నం గా ఉండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. సర్పంచులు, మండల స్థాయి అధికారు లు, పంచాయతీ కార్యదర్శులు పరస్పర చర్చా వేదికలు ఏర్పాటు చేసుకుని సమన్వయం తో సమస్యలను పరిష్కరించుకోవాలని సుధీర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అనురాధ, డిప్యూటీ తాసిల్దార్ నవీన్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామ్ రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## యాప్రాల్, ఇసిఐఎల్ మీదుగా చర్లపల్లికి బస్సులు నడపాలి

### ప్రయాణీకుల ఇక్కట్లపై ఆర్టీసీ ఇడికి సిపిఐ వినతిపత్రం

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** నూతనంగా అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రయాణీకుల సౌకర్యార్థం నగరంలోని పలు ప్రాంతాల నుంచి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టిఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు వారు ఒక వినతిపత్రం సమర్పించారు. రిసాలబజార్, కౌకూర్, యాప్రాల్, ఈసీఐఎల్ పరిసర ప్రాంతాల మీదుగా చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు నూతన బస్సు రూట్‌పై సర్వే నిర్వహించి, బస్సులను ప్రారంభించాలి. ఆయా ప్రాంతాల్లో కళాశాలలు, కంపెనీలు అధికంగా ఉండటం వల్ల విద్యార్థులకు, కార్మికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో సికింద్రాబాద్ నుంచి యాప్రాల్ వరకు నడిచే 24వ నంబర్ బస్సు ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. అయితే దాన్ని బాలాజీ నగర్, సీఆర్పీఎఫ్ వరకు పొడిగించినప్పటి నుంచి యాప్రాల్ అమ్ముగూడెం మధ్య బస్సులు సరిగా ఆపడం లేదు. బస్సులు ఆపకపోవడం వల్ల వృద్ధులు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కావున పాత పద్ధతిలోనే సికింద్రాబాద్–యాప్రాల్ మధ్య బస్సులను యథావిధిగా కొనసాగించాలి. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు, మండల సహాయ కార్యదర్శి వై.వెంకటేష్, మండల కార్యవర్గ సభ్యులు పి.చంద్రయ్య, బి.నరేందర్ చారి, ఆర్.నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.




## భవిష్యత్ కంప్యూటింగ్‌కు అనురాగ్ వేదిక

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** భవిష్యత్ కంప్యూటింగ్ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై చర్చలకు వేదికగా అనురాగ్ యూనివర్సిటీ కంప్యూటింగ్‌ది ఫ్యూచర్ ప్రధానాంశంతో ఐఈఈఈ సదస్సు ప్రారంభమైంది. విద్యావేత్తలు పరిశ్రమ నిపుణులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ విజయ్ కుమార్, కంప్యూటర్ సైన్స్ డీన్ డాక్టర్ విష్ణుమూర్తి ఐఈఈఈహెడ్ డాక్టర్ మహేష్ నార్తి, మోహన్ రాయుడు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ అర్చనా మంత్రి, ఐఈఈఈ వైస్ చైర్ బాల ప్రసాద్, ముఖ్య అతిథి ఎన్‌జీపీఎల్ నారాయణ, డాక్టర్ ఎం సంధ్యారాణి,డాక్టర్ పద్మసాయి జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. డాక్టర్ మహేష్ నార్తి కృత్రిమ మేధస్సు సైబర్ భద్రత, క్వాంటం కంప్యూటింగ్ వంటి సాంకేతికతల ప్రాధాన్యాన్ని వివరించారు. మోహన్ రాయుడు నిరంతర అభ్యాసం ఐఈఈఈ సభ్యత్వం అవసరాన్ని ప్రస్తావించగా డాక్టర్ అర్చనా మంత్రి ప్రపంచస్థాయి సాంకేతిక అవకాశాలను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌జీపీఎల్ నారాయణ బాధ్యతాయుతమైన ఆవిష్కరణలపై దృష్టి సారించారు .సందీప్ శ్రీవాస్తవ కెరీర్ అభివృద్ధిపై అర్షద్ దినేష్ దేవానీ కృత్రిమ ముధస్సు లూప్ ఇంజినీరింగ్‌పై సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. డాక్టర్ ఎం. సంధ్యారాణి వందన సమర్పణ చేయగా ఏ దుర్గా భవాని, సంతోష్, మిరియాని పాల్గొన్నారు.




## 80 మంది బాలకార్మికులకు విముక్తి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఆపరేషన్ ముస్కాన్12లో భాగంగా ఉప్పల్ సబ్ డివిజన్ బాలల రక్షక విభాగం ఉప్పల్ ఎసిపి వెంకటరెడ్డి, ఉప్పల్ ఇనస్పెక్టర్ రామలింగారెడ్డిల ఆధ్వర్యంలో 80మంది బాలకార్మికులను రక్షించారు. నాచారం, ఉప్పల్, కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లలో బాలకార్మిక చట్టం కింద వారితో పని చేయించుకొన్నందుకు గాను సంబంధిత యజమానులను సిడబ్ల్యుసి బాలుర రక్షక భవనం చైర్‌పర్సన్ ఎదుట హాజరు పరచగా బాలకార్మికులకు జరిమానాల రూపంలో చెల్లించాలంటూ ఆదేశించారు.

## బైక్ సీజ్ చేశారని కేర్ టేకర్ ఆత్మహత్య

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ఫైనాన్స్ ఏజెంట్లు బైక్‌ను జప్తు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటన యాప్రాల్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... యాప్రాల్ కింది బస్తీకి చెందిన శ్రీరాములు శ్రీధర్ (40)(తండ్రి నర్సింగ్) గత కొంతకాలంగా కేర్‌టేకర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా,10 రోజుల క్రితం శ్రీధర్‌కు చెందిన యాక్టివా 125 ద్విచక్ర వాహనాన్ని ఫైనాన్స్ నిర్వాహకులు జప్తు చేసి తీసుకువెళ్లారు. బైక్ పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీధర్ గత కొద్ది రోజులుగా తీవ్ర డిప్రెషన్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే గురువారం (జులై 30) సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి శ్రీధర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. పని ముగించుకుని ఇంటికి వచ్చిన భార్య సరిత, భర్త ఫ్యాన్‌కు వేలాడుతుండటం చూసి దిగ్భ్రాంతికి గురైంది. వెంటనే ఆయనను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



## సోషల్ సర్వీస్ కింద స్వచ్ఛ భారత్ శిక్ష విధించిన కోర్టు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** సమయానికి మించి ఫుడ్ కోర్టును నడుపుతున్న వ్యక్తికి కోర్టు శిక్షను విధించిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలో వెంకటేశ్వర ఫుడ్ కోర్టును సమయానికి మించి నడుపుతున్న ప్రవీణ్(34)పై ఈ కేసు నమోదు చేశారు. కుషాయిగూడ జిల్లా కోర్టు 5వ స్పెషల్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా అట్టి వ్యక్తిపై సోషల్ సర్వీస్‌లో భాగంగా స్వచ్ఛ భారత్ శిక్షను విధించగా చర్లపల్లి పోలీసులు శిక్షను అమలుపర్చారు.

## కానిస్టేబుల్ ఇర్షద్ అలీకి ఘన సన్మానం




**ప్రజాపక్షం/నవాబుపేట్ :** పోలీస్ శాఖలో దశాబ్దాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించి, ప్రజల అభిమానాన్ని సంపాదించిన నవాబుపేట్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఇర్షద్ అలీ పదవీ విరమణ సందర్భంగా భావోద్వేగ వాతావరణం నెలకొంది. సహచర అధికారులు, సిబ్బంది ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ ఘనంగా సన్మానించి, విశిష్ట సేవలకు ప్రశంసలు అందజేశారు. నవాబుపేట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఇర్షద్ అలీ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం నిజాయితీ, క్రమశిక్షణతో సేవలందించిన ఇర్షద్ అలీ సేవలను అధికారులు కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకిత భావం, ప్రజలతో స్నేహపూర్వక వ్యవహారం, శాఖ అభివృద్ధికి చేసిన కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఇర్షద్ అలీకి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంత రం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
01-08-2026
www.prajapaksham.in

“హీరో విజయ్ దేవరకొండ 10 ఏళ్ల అద్భుతమైన కెరీర్‌ను కంప్లీట్ చేసుకున్నారు. ఆయన సోలో హీరోగా నటించిన తొలి సినిమా ‘పెళ్లి చూపులు’. 2016 లో రిలీజైంది. అప్పటికే ‘ఎవడే సుబ్రహ్మణ్యం’ సినిమాలో నటించి విజయ్ పేరు తెచ్చుకున్నారు.”




## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ‘క్రేజీ కళ్యాణం’




నరేష్ విఐ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్డి, రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ‘క్రేజీ కళ్యాణం’. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్దిప్ప గాజుల రూపొందిస్తున్నారు. ‘క్రేజీ కళ్యాణం’ సినిమా టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. 1న ఈ సినిమా టీజర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ‘క్రేజీ కళ్యాణం’ సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి ‘క్రేజీ కళ్యాణం’ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. 1న రిలీజ్ కాబోతున్న టీజర్ హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై మరింత క్రేజ్ పెంచబోతోంది. నరేష్ విఐ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ జె.గాయత్రి దేవి, ఆర్ట్ డైరెక్టర్ సాయి కదిర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి శ్రీమూర్తి, కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి, యాక్షన్ డ్రాగన్ ప్రకాష్, లిరిక్స్ గోరేటి వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్, ఎడిటర్ శ్రావణ్ కటికనేని, డిఓపి శ్యామ్ దూపాటి, మ్యూజిక్ సురేష్ బొబ్బిలి.

## పదేళ్ల సినీ ప్రయాణం



హీరో విజయ్ దేవరకొండ 10 ఏళ్ల అద్భుతమైన కెరీర్‌ను కంప్లీట్ చేసుకున్నారు. ఆయన సోలో హీరోగా నటించిన తొలి సినిమా ‘పెళ్లి చూపులు’. 2016 లో రిలీజైంది. అప్పటికే ‘ఎవడే సుబ్రహ్మణ్యం’ సినిమాతో సోలో హీరోగా అరంగేట్రం చేశారు. మొదటి చిత్రంతోనే ప్రేక్షకుల ప్రేమాభిమానాలు సంపాదించుకుని, బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కొట్టారు. ఈ సినిమా విజయంతో ఆయన వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. టాక్సీవాలా, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ఫ్యామిలీ స్టార్, ఖుషి, కింగ్‌డమ్ ఇలా..వరుసగా సక్సెస్ ఫుల్ సినిమాలు చేస్తూ పాన్ ఇండియా స్టార్ గా ఎదిగారు. ప్రభాస్ కల్కి సినిమాలో అర్జునుడి పాత్రలో స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చారు. భారీ చిత్రాలు చేస్తూ పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సినిమా రెస్పాన్స్ పెరగడంలో తన వంతు కృషి చేస్తున్నారు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా చిన్న సినిమాతో కెరీర్ మొదలుపెట్టి పెద్ద స్టార్‌గా ఎదిగిన విజయ్ ప్రస్థానం ఎంతోమంది కొత్త వాళ్లకు ఇన్స్పిరేషన్ గా నిలుస్తోంది. మరే హీరో చూడనంత వెర్సటైల్ కెరీర్ చూశారు. రౌడీ వేర్ బ్రాండ్ తో ఒక వ్యాపారవేత్తగా సక్సెస్ ఫుల్ గా కొనసాగుతూనే, ది దేవరకొండ ఫౌండేషన్‌తో పేద మధ్య తరగతి వారికి సహాయ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల మహబూబ్ నగర్ జిల్లాలో ప్రతిభ గల 180 మంది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించారు. ఈ సినిమా డిసెంబర్‌లో రిలీజ్‌కు రెడీ అవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్ నిర్మాణంలో రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో రణబాలి సినిమాలో నటిస్తున్నారు విజయ్. భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోన్న రణబాలి సెప్టెంబర్ 11న రిలీజ్ కాబోతోంది. ఇక విజయ్ సినిమాల్లో మోస్ట్ అవెటెడ్ గా మారుతోంది వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్, దర్శకుడు శౌర్యువ్‌తో చేస్తున్న సినిమా. ఈ చిత్రానికి పలువురు పేరున్న హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేస్తుండటం విశేషం. ఇప్పుడు విజయ్ చేస్తున్న ఈ మూడు సినిమాలు స్టార్ గా ఆయనను మరింత గొప్ప స్థాయికి చేరుస్తాయనే అంచనాలు ఏర్పడుతున్నాయి.

## ‘ఐ యామ్ గేమ్’ ట్రైలర్ రిలీజ్



దుల్కర్ సల్మాన్ ప్రతిష్టాత్మక చిత్రం ‘ఐ యామ్ గేమ్’ ట్రైలర్ విడుదలైంది. జూనియర్ ఎన్టీఆర్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టారు. ఐయామ్‌గేమ్ ట్రైలర్లోని ఆ ఫైర్ వైబ్ నాకు బాగా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు ఎంతో గ్రిప్పింగ్‌గా, ఎంగేజింగ్‌గా సాగింది. నా సోదరుడు దుల్కర్ మరో స్పెషల్ మూవీతో వస్తున్నారని నమ్మకం కలిగింది. తనకి మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అతనితో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రం ఆగస్టు 20న ఓణం కానుకగా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్, ఆయన కెరీర్లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాజిర్ బాబా, ఇస్మాయిల్ అబూబక్కర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా, సాజిర్ బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు.దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లోకేషన్లలో చిత్రీకరించిన ‘ఐ యామ్ గేమ్’, ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ చిత్ర సంగీత హక్కులను జీ మ్యూజిక్ సొంతం చేసుకోగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. యాక్షన్ సీక్వెన్స్‌లను అన్బరివ్ మాస్టర్స్ కొరియోగ్రఫీ చేశారు. దుల్కర్ సల్మాన్ కెరీర్లో 40వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్లో ఆంటోనీ వర్గీస్, తమిళ నటుడు దర్శకుడు మిస్కిన్, కాయదు లోహర్, కథిర్, పార్థ్ తివారీ, తమిళ నటి సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘ఐ యామ్ గేమ్’ మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ఆగస్టు 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 7న వస్తున్న ‘అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి’



జిఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజ రెడ్డి నిర్మించిన విభిన్న ప్రేమకథా చిత్రం ‘అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి’. లండన్‌లో వైద్య విద్య అభ్యసిస్తున్న పవన్ మహావీర్ ఈ చిత్రంలో హీరోగా నటించడం విశేషం. శివాల ప్రభాకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వర్షిక, సుహానా హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్య కృష్ణ, సుజాత తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ హీరో ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. నిర్మాత జి. శైలజరెడ్డి మాట్లాడుతూ ‘అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి అద్భుతంగా వచ్చిందుకు సహకరించిన మా సీనియర్ హీరో సుమన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ చిత్రాన్ని 7న విడుదల చేస్తున్నాం. అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాం’ అని అన్నారు. సీనియర్ హీరో సుమన్ మాట్లాడుతూ ‘అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి’ లో నేను ఒక ముఖ్య పాత్ర పోషించాను. సినిమా చాలా బాగా వచ్చింది. పవన్ మహావీర్ కి ఇది పరిచయచిత్రమంటే నాకే నమ్మబుద్ధి కాలెదు. అలాగే నిర్మాత శైలజ రెడ్డి కూడా పదిపదిహేను సినిమాలు తీసిన అనుభవజ్ఞురాలైన నిర్మాతలా ప్రాజెక్ట్ ను అద్భుతంగా హ్యాండిల్ చేశారు. కోడి రామకృష్ణ దర్శకత్వంలో నేను హీరోగా నటించిన పలు చిత్రాలకు కోడైరెక్టర్‌గా పనిచేసిన శివాల ప్రభాకర్ ఈ చిత్రాన్ని చాలా గొప్పగా తీర్చిదిద్దారు అన్నారు




## ‘సుధీర్స్ జోకర్’లో గాయత్రీ దేవిగా అభిరామి

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘సుధీర్స్ జోకర్’. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ’పరదా’ లాంటి విభిన్నమైన చిత్రం తర్వాత ఆనంద మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ శ్రీనివాసులు పి.వి. విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో ప్రముఖ నటి అభిరామి నటిస్తున్నట్లు ప్రకటించారు. ‘సుధీర్స్ జోకర్‘ సినిమాలో అభిరామి గాయత్రీ దేవి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. ఈ అనౌన్స్ మెంట్ సందర్భంగా అభిరామి పోషిస్తున్న గాయత్రీ దేవి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇటీవల రిలీజ్ చేసిన ‘సుధీర్స్ జోకర్’ మూవీ బ్యాంగర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్ ధర్మేంద్ర కాకర్ల, సినిమాటోగ్రఫీ అహ్మద్ షెరీఫ్, మ్యూజిక్ లియోన్ జేమ్స్.

## ‘నేను ప్రేమికుడ్ని’ ఫస్ట్ లుక్ విడుదల



ఆల్మైటి క్రియేషన్స్ బ్యానర్ లో శ్రీ వి చిన్న శ్రీశైలం యాదవ్ సమర్పణలో వడిగేపల్లి కృష్ణ నిర్మాతగా వి రమేష్ యాదవ్, కాకర్లమూడి రామకృష్ణ సహా నిర్మాతలుగా రామ్ భారధరం దర్శకత్వంలో దేవరపల్లి రేవంత్, ఎల్సా ఘోస్ హీరో హీరోయిన్లు గా తెరకెక్కుతున్న చిత్రం నేను ప్రేమికుడ్ని. ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగింది ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కోదండరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నేను ప్రేమికుడ్ని ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కోదండరామిరెడ్డి మాట్లాడుతూ ‘మంచి కాన్సెప్ట్ తో రాబోతున్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలి అన్నారు. హీరో రేవంత్ దేవరపల్లి మాట్లాడుతూ ’లవ్, హారర్ ఎలిమెంట్స్ తో రాబోతున్న మా సినిమా ఫస్ట్ లుక్ కోదండరామిరెడ్డి విడుదల చెయ్యడం సంతోషంగా ఉంది. త్వరలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది, నేను ప్రేమికుడ్ని సినిమా అందరికి నచ్చే ఫ్యామిలీ సినిమా అవుతుంది అన్నారు. సహా నిర్మాత రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ చిత్రం మంచి కథతో తెరకెక్కించారని అన్నారు. టైటిల్ కూడా ఇప్పటి జనరేషన్ కు తగ్గట్టుగా పెట్టారని అన్నారు. తప్పకుండ ఈ చిత్రం సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉందన్నారు. కోదండరాంరెడ్డి ట్రైలర్ విడుదల చేయడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రసాద్ ఈదర, ఎడిటర్ నందమూరి హరి, ఆర్ట్ విజయకృష్ణ, ఫైట్స్ అవినాష్, డాన్స్ బండ్ల రామారావు.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై ‘లైంగిక దాడి కేసు’

### పెళ్లి పేరుతో యువ జర్నలిస్టుతో కలిసి ఉన్న వైనం

**ప్రజాపక్షం / హైదరాబాద్:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్ల పాటు లైంగికంగా వాడుకున్నాడని ఆరోపిస్తూ ఓ మాజీ ఎమ్మెల్యేపై యువ జర్నలిస్టు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 69, 351(2) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల రిమాండ్ నివేదికలో పేర్కొన్న వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 22 ఏళ్ల యువతి మీడియా రంగంలో పనిచేస్తోంది. 2022లో ఇంటర్వ్యూ నిమిత్తం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును కలిసిన సమయంలో పరిచయం ఏర్పడిందని, అనంతరం యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేస్తానని చెప్పి తనను దగ్గర చేసుకున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి అమీర్‌పేట్‌లోని ఓ ఫ్లాట్‌లో తనతో సహజీవనం చేశాడని, హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ అక్కడే ఉండేవాడని తెలిపింది. ఈ క్రమంలో తన వ్యక్తిగత ఫొటోలు తీసి, వాటితో బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు లైంగికంగా వేధించాడని ఆరోపించింది. 2025 మధ్య వరకు ఈ సంబంధం కొనసాగిందని పేర్కొంది.అలాగే రియల్ ఎస్టేట్ పెట్టుబడి పేరుతో తన వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని, తర్వాత తనను పూర్తిగా దూరం పెట్టాడని ఫిర్యాదులో వెల్లడించింది. అనంతరం తన స్నేహితులతో కూడా తనకు తెలియకుండా సంబంధాలు కొనసాగించాడని ఆరోపించింది. 2026లో తన ఆరోగ్య, ఆర్థిక సమస్యల నేపథ్యంలో సన్నిహితుల ద్వారా మాజీ ఎమ్మెల్యే అనుచరులతో చర్చలు జరిగాయని, ఈ క్రమంలో తన ఖాతాలో రూ.8.50 లక్షలు జమయ్యాయని తెలిపింది. అయితే డబ్బు తిరిగి రావడం తన ప్రధాన ఉద్దేశం కాదని, పెళ్లి పేరుతో మోసం చేసి లైంగికంగా దోపిడీ చేయడమే అసలు అంశమని ఫిర్యాదులో స్పష్టం చేసింది. తనకు లేదా తన కుటుంబ సభ్యులకు ఎలాంటి బెదిరింపులు రాకుండా రక్షణ కల్పించాలని కూడా పోలీసులను కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నర్సింగ్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆయిల్ పామ్ కంపెనీలకు మంత్రి తుమ్మల వార్నింగ్

### లక్ష్యాలు చేరకపోతే కఠిన చర్యలు.. అవసరమైతే కంపెనీల తొలగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో విఫలమైతే జిల్లాల కేటాయింపులను తగ్గించడం, అవసరమైతే కంపెనీలను పూర్తిగా తొలగించడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం 17,090 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైందని, ఇది తీవ్ర నిరాశ కలిగించే విషయమన్నారు. రైతులు ముందుకు వస్తున్నా కంపెనీలు అలసత్వం ప్రదర్శించడం ఆమోదయోగ్యం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు సరిగా లేని పలు కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదని తెలిపారు. మెరుగైన పనితీరు చూపని కంపెనీల పరిధిలోని జిల్లాలను తగ్గించి సమర్థవంతంగా పనిచేసే సంస్థలకు అప్పగిస్తామని, ప్రభుత్వ సంస్థ ఆయిల్ ఫెడ్‌కూ ఎలాంటి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.ఆగస్టు నెలలో మొక్కల కొరత రాకుండా అవసరమైతే ఇతర కంపెనీల నుంచి మొక్కలు కొనుగోలు చేసి రైతులకు వెంటనే అందించాలని ఆదేశించారు. అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సహాయం అందించడంతో పాటు నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లను నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీల ప్రతినిధులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

## గోదావరి వరదపై అప్రమత్తంగా ఉండాలి

### ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో, పరివాహక ప్రాంత ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో మంత్రి టెలిఫోన్‌లో మాట్లాడారు. గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, భద్రాచలం వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, నిర్లక్ష్యానికి తావివ్వకుండా అవగాహన కల్పించాలన్నారు. జలాశయాలకు భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో మధ్యాహ్నానికి నీటి మట్టం 48 అడుగులకు చేరుకుందని, 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

## టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ డైరక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అడిషనల్ డిఎంఈ డాక్టర్ ఎన్.వాణిని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా నియమించింది. కాగా వాణికి గతంలోనూ డీఎంఈగా కొంతకాలం పనిచేసిన అనుభవం ఉంది. జాతీయ నాయకుడు, తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఒక వైద్యునిగా, రాజకీయ నాయకునిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఆయన జీవితాంతం ప్రజల కోసం పనిచేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి పేరును సనత్‌నగర్ టిమ్స్‌కు పెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నరేంద్ర కుమార్‌కు ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణాత్మక దశలో ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఆయనకు ఇన్‌చార్జ్ డైరక్టర్గా బాధ్యతలు అప్పగించామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. టిమ్స్‌ను అత్యున్నత ప్రమాణాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చిదిద్ది, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వివరించారు.

## మరోసారి ‘సర్’ పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు 77.12 శాతం సర్వే ప్రక్రియ పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. హైదరాబాద్‌లో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43 శాతం, మేడ్చల్‌మల్కాజిగిరిలో 61.37 శాతం మాత్రమే పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వేయే గడువు పొడిగింపునకు ప్రధాన కారణంగా చెబుతున్నారు.

**బిఎల్‌ఓల ఇంటింటి సర్వే**

ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి బాధ్యతలను వీరు నిర్వర్తిస్తున్నారు.

### సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ఇలా ఉంది..

ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు చివరి తేదీ : ఆగస్టు 10
పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ : ఆగస్టు 10
ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ : ఆగస్టు 17
క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణ : ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16
క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం : ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు
తుది ఓటరు జాబితాల ప్రచురణ : అక్టోబర్ 19.

## కోల్‌కతాకు తస్లీమా నస్రీన్

(మొదటి పేజీ తరువాయి)

రచనలపై జరిగిన హింసాత్మక నిరసనల కారణంగా నవంబర్ 27న నగరాన్ని విడిచి వెళ్లవలసి వచ్చినప్పటి నుండి, ఆమె ఇక్కడకు తిరిగి రావడం కోల్‌కతాకు ఇది ఆమె మొదటి పర్యటన. బంగ్లాదేశ్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత, తనకు సొంత ఇంటిలా అత్యంత సన్నిహితమైనదిగా ఆమె తరచుగా అభివర్ణించే ఈ ప్రదేశానికి తెరపడింది. తస్లీమా నస్రీన్ రవీంద్ర సదన్‌లో జరిగే ఛాందసవాద వ్యతిరేక సాహిత్య కార్యక్రమంలో ఆమె తన కవిత్వాన్ని పఠించి, అనంతరం తొలిసారిగాబహిరంగంగా కనిపించనున్నారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి, ప్రముఖ రచయిత శిర్షేందు ముఖోపాధ్యాయ తదితరులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అయితే, దీనిని ఒక సాహిత్య సమావేశంగా తలపెట్టబడినప్పటికీ, పశ్చిమబెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొన్ని నెలల తర్వాత భావ ప్రకటనా స్వేచ్ఛ, లౌకికవాదం, మతపరమైన సున్నితత్వాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వైఖరిపై చర్చలు మళ్లీ మొదలవుతున్న తరుణంలో జరిగే ఈ కార్యక్రమం అనివార్యంగా రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.తన పర్యటనకు ముందు, కోల్‌కతాకు తిరిగి రావడం ‘నా సొంత దేశానికి తిరిగి వచ్చినట్లు అనిపిస్తోంది’ అని తస్లీమా నస్రీన్ ‘పిటిఐ’కి తెలిపారు. నేను నా సొంత దేశానికి తిరిగి వస్తున్నట్లు భావిస్తున్నాను. బెంగాల్ నా హృదయంలో ఉన్నదూ సరిహద్దుతోగానీ, ముళ్ల కంచెతో గానీ విభజించబడలేదు. బెంగాల్ తూర్పు భాగానికి నాకు తలుపు ఇంకా మూసే ఉంది. ప్రస్తుతానికి బెంగాల్‌లోని ఈ భాగమే నా ఇల్లు’ అని ఆమె తెలిపారు. తాను ఆనందంతో పాటు, బాధతో కూడా ఇక్కడకు తిరిగి వస్తున్నానని తస్లీమా చెప్పారు. శనివారం నాటి కార్యక్రమం ఒక రాజకీయ వేదికగా ఉపయోగపడటానికే కాకుండా మత ఛాందసవాదానికి రచయిత్రి తస్లీమా నస్రీన్ జీవితకాలం పాటించిన వ్యతిరేకతను గౌరవించడానికి, భావ ప్రకటనా స్వేచ్ఛ సూత్రాన్ని పునరుద్ఘాటించడానికి ఉద్దేశించినదని నిర్వాహకులు స్పష్టం చేశారు.

## హమాస్ ఓకె

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. 1987లో ఏర్పడినప్పటి నుంచి ఈ సంస్థ ఇజ్రాయెల్‌పై సాయుధ పోరాటాన్ని తన ప్రధాన సిద్ధాంతంగా కొనసాగిస్తోంది. రాకెట్లు, యాంటీ ట్యాంక్ క్షిపణులు, పేలుడు పదార్థాలు, సొరంగాల వ్యవస్థ వంటి వాటిని తన సైనిక సామర్థ్యంలో కీలక భాగంగా భావిస్తోంది. అందువల్ల ఆయుధాలను వదులుకోవడం హమాస్ అంతర్గతంగా కూడా పెద్ద నిర్ణయంగా మారనుంది. ఒప్పందం ప్రకారం గాజాలో పనిచేసే పోలీసు బలగాల వద్ద ఉన్న ఆయుధాలను అమెరికా మద్దతుతో ఏర్పడే పాలస్తీనియన్ సాంకేతిక కమిటీకి అప్పగించాలి. ఆ తర్వాత భారీ ఆయుధాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, సొరంగాల వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియ అంతర్జాతీయ స్థిరీకరణ బలగాల రాకడ, ఇజ్రాయెల్ సైన్యం దశలవారీ ఉపసంహరణలతో అనుసంధానమై ఉంటుంది. అయితే ఇజ్రాయెల్ ఈ ఒప్పందంపై ఇంకా జాగ్రత్తగా ఉంది. హమాస్ నిజంగా ఆయుధాలను వదులుతుందా? లేక గాజాపై తన నియంత్రణను పూర్తిగా వదులుకుంటుందా? అనే విషయంలో ఇజ్రాయెల్‌కు అనుమానాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ అధికారులు స్పష్టం చేసిన ప్రకారం, హమాస్ పూర్తిగా నిరాయుధీకరణకు లోబడే వరకు గాజాలో తాము నియంత్రిస్తున్న ప్రాంతాల నుంచి వెనక్కి వెళ్లబోమని చెబుతున్నారు. అమెరికా, టర్కీ, ఈజిప్ట్, ఖతర్ ఈ ఒప్పందానికి మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి. అయితే హమాస్ వద్ద ఉన్న భారీ ఆయుధాలు, సొరంగాల నిర్మూలనకు నెలల నుంచి సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొందరు అమెరికా అధికారులు ఈ ప్రక్రియకు 200 నుంచి 350 రోజుల వరకు సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేయడంతో ప్రారంభమైన ఈ యుద్ధంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో గాజాలో భారీ ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం జరిగింది. ప్రస్తుతం ప్రతిపాదించిన ఒప్పందం యుద్ధానికి ముగింపు దిశగా ఒక అవకాశం కల్పిస్తున్నప్పటికీ, దాని విజయవంతమైన అమలు హమాస్, ఇజ్రాయెల్, అంతర్జాతీయ మధ్యవర్తుల మధ్య నమ్మకం, సహకారంపై వంటి కీలక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com